

డీఎంకే అధినేత కరుణానిధిని చెన్నైలో ఆదివారం ఆయన స్వగృహంలో కలిసిన ప్రముఖ నటుడు కమల్‌హాసన్

ఆంధ్రప్రభ

Estd 1938

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 62 • సంచిక: 40 • సోమవారం 19 ఫిబ్రవరి 2018 • విజయవాడ ❋ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ చవితి తె. 3.55 వరకు, అనంతరం పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12.44 వరకు, అనంతరం రేవతి; అమృతకాలం: ఉ.7.45 నుండి 9.25 వరకు; వర్జ్యం: రా. 1.15 నుండి 2.50 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

• పీఎన్‌బీ కుంభకోణం

Punjab National Bank

200 డొల్ల కంపెనీలు.. బినామీ ఆస్తులు

సీబీఐ, ఈడీ దర్యాప్తులో వెలుగుచూస్తున్న నిజాలు

5

డజనుకు పైగా ఆస్తుల జప్తు?

దోషుల్లా ప్రవర్తించకండి

మోడీజీ.. మౌనం వీడండి: రాహుల్



మోసానికి ముద్దుపేరు వజ్రం

అక్రమార్కుల పాలిట కల్పవృక్షం

మనీలాండరింగ్‌కు దగ్గరి దారి

పీఎన్‌బీ స్కాంలో కొత్తకోణం

5

వజ్రాల వ్యాపారం సాక్షిగా మోసగాళ్ళు సిండికేట్‌గా మారుతున్నారు. పేజ్ త్రీ సొసైటీలో సెలబ్రిటీలుగా చలామణి అవుతూ బ్యాంకులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. వజ్రాల వ్యాపారుల మధ్య అపవిత్ర బంధం వెలుగుచూసింది.

ఆటే... ఆయుధం!



ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది జరిగిన ఆత్మహత్యల్లో 17శాతం భారత్‌లోనే జరిగాయి. మన దేశంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ ప్రతి ఐదుగురిలో నలుగురు 18 నుంచి 45 ఏళ్ళ మధ్య వయస్కులే. దేశంలో 4.25 కోట్ల మంది మానసిక రుగ్మతలతో ఇబ్బందులకు గురౌతున్నారు. వీరిలో 85 శాతం మంది 18 నుంచి 60 ఏళ్ళ లోపువారే. ప్రపంచంలో మరే దేశంలోనూ లేని ఒత్తిడి భారతీయుల్ని సతమతం చేస్తోంది. ఇందుకు కారణం కొన్ని దశాబ్దాలుగా దేశంలో మారిన జీవనసరళితోపాటు చిన్నతనం నుంచి శారీరక, మానసిక దృఢత్వం పెరిగే శిక్షణకు భారతీయులు దూరం కావడమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

దృఢచిత్తానికి క్రీడలే దివ్య ఔషధం

• శక్తివంతమైన జాతిగా చైనీయులు • మానసిక దృఢత్వమే వారి పెన్నిధి • ఒత్తిళ్లతో భారతీయులు సతమతం • మార్కులు, ర్యాంకులు, కొలువులపైనే ధ్యాస • ప్రకోపించిన రుగ్మతలతో ఆత్మహత్యలు • చైనా విధానాలను అందిపుచ్చుకోవాలి

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి) ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా ఇప్పుడు చైనీయులు గుర్తింపు పొందుతున్నారు. దాదాపు అన్ని రంగాల్లోవారు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఇందుకు కారణం చైనీయుల్లో చిన్నతనం నుంచి క్రీడలు, శారీరక, మానసిక దృఢత్వాల్ని పెంచడమే. రెండేళ్ళ వయస్సు నుంచే పిల్లల్ని పలురకాల క్రీడలవైపు వారు ప్రోత్సహిస్తు న్నారు. ముఖ్యంగా స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్రాంగణాల్ని నెలకొల్పింది. సుశిక్షితులైన తర్ఫీదు పొందిన కోచ్‌లను తగినంత మందిని నియమించింది. చైనీయుల్లో సైనికరంగం పట్ల కూడా చిన్నతనం నుంచి ఆసక్తి పెంచుతున్నారు. చదువుకు సమాంతరంగా వారిని ఈ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్ని కేవలం ఆటలుగానే కాకుండా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచే విధంగా వారిని సుశిక్షితుల్ని చేస్తున్నారు. ఆఖరకు చైనాలో ఒలింపిక్స్ జరుగు తున్నా అక్కడి యువకులు తమ సంప్రదాయ క్రీడలకు మాత్రమే ఆకర్షితులయ్యారు. విదేశీ క్రీడలవైపు ఏమాత్రం మొగ్గుచూపలేదు. అదే భారత్‌కొచ్చేసరికి చూడటం తప్ప ప్రోత్సహించడం కరవైంది. కొంతకాలంగా క్రీడల్ని జూదంగా మార్చేశారు. రెండు దశాబ్దాలుగా ఐటి రంగం జోరందుకోవడంతో ఐదంకెల జీతాలు అవలీలగా లభిస్తున్నాయి. ఇది తల్లిదండ్రుల ఆలోచనా వైఖరిని అనూహ్యంగా ➪ 3వ పేజీలో...



టీ-20 సిరీస్‌లోనూ... అదే జోరు!

• 28 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా తొలి మ్యాచ్‌లో విజయం • రాణించిన శిఖర్ ధావన్ • మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ భువనేశ్వర్ కుమార్

వివరాలు స్పోర్ట్స్ పేజీలో...

కేంద్రంపై తెదేపా అవిశ్వాసం పెడితే

మద్దతిస్తాం



7

• చంద్రబాబు తానా అంటే.. పవన్ తందానా
• నిజనిర్ధారణ కమిటీతో ఏం తేలుస్తారు?
• టీడీపీ, జనసేనపై నిప్పులు చెరిగిన జగన్
• ప్రత్యేక హోదా కోసం పోరాడదాం కలిసి రండి
• అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీని విస్తరిస్తానని ప్రకటన

హోదా కోసం కలిసి నడుద్దాం

విజయవాడ రౌండ్ టేబుల్ సమావేశం

7



జనంలోకి వెళదాం

• ఏం చేసిందీ చెబుదాం • వ్యూహం మార్చిన కమలం • పదాధికారుల సమావేశంలో నేతల భిన్నాభిప్రాయాలు • హరిబాబుతో వాగ్వాదం

అమరావతి ఆంధ్రప్రభ: బీజేపీ రాష్ట్ర నేతల స్వరం మారింది. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ నాయకుల వ్యాఖ్యలపై మండిపడిన బీజేపీ నేతలు వ్యూహం మార్చారు. ఇప్పటి నుంచి కేంద్రప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి చేసిన, చేస్తున్న కృషిని, సహకారాన్ని ప్రజలకు వివరించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. అధికార తెలుగుదేశం పార్టీ వ్యవహారశైలిపై ముఖ్యంగా అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలతో బీజేపీలో అంతర్మథనంలో పడింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని ఒక హోటల్‌లో ➪ 7వ పేజీలో...

హామీలు అమలు చేస్తున్నాం: హరిబాబు -2

సీట్ల పెంపునకే బాబు యత్నాలు

కాంగ్రెస్‌తోనే ఏపీకి న్యాయం : జై రామ్ రమేష్

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్రప్రయోజనాల కోసం 29 సార్లు ప్రధానమంత్రిని కలిశానని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకోసం అసెంబ్లీ సీట్లను పెంచుకోడానికి మాత్రమే ప్రయత్నించారని కేంద్ర మాజీమంత్రి జైరాం రమేష్ విమర్శించారు. తిరుపతిలో 2014లో గర్భవతుల వైద్య సేవల కోసం తాను ప్రారంభించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రెగ్నెంట్ ఉమెన్ భవన సముదాయాన్ని ఆదివారం ఆయన స్థానిక మాజీ ఎంపి చింతా మోహన్‌తో కలిసి సందర్శించారు. ప్రారంభించి ➪ 2వ పేజీలో...

త్రిపుర ప్రశాంతం

పోలింగ్ 74 శాతం

5

జొర..!



కడప జిల్లాలో దారుణం

ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలు

• ఎర్రచందనం కూలీలా? • పోలీసు గాలింపులతో చెరువులో దూకారా? • మృతికి వెనుక కారణాలపై సందేహాలు • కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



రాజంపేట, ప్రభ న్యూస్: కడప జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. జిల్లాలోని ఏకశిలా నగరంగా గుర్తింపు పొందిన ఒంటిమిట్ట చెరువులో ఆదివారం ఐదు మృతదేహాలు లభించడం సంచలనం రేకెత్తించింది. మృతికి గల కారణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడురోజుల క్రితం చెరువులో పడి మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న కడప ఓఎస్‌డి ఆత్నాన్ నయీమ్ హసీమ్, రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మంల ఆధ్వర్యంలో జిల్లా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో చెరువులోని ఐదు మృతదేహాలను వెలికితీశారు. ఐదుగురి శరీరాలపై షర్టులు నడుంకు టవళ్ళు ఉన్నాయి, అలాగే వెనుకవైపు స్టూడెంట్స్ బ్యాగులు తగిలించుకుని ఉన్నారు. బ్యాగులను పరిశీలిస్తే అందులో అన్నం పొట్లాలు, తాగునీటి సీసాలు, టార్చిలైట్లు ఉన్నాయి. దీంతో వీరు ఎర్రచందనం అక్రమ రవాణాలో పాల్గొనే తమిళ కూలీలా లేక పాదచారులా అన్న ➪ 7వ పేజీలో...



అంతరిస్తున్న 42 భాషలు

ఏపీలో రెండు... గాడబా, నాయకి!

న్యూఢిల్లీ: ఇండియాలో సుమారు 40కిపైగా భాషలకు ముప్పు పొంచి ఉందని సెన్సెస్ డైరెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ భాషలు మాట్లాడేవారు కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఉన్నారన్నారు. సెన్సస్ రిపోర్టు ప్రకారం భారతదేశంలో 22షెడ్యూల్ లాంగ్వేజస్, 100నాన్ షెడ్యూల్డ్ లాంగ్వేజేస్ ఉన్నాయన్నారు. ఈ భాషలు మాట్లాడేవారి సంఖ్య లక్ష అంతకు మించి ఉందన్నారు. ఏదేమైనా సుమారు 42భాషలు ప్రమాదకర స్థితిని ఎదుర్కొంటున్నాయన్నారు. ఆయా భాషలు మాట్లాడేవారి సంఖ్య పదివేలకంటే తక్కువగా ఉందన్నారు. యునెస్కో వెల్లడించిన నివేదిక ప్రకారం ఇండియాలో 42 భాషలు, మాండలికాలు అంతరించపోయే దశలో ఉన్నాయన్నారు. అపాయకరస్థితిలో ➪ 7వ పేజీలో...

అభ్యర్థుల గుండెల్లో టెట్ 'గంట'

• ఇప్పటికీ గందరగోళమే • ఒకే సమయంలో ఒకే అభ్యర్థికి వేర్వేరు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు • నిర్వహణలో విద్యాశాఖ వైఫల్యంపై విమర్శలు



గోరంట్ల, ప్రభ న్యూస్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహణలో రాష్ట్ర విద్యాశాఖ అవలంభిస్తున్న తీరుతో అభ్యర్థుల్లో ఇప్పటికీ గందరగోళ పరిస్థితులు నెలకొనగా.. మరోవైపు నిర్వహణ తీరుపై పక్క రాష్ట్రాలు నవ్వుకునే పరిస్థితి నెలకొన్నది. టెట్ నిర్వహణలో విద్యాశాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. విద్యా శాఖ అవలంభిస్తున్న తీరుతో పరీక్షరాసే అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రుల గుండెల్లో గుబులు పుట్టించడం లాంటి తీవ్ర గందరగోళ పరీక్షఇదే అన్నది రికార్డులకు ఎక్కే పరిస్థితి. సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో టెట్ ఆన్‌లైన్ నిర్వించాలన్న తపన సబబే. అయితే ఆన్‌లైన్ నిర్వహణకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్‌నెట్‌తో కూడిన కంప్యూటర్‌లు అందుబాటులో ఉన్న కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలలు ఆ స్థాయిలో ➪ 7వ పేజీలో...



రెండు పరీక్షలు ఒకే రోజు రెండు జిల్లాల్లో కేటాయించిన అభ్యర్థి హాల్ టికెట్స్

విభజన చట్టం ఘోస్ట్ రైటర్

జైరాం రమేష్

- విభజన సమయంలో ఆడిన డ్రామాలు ప్రజలు మర్చిపోలేదు
- ప్రస్తుత ఆర్థిక పరిస్థితికి పూర్తి బాధ్యత ఆయనదే
- అమరావతిని మయసభతో పోల్చటం బీజేపీ నేతలకు తగదు: రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు



అమరావతి, ఆంధ్రప్రభ: ఏమాత్రం స్పష్టత లేని రాష్ట్ర విభజన చట్టం ఘోస్ట్ రైటర్ జైరాం రమేష్ అని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. ఈమేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అసమాన విభజన కపట నాటక సూత్రధారి జైరాం రమేష్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో జైరాం రమేష్ ఆడిన డ్రామాలు ప్రజలు మరిచిపోలేదని, తెలుగుదేశం పార్టీని విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. మార్చలేనన్ని తప్పులు చేసి ఇప్పుడు మార్చండి అని అనటం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. దమ్ముంటే శాస్త్రీయంగా మార్చండి అనటంలోనే ఎంత అశాస్త్రీయంగా చట్టం చేశారో తెలిసిపోతోందని, తాము చండాలం చేశాం, మీరు శుభ్రం చేయండి అనటం జైరాం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. చట్టంలో యూజ్ ఫర్ ఫిజిబిలిటీ, విల్ అబ్జర్వ్, షల్ ఎగ్జామిన్ పదాలన్నీ జైరాం నిర్వాహకాలేనన్నారు. ఒక్క దుగ్గరాజుపట్నంకు తప్ప మిగిలిన విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ప్లాంట్ ఫ్యాక్టరీ, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ తదితర అంశాలు వేటికీ తప్పనిసరిగా చేయాలనే స్పష్టత ఇవ్వకుండా అడ్డదిడ్డంగా చేసిన పాపం కాంగ్రెస్ పార్టీదేనన్నారు. అవకాశం ఉంటే చేయండి అని రాసింది మీరు కాదా అని ప్రశ్నించారు. లేకుంటే చేయవద్దనే కదా మీ ఉద్దేశం, మీరు అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సినదంతా చేసి ఇప్పుడు మార్చండి అనటం రాక్షసనీతికి అద్దంపడుతోందని మంత్రి యనమల ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ఆర్థికపరిస్థితికి పూర్తి బాధ్యత జైరాం రమేష్‌దేనని, ఉద్దేశపూర్వకంగానే లోపభూయిష్టమైన చట్టం చేసి ఏపీకి తీరని అన్యాయం చేశారని, అశాస్త్రీయంగా చట్టం చేసిన మీరు, ఆంధ్రులను అవహేళన చేయటం మానుకోవాలన్నారు. రెండు సార్లు రాజ్యసభకు పంపి కేంద్రమంత్రి అయ్యేందుకు అవకాశం ఇచ్చిన ఏపీకి తీరని ద్రోహం చేశారని ఆగ్రహించారు. డ్రామాలు ఆడినందువల్లే రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పారని, జైరాం కన్నీటికి మొసళ్లు కూడా సిగ్గుపడుతున్నాయని మండిపడుతూ పోలవరంపై ఆయన చేసిన ఆరోపణలను మంత్రి యనమల ఖండించారు. పోలవరంపై తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలని, ఆధారాలుంటే బయట పెట్టాలని మంత్రి డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల వ్యాఖ్యలపై స్పందిస్తూ ఏపీ రాజధాని అమరావతిని మయసభతో పోల్చి మాట్లాడటం తగదన్నారు. చారిత్రాత్మక స్థలంలో నిర్మిస్తున్న చారిత్రాత్మక రాజధాని బీజేపీ నేతలకు మయసభలా కనిపిస్తోందా అంటూ ప్రశ్నించారు. 21వ శతాబ్దంలో నిర్మిస్తున్న రాజధాని ప్రపంచస్థాయిలో నిర్మించాలనేది ఆంధ్రుల ఆకాంక్షని, ఢిల్లీ స్థాయిలో నిర్మించమని, ఖజకిస్థాన్, సోవియట్ రష్యా రాజధానులను పరిశీలించమని ప్రధాని మోడీయే చెప్పిన విషయాన్ని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. అలాంటి అమరావతిని మయసభతో పోల్చి ఆంధ్రులను అవహేళన చేయటం తగదని మంత్రి యనమల హితవు పలికారు.

విభజన హామీలు

అమలు చేస్తున్నాం



- రాజకీయాలు వద్దు ● రాష్ట్రాభివృద్ధిపై ప్రజలకు వివరిద్దాం ● ఆర్థికలోటు రూ.20 వేల కోట్ల చెల్లింపునకు కేంద్రం సిద్ధం ● విడిపోవడంవల్లే విజయవాడ, తిరుపతి, విశాఖ అభివృద్ధి ● రాజధాని భవనాలకు డీపీఆర్ లేకుండానే రూ.2500 కోట్లు: బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో అధ్యక్షుడు హరిబాబు

అమరావతి ఆంధ్రప్రభ : విభజన చట్టం హామీల అమలుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, విభజన హామీలను కేంద్రం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అన్నారు. బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడ లోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. తాము రాజకీయ లబ్ది కోసం ప్రయత్నించడం లేదని, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకే కేంద్రం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. అయితే రాష్ట్రానికి కేంద్రం ఏయే పథకాలకు సంబంధించి నిధులు ఇచ్చిందన్న వాస్తవ అంశాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ క్యాడర్‌పై ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధిపై జరుగుతున్న చర్చ కేంద్రంపై కొందరు చేస్తున్న విమర్శలు ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయని, ఆనాడు అధికారంలో ఉన్న పార్టీలు అభివృద్ధిని ఆమడ దూరంలో ఉంచాయని పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ అవలంభించిన విధానాలపై హరిబాబు ధ్వజమెత్తారు. ఎన్నికల్లో లబ్ది పొందాలనే యోచనతో రాష్ట్రాన్ని అడ్డగోలుగా కాంగ్రెస్ విభజించేందుకు ప్రయత్నించి పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అసమగ్రంగా రూపొందించిందని ఆయన ఆరోపించారు. అయితే ప్రధాని మోడీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నవాటితో పాటు లేని సంస్థలను ఏర్పాటు చేస్తు రాష్ట్రాభివృద్ధికి చేయూతనిస్తున్నారని అన్నారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు లేని రాష్ట్రాలకు ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకు గాను 14వ ఆర్థికసంఘం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పినందున హోదా ప్రయోజనాలు లభించేలా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు హరిబాబు. ఏపికి కేంద్రం అన్ని విధాలుగా సాయం చేస్తున్నా తెలుగుదేశం పార్టీ మిత్రపక్షంగా ఉండి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా ఏడు లక్షల కోట్ల విలువైన రహదారులను నిర్మిస్తుండగా ఒక్క ఏపికే లక్ష కోట్ల విలువైన రహదారులను కేటాయించిన విషయాన్ని దేశం నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. వెంకయ్య నాయుడు పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్నపుడు 6.20 లక్షల ఇళ్లను ఏపికి కేటాయించిన విషయం వాస్తవం కాదా..అని ప్రశ్నించారు. ఏడు వెనుకబడిన జిల్లాలకు ఏడాదికి యాభై కోట్ల చొప్పున ఇప్పటి వరకు 1050 కోట్లు ఇచ్చిందని, ఆయా జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధికి పలు రాయితీలను కేంద్రం ప్రకటించిన విషయాన్ని హరిబాబు గుర్తు చేశారు. రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్, దుగరాజు పట్నం పోర్టు అంశాలు కేంద్రం పరిశీలనలో ఉన్నాయని, రైల్వే జోన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వారితో కేంద్రం ఇప్పటికే చర్చలు ప్రారంభించిందన్నారు. పోర్టుకు సంబంధించి ప్రత్యామ్నాయంగా స్థలం సేకరిస్తే పోర్టు నిర్మాణానికి కేంద్రం సుముఖంగా ఉందన్నారు. ఆర్థికలోటు 20 వేల కోట్ల చెల్లింపునకు కేంద్రం సిద్ధంగా ఉందని, ఇప్పటికే నాలుగువేల కోట్లు ఇచ్చామని, ఈ వ్యత్యాసాన్ని ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ లోటుపై స్పష్టత లేదని, రుణ మాఫీని కూడా ఇందుపై జత చేయడం వల్ల కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. అయినా రాష్ట్రప్రభుత్వంతో కేంద్రం సాగిస్తున్న చర్చలు కొలిక్కి వస్తున్నాయన్నారు. రాష్ట్రం విడిపోవడం వల్లనే విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. బడ్జెట్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని, బడ్జెట్‌లో ఏపికి అన్యాయం జరిగిందన్నది అవాస్తవమని హరిబాబు అన్నారు. సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి హైద్రాబాద్ కేంద్రంగా జరిగిందని, మరోమారు ఆ మాదిరి తప్పు జరగకుండా ఉండాలన్నది తమ పార్టీ ఉద్దేశ్యమని అన్నారు. బిజెపి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి రవీంద్ర రాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పి మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, ఎంపి గోకరాజు గంగరాజు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు విష్ణుకుమారరాజు, ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీ మాధవ్, మాజీ కేంద్ర మంత్రులు కావూరి సాంబశివరావు, పురంధేశ్వరి, ప్రధాన కార్యదర్శులు జమ్ముల శ్యాంకిషోర్, సురేష్‌రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు కూడా పదాధికారుల సమావేశంలో పాల్గొన్నారు.


టీడీపీ, ఇతర పార్టీల కుట్రలపై సమావేశంలో చర్చించాం : ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

రాష్ట్రాభివృద్ధికి బిజెపి చేసిన, చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకువెళతామని బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. మిత్రపక్షమైన టిడిపితో సహా, ఇతర రాజకీయ పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, పార్టీపై చేస్తున్న కుట్రలపై పదాధికారుల సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. విజయవాడలో ఆదివారం బిజెపి పదాధికారుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో అనేక విషయాలపై హామీలు ఇచ్చిందని కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే అమలు చేసిందని ఆరోపించారు. మిత్రపక్షంగా తాము మిత్రధర్మాన్ని ఇప్పటి వరకు పాటిస్తూ వస్తున్నామన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ఇతర సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు చెప్పకుండా అధికార తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తుందని విమర్శించారు. రెవెన్యూ లోటు అంశంలో వాస్తవానికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్లు, రైతు రుణమాఫి వంటి అంశాలను రెవెన్యూ లోటులోకి చేర్చారని ఇది మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన అంశాలపై తాము ఒక బృందంగా ఏర్పడి వాటన్నింటిని సాధించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఆయన స్పందిస్తూ దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో టిడిపి ఎంపీల వ్యవహారశైలిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.

మహానుభావులందరికీ

ధన్యవాదాలు

- లోతైన చర్చలు పారదర్శకంగా జరిగాయి ● నాకెంతో సంతృప్తినిచ్చాయి ● జేఎఫ్‌సీ ఉప కమిటీల వివరాలు త్వరలో వెల్లడిస్తా!: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనల వల్ల ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించడానికి జనసేన చొరవతో ఏర్పాటైన ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సీ) సమావేశాలను విజయవంతం చేసిన మహానుభావులందరికీ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. తన ప్రయత్నాన్ని ఆశీర్వదించి,ప్రోత్సహిస్తున్న తెలుగు వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. రెండు రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో లోతైన చర్చలు పారదర్శకంగా జరిగాయని అన్నారు. న్యాయ కోవిదులు,ప్రజా పరిపాలనలో అనుభవజ్ఞులు,రాజకీయాలలో అపారమైన అనుభవం ఉన్న ప్రజా నేతలు పెద్ద మనసుతో, తెలుగు ప్రజలకు మేలు కలగాలన్న బలమైన కాంక్షతో ఈ చర్చల్లో పాల్గొనడం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలు, ఆ తర్వాత ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు,తెలుగు రాష్ట్రాలకు వచ్చిన నిధులు వంటి అంశాలపై కమిటీలో ఉన్న నిపుణులు విశ్లేషించడం ప్రారంభించారని అన్నారు. జె.ఎఫ్.సి కొన్ని ఉప కమిటీలను నియమించిందన్నారు. వాటి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామన్నారు.

జె.ఎఫ్.సి.కి అవసరమైన రాజ్యాంగ పూర్వక సలహాలను అందించడానికి సుముఖత వ్యక్తం చేసి, సమావేశానికి హాజరైన జస్టిస్ గోపాల్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా సమావేశాలలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్‌నారాయణ, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్య కార్యదర్శిగా పని చేసిన ఐవీఆర్ కృష్ణారావు, ఐఏఎస్ అధికారిగా పని చేసిన తోట చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను అడగ్గానే కార్యక్రమంలో పాల్గొనడానికి అంగీకారం తెలిపిన సీనియర్ పార్లమెంటేరియన్ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఎం, సీపీఐ కార్యదర్శులు మధు,రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ ప్రతినిధులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, వివిధ రంగాల్లో నిపుణులైన ప్రమోద్‌రెడ్డి, అరుణ, తార, మహేశ్వర్‌పేరి, అమీర్‌ఖాన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జేఎఫ్‌సీ వివరాలను ప్రభుత్వ ప్రతినిధి ద్వారా అందజేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా జేఎఫ్‌సీ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

సీట్ల పెంపునకు బాబు యత్నాలు



(మొదటి పేజీ తరువాయి)

నాలుగేళ్లయినా రాష్ట్రప్ర భుత్వం ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురాక పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆ భ వన ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైరాం రమేష్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని విభజించినప్పుడు యుపిఎ ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలతో విభజన చట్టాన్ని రూపొందించిందన్నారు. కానీ అటు చంద్రబాబు ఇటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా శాస్త్రవేత్తలుగా మారిపోయి రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించారని ఆరోపిస్తూనే ఉన్నారన్నారు. అదే నిజమైతే గత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా అశాస్త్రీయ విభజన చట్టాన్ని సశాస్త్రీయంగా మార్చడానికి చంద్రబాబు ఎందుకు ప్రయత్నించలేదన్నారు. రాష్ట్రం కోసం 29 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చానని చెప్పుకుంటున్న చంద్రబాబు అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కు పెంచుకోడానికే ఎక్కువగా కృషి చేశారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదన్నారు. ఇతర పార్టీల నుంచి తమ పార్టీలో చేరిన శాసనసభ్యులతో పాటు తమ పార్టీలో ఉన్న నాయకులకు అసెంబ్లీ స్థానాలు కల్పించడంపైనే ఎక్కువ శ్రద్ధ కనబరిచారని జైరాం రమేష్ ఆరోపించారు. చివరకు కీలకమైన కేంద్ర బడ్జెట్ సమావేశం జరుగుతున్న రోజున కూడా చంద్రబాబు, తన సన్నిహితుడైన సుజనాచౌదరితో కలిసి దుబాయ్ యాత్రలో ఉన్నారని, పార్లమెంట్‌లో పాల్గొన్న ఏకైక తెలుగుదేశం సభ్యులు సిఎం రమేష్ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కనుసన్నల మేరకు నాటకాలాడారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆడుతున్న నాటకాలను కట్టిపెట్టి 30వ సారి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రిని కలిసి రాష్ట్రానికి మోసం చేసినందున కలిసి ఉండలేమని చెప్పి తెగ తెంపులు చేసుకుని రావాలని జైరాం రమేష్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీ వల్ల మాత్రమే సాధ్యమవుతుందన్నారు. తొలినుంచి ప్రత్యేక హోదాపై పట్టుపట్టకుండా, మధ్యలో ప్యాకేజికి అంగీకరించి, నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు అన్యాయం జరిగిందనడం కేవలం రాబోయే ఎన్నికల కోసం ఆడుతున్న డ్రామానే తప్ప మరొకటి కాదని ఆయన స్పష్టం చేశారు. మాజీ ఎంపి చింతామోహన్ యుపిఎ ప్రభుత్వ హయాంలో తాను పోరాడి సాధించుకుని వచ్చిన ప్రెగ్నెంట్ ఉమన్ ఆసుపత్రికి అవసరమైన నిధులు మంజూరు చేసి, ప్రారంభించక పోవడాన్ని నిరసించారు. తమ హయాంలో శంకుస్థాపన చేయించిన కేన్సర్ ఆసుపత్రిని పట్టించుకోకుండా టాటా సంస్థ ఏర్పాటు చేయబోయే కార్పొరేట్ కేన్సర్ ఆసుపత్రి కోసం కోట్ల విలువచేసే స్థలాలను దారాదత్తం చేయడం దారుణమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన తర్వాత పోలీస్‌ఫోర్స్ తగ్గింది



అనంతపురం కార్పోరేషన్, ప్రభ న్యూస్: రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో పోలీస్‌ఫోర్స్ తగ్గిందని రెండునెలల్లో ఐదువేల నుంచి 6వేల పోస్టులు ఇస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. అనంతపురంలో నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన

రెండు నెలల్లో 5 నుంచి 6 వేల పోస్టుల భర్తీ: చినరాజప్ప

అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని హోంగార్డులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చనిపోతే పోలీసులకు వచ్చేఅన్ని సౌకర్యాలు అమలయ్యేలా చూస్తామని ఆయన అన్నారు. మూడేళ్లకుపైగా డిఎస్పీ, ఎస్ఐ స్థాయి అధికారులు బదిలీలేకుండా వుంటే వెంటనే వారికి బదిలీలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పదోన్నతులు ఇవ్వడానికి కొన్ని సమస్యలు వున్నాయని పరిష్కరించిన తర్వాత చేపడుతామన్నారు. అయితే ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి వుంటామన్నారు.

సుస్థిర అభివృద్ధికి

ఏపీ చర్యలు భేష్

- ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సులో అంతర్జాతీయ నిపుణుల ప్రశంసలు
- అమరావతిలో అంతర్జాతీయ ఇంధన సామర్థ్య సదస్సు! ● ఏపీ ప్రభుత్వానికి టీఈఆర్ఐ సూచన ● హరిత భవనాల అభివృద్ధికి అమరావతికి సహకరిస్తాం
- అమరావతిలో 9 నగరాల అభివృద్ధికి వికేంద్రీకృత వ్యవస్థ



ఇంధన వనరుల సంస్థ (టీఈఆర్ఐ) ఛైర్మన్ డాక్టర్ అజయ్ మాథుర్

అమరావతి, ఆంధ్రప్రభ: సుస్థిర అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శనీయమని ఇంధన వనరుల సంస్థ (టీఈఆర్ఐ) ఛైర్మన్ డాక్టర్ అజయ్ మాథుర్ కొనియాడారు. ఢిల్లీలో నిర్వహించిన ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సు(డబ్ల్యూఎస్డీఎస్)-2018 ఆదివారం ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా అజయ్ మాథుర్ అమరావతి అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు. అమరావతిలో హరిత భవనాల అభివృద్ధికి టీఈఆర్ఐ సహకరిస్తుందని చెప్పారు. అమరావతిలో అంతర్జాతీయ ఇంధన సామర్థ్య సదస్సు నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. అమరావతి ప్రపంచంలోనే అత్యంత సుస్థిర రాజధాని నగరం కానున్నదని, ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. అమరావతిలో అద్భుతమైన 9 నగరాలు నిర్మించనున్నారని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందని కితాబిచ్చారు. దేశంలో వేగంగా పెరిగిపోతున్న పట్టణీకరణవల్ల స్థానిక సంస్థలు నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి విషయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఏపీ ప్రభుత్వం ఉత్తమ విధానలతో ముందుకు వెళ్తుందని సదస్సులో పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని అభినందించారు.

సదస్సులో ఏపీ ప్రభుత్వం తరపున పాల్గొన్న ఇంధన, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, సీఆర్డీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ సుస్థిర అభివృద్ధికి అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. ప్రస్తుతం పట్టణీకరణ శరవేగంగా పెరిగిపోతుందని, ఫలితంగా పర్యావరణ సమతౌల్యం, వాయు కాలుష్యం, వాతావరణ మార్పులు, విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దడంపై మనం అత్యవసరంగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన నగరాల నిర్వహణ, పట్టణీకరణ వల్ల పెరుగుతున్న ఒత్తిడిని తొలగించేందుకు మార్గాలను అన్వేషించాలన్నారు. అమరావతిని ప్రపంచంలోనే అత్యంత సుస్థిర రాజధాని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు అజయ్‌జైన్ వెల్లడించారు. అమరావతిలోని 9 నగరాలను ఆర్థిక వ్యవస్థకు కీలకంగా, ఆదాయ వనరులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది నగరాల్లో వాక్‌టు వర్క్ వాతావరణం వల్ల నాణ్యమైన జీవనశైలితోపాటు ఉద్యోగ సృష్టి, పట్టణ ప్రాంతాల్లో అదనపు గృహ నిర్మాణాలు, పెరిగిన పట్టణీకరణ అవసరాలను తీర్చడం, స్వయం సుస్థిర జీవావరణ వ్యవస్థ కలిగిన నగరాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న నగరాలపై భారాన్ని తగ్గించేందుకు నూతన పట్టణాలను సృష్టించడం వంటి కీలక విధానాలను అవలంభిస్తున్నట్లు అజయ్ జైన్ తెలిపారు. వీటితోపాటు కాలుష్య రహిత ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్, హరిత పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, బ్యాంకు, వివిధ ఆర్థిక సంస్థలు, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలు, లాజిస్టిక్స్ వంటి సర్వీసులు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా సుస్థిరమైన ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం పర్యావరణ అనుకూల సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఆర్థికవృద్ధికోసం ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను స్వీకరించడం వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు.

ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధికి నవీన, సుస్థిర సాంకేతిక అంశాలను తమతో పంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారని సదస్సులో పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ నిపుణులకు అజయ్ జైన్ తెలియ జేశారు. అమరావతి నగర అభివృద్ధికి 35 ఏళ్లలో మూడు దశల్లో వివిధ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ప్రపంచ బ్యాంకు మద్దతుతో అమరావతి సుసిర రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్టు (ఏఎస్సీసీడీసీ)ను ఏర్పాటు చేశమని, ఇది అమరావతికి అవసరమైన ప్రాథమిక, కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకరిస్తుందని వెల్లడించారు. వరద తీవ్రతను తగ్గించడం, పారిశుద్ధ్యం, రాజధానిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రహదారుల అనుసంధానం, పట్టణ పాలనా సంస్థల సామర్థ్యాన్ని పెంచడం వంటి సేవలందించడమే ఏఎస్సీసీడీసీ లక్ష్యమని తెలిపారు.

రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చేలా సమీకృత టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాల్నది సీఎం చంద్రబాబు ఆకాంక్ష, విజన్ అని అజయ్‌జైన్ వివరించారు. 2029 నాటికల్లా ఏపీలో పట్టణ జనాభా 42 శాతం నుండి 45 శాతంకు చేరుతుందని చెప్పారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక నగరాలను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తోందని చెప్పారు. అమరావతిలో తొమ్మిది నగరాలు, న్యాయ నగరం, విద్యా నగరం, మేథో నగరం, క్రీడా నగరం, ఆర్థిక నగరం, ఎలక్ట్రానిక్ నగరం, ఆరోగ్య నగరం, ప్రభుత్వ నగరం, పర్యాటక నగరంలను ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు వికేంద్రీకృత వ్యవస్థను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నగరాల్లో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు ఉంటాయన్నారు. 135 కి.మీ. మేర ప్రజా రవాణా కారిడార్లు, వెయ్యి కి .మీ. పైగా రోడ్డు నెట్‌వర్కు, 2050 కల్లా ఇక్కడ నివసించే 25 లక్షల మందికి అవసరమైన ఇళ్లు సమకూర్చడం, 18 లక్షల ఉద్యోగాల కల్పన, ఆవాస ప్రాంతాల్లో 40 శాతం భూములను హరిత ప్రాంతాలుగా మార్చడం, 30 కి.మీ. మేర ఆహ్లాదకరమైన నదీ తీర ప్రాంతం, 5 నుండి 10 నిమిషాలు నడిస్తే ఒక పార్కు ఉండేలా నాణ్యమైన జీవణ ప్రమాణాలు వంటి ఆకర్షణీయమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. అమరావతిలో ఏప్రిల్ 10 నుండి 12 వరకు జరిగే సంతోష నగరాల సదస్సు-2108లో పాల్గొనాలని డబ్ల్యూఎస్డీఎస్ సదస్సుకు హాజరైన జాతీయ, అంతర్జాతీయ నిపుణులను అజయ్ జైన్ కోరారు.

మావోల కొత్త దళపతి తిరుపతి

- గణపతి స్థానంలో దళితనేత ● పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీయే కొత్త దళపతి ● కేంద్ర కమిటీ కార్యదర్శి పదవి నుంచి తప్పుకోనున్న గణపతి
- పోలీసులకు లభించిన పలు కీలక పత్రాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పలు మార్పులు జరుగబోతున్నాయని, కేంద్ర కమిటీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతిని తప్పించి ఆ బాధ్యతలను ఇతరులు ఇతరులకు అప్పగించాలనే చర్చ చాలా కాలంగా జరుగుతుంది. దళిత యువకుడిని లక్ష్మణరావు స్థానంలో నియమించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

కొంత కాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిషాల సరిహద్దులలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరగడంతో పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. కొద్ది రోజుల క్రితం పోలీసులకు మావోయిస్టులకు చెందిన పలు కీలక డాక్యుమెంట్లు లభించాయి. లభించిన డాక్యుమెంట్లను విశ్లేషించగా మావోయిస్టు పార్టీలో నాయకత్వం మార్పు అంశం వెల్లడైనట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో రెండవ స్థానంలో ఉన్న సంబాళ కేశవరావు అలియాస్ బసవరాజ్‌ను కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమించొచ్చని మొదట్లో ప్రచారం జరిగింది. కానీ పార్టీలో ఇటీవలి పరిణామాలతో పాటు దళిత వర్గానికి చెందిన వారికి నాయకత్వం అప్పగించాలన్న ప్రతిపాదనలు రావడంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి పగ్గాలు అప్పగించనున్నట్లు లభించిన డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం పోలీసులు నిర్ధారించుకున్నారు.

అందరికన్నా చిన్నవాడు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న 19 మందిలో తిరుపతి అలియాస్ దేవ్‌జీ అందరికన్నా చిన్నవాడు. దళిత వర్గానికి చెందిన తిరుపతి కేంద్ర కమిటీలో సిసి మెంబర్‌గా ఉన్నారు. చదువుకునే రోజుల నుంచి తిరుపతి తన ప్రియ శిష్యుడు కావడంతో ఆయనపైనే గణపతి మొగ్గుచూపే అవకాశాలున్నాయనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రస్తుతం దేశంలోని విప్లవ సంస్థలు మావోయిజాన్ని, అంబేద్కరిజాన్ని కలిపి ఉద్యమం నిర్మించాలని మేధావులు సూచిస్తున్నారు. పలు సందర్భాల్లో విప్లవ సంస్థల్లోనూ అగ్రవర్ణాల పెత్తనం నడుస్తోందని పరోక్షంగా గణపతిని ఉదహరిస్తూ విమర్శలు కూడా వచ్చాయి. దాంతో మావోయిస్టు పార్టీలోని కేంద్ర కమిటీలో రిజర్వేషన్లు అమలు చేస్తూ మహిళలు, దళితులకు అవకాశమిచ్చారు. తాజాగా గణపతి తప్పుకోనుండటంతో అందరి దృష్టి దళితుడైన తిరుపతిపై పడింది.

2004 నుంచి గణపతి నాయకత్వం


దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రా ల్లో విస్తరించి ఉన్న పీపుల్స్ వార్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కొండపల్లి సీతారామయ్యను 1992లో తొలగించారు. అప్పటి నుంచి గణపతి పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 2004లో విప్లవ సంస్థలన్నీ కలిసి ఏర్పాటైన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయనకు వయసు మీద పడటం, అనారోగ్యం కారణంగా కేంద్ర కమిటీ కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. 2007లో మావోయిస్టు పార్టీ నిర్వహించిన ప్లీనరీ సందర్భంగా నాయకత్వం వహించే వారి వయసు 60 ఏళ్ళ వరకే ఉండాలన్న చర్చ జరిగిందని, అప్పుడే నాయకున్ని మార్చాలనుకున్నారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంతకాలం ఆయననే కొనసాగించారు. వాస్తవానికి అప్పట్లో కేంద్ర కమిటీలో ఉన్న సంబాళ కేశవరావు, ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, ప్రస్తుతం జైళ్లో ఉన్న కోబాడ్ గాంధీలలో ఒకరు కార్యదర్శిగా ఎంపికవచ్చన్న ప్రచారం జరిగింది. ఇక వీరితో పాటు పార్టీ కేంద్ర కమిటీలో కటకం సుదర్శన్, మల్లా రాజి రెడ్డి, వేణుగోపాల్‌రావు, అక్కిరాజు హరగోపాల్, మోడెం బాలకృష్ణ, ఒగ్గు సత్యాజీ, రావుల శ్రీనివాస్, పిప్పిరి తిరుపతి, జీనుగు నర్సింహారెడ్డిలతో పాటు బీహార్ మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్, బీహార్ మావోయిస్టు పార్టీ యూనిట్‌ల నుంచి మరో 10 మంది సీనియర్ నాయకులున్నారు. మొత్తంగా వీరంతా 50 ఏళ్ళు పైబడిన వారే. 12 మందికి 60 ఏళ్ళ వయసు కూడా నిండింది.

రేసులో కంబాళ కేశవరావు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా, పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్ కమాండర్‌గా ఉన్న సంబాళ కేశవరావు అలియాస్ బసవరాజ్‌ను నియమించవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. రెండు మాసాల క్రితం ఛత్తీస్‌ఘడ్‌లోని అబూజ్ మడ్‌లో నిర్వహించిన మావోయిస్టు ప్లీనరీలో ఈ దిశగా ఛర్చించినట్లు తెలిసిందని ఆంధ్రా - ఒడిషా సరిహద్దు (ఎఒబి) పోలీసులు అంటున్నారు. కొన్ని నెలల క్రితం అరెస్టయిన మావోయిస్టుల విచారణలో, ఎన్‌కౌంటర్ల సందర్భంగా లభించిన పత్రాల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైనట్లు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జిఎన్ పేటకు చెందిన సంబాళ కేశవరావు ప్రస్తుతం పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సిఎంసి) చీఫ్ కమాండర్‌గా ఉన్నారు.

ఖజానా శాఖలో వినూత్న మార్పులు

- ఇక ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ జమలు
- నూతనంగా పేపర్‌లెస్ చలానా విధానం
- 26న సీఎం చంద్రబాబు ప్రారంభం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఖజానా శాఖలో వినూత్న మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు అమలవుతోన్న బ్రిటీష్ కాలం నాటి విధానానికి స్వస్తి చెప్పి నూతన విధానాన్ని ఆవిష్కరించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 26న సరికొత్త విధానాన్ని ప్రారంభించనున్నారు. నూతన విధానంలో చలానా విధానం, ట్రెజరీ వెళ్లడం, సంబంధిత ట్రెజరీ బ్యాంకుకు వెళ్లి జమ చేయడం లాంటివి లేకుండా పూర్తిగా ఆన్‌లైన్ చేయనున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ట్రెజరీ ద్వారా జరిగే లావాదేవీలన్నీ పేపర్‌లెస్ కానున్నాయి. గతంలో ఈవిధానాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేసినా సాంకేతిక కారణాలతో మధ్యలోనే ఆగిపోయింది. అయితే తిరిగి నూతనంగా ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టం సర్వీసెస్ (ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్) ద్వారా సమగ్ర ఆర్థిక పర్యవేక్షణ విధానం (సీఎఫ్‌ఎంఎస్)తో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించనున్నారు. సీఎఫ్‌ఎంఎస్ విధానం ద్వారా ప్రభుత్వ చెల్లింపులకు సంబంధించి ట్రెజరీకి వెళ్లే అవసరం లేకుండా పోతుంది. గతంలో ప్రభుత్వానికి సంబంధించిన జమలు చలానా ద్వారా చెల్లించాల్సి ఉంది. దీనికోసం ముందుగా చలానా ఫారంను తీసుకుని ఏ పద్దు కింద జమ చేస్తున్నారో వివరాలు నింపి, ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి నంబర్ వేయించుకొని సంబంధిత స్టేట్ బ్యాంక్ ట్రెజరీ బ్రాంచిలో మాత్రమే జమ చేయాల్సి ఉండేది. నూతన విధానంలో చలానాలు రాసే పనిలేదు. నంబర్ కోసం ట్రెజరీకి వెళ్లాల్సిన అవసరం అంతకంటే లేదు. సంబంధిత ట్రెజరీ స్టేట్ బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం అసలే లేదు. ఏ బ్యాంక్‌లోనైనా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసుకునే సౌలభ్యం నూతన విధానం ద్వారా కలుగనుంది. ప్రభుత్వ జమలకు సంబంధించి ఇకనుంచి నెట్ బ్యాంకింగ్‌ద్వారా, మొబైల్ ద్వారా చెల్లించే సౌకర్యాన్ని కలుగజేయనున్నారు. ఆన్‌లైన్లో వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వివరాలు తెల్సుకుని ఆశాఖ సంబంధించిన పద్దు నంబర్‌ను వేసి ఆన్‌లైన్ ద్వారానే చెల్లించే అవకాశం ఉంది. ఇక భౌతికంగా జమ చేయాలంటే గతంలో సంబంధిత ట్రెజరీ స్టేట్ బ్యాంక్ బ్రాంచిలోనే చెల్లించాల్సి ఉండేది. అయితే ప్రస్తుత విధానంలో ఏ స్టేట్ బ్యాంక్‌లోనైనా చెల్లించే వెసులుబాటును కల్పించారు. టోల్ ఫ్రీ సెంటర్ 24 గంటలు పనిచేయనున్నందున సమాచారాన్ని ఎప్పుడైనా తెల్సుకునే అవకాశం ఉంది. ఇటీవల ఎస్‌బీహెచ్ బ్యాంకులు స్టేట్ బ్యాంక్‌లో విలీనమవడంతో ప్రైవేటు బ్యాంకుల ద్వారా కూడా చెల్లించే సౌలభ్యం ఉన్నట్లు ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ హెడ్ తెలిపారు. కాగా ప్రభుత్వ ఆన్‌లైన్ సేవల ద్వారా ప్రస్తుతం జమల విధానాన్ని అమలు చేయనుండగా త్వరలో ఉద్యోగుల వేతనాల చెల్లింపులు కూడా అమల్లోకి తేనుంది. నూతనంగా అమలయ్యే సీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని ప్రభుత్వానికి చెల్లింపు చేసే వారంతా వినియోగించుకోవాలని పెన్షనర్ల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య సూచించారు.

26న సీఎం ప్రారంభం..

ప్రభుత్వ చెల్లింపులకు సంబంధించిన ఖజానా శాఖ నూతనంగా రూపొందించిన సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానాన్ని ఈనెల 26న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ జమలన్నీ ఆన్‌లైన్, మొబైల్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించే సౌలభ్యం ఉన్నట్లు ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ హెడ్ కృష్ణదేవరాయులు ఆంధ్రప్రభకు తెలిపారు. దీనికి సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్‌ను త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఆటే... ఆయుధం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావితం చేసింది. భారీ జీతభత్యాలందే ఐటి ఉద్యోగాలు లేదా విదేశీ కొలువుల కోసం అవసరమైన విద్యాభ్యాసం వైపు మాత్రమే పిల్లల్ని ప్రోత్సహించడం మొదలైంది. నిత్యం ర్యాంకులు, మార్కు లంటూ వేధించడం తప్ప శారీరక, మానసిక పటుత్వాలు పెంచే యోచన కొరవడింది. భారత్‌లో క్రీడలంటే క్రికెట్ మాత్రమే. ఇక్కడి యువత క్రీడల్ని ఆదరించడమంటే క్రికెట్‌ను చూడటం మాత్రమే. ప్రపంచంలో మరెక్కడా లేనంతమంది క్రికెట్ ఆసక్తిపరులు భారత్‌లో ఉన్నారు. అయితే ఈ క్రీడల్లో నైపుణ్యం సాధించే దిశగా యువతను తీర్చిదిద్దే సుశిక్షితులు మాత్రం ఇక్కడ లభ్యంకారు. ప్రభుత్వం కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో అందుకు తగ్గ అవకాశాల్ని అందుబాటులో ఉంచడంలేదు. పసిప్రాయం నుంచి మార్కులు, ర్యాంకులు లేదా టీవీల ముందు కూర్చుని క్రికెట్ చూడటం తప్ప పిల్లలకు మరోధ్యాస ఉండడంలేదు. ఐటి కొలువుల్లో రోజూ పది నుంచి పన్నెండు గంటల పాటు కుర్చీ నుంచి లేవకుండా పని చేయడం, ప్రాపంచిక సంబంధాలు తెగిపోవడం, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కూడా మానసిక అనుబంధం దూరంకావడంతో పాటు పని ఒత్తిడి వీరి మస్తిష్కాల్ని పట్టిపీడిస్తోంది. త్వరగా మానసిక ప్రకోపాలకు లొంగదీస్తోంది. చిన్నతనం నుంచి జిమ్నాస్టిక్స్ పట్ల ఆసక్తి పెంచాలి. వాస్తవానికి ఇందుకోసం పెద్దపెద్ద క్రీడామైదానాలే అవసరంలేదు. చిన్న చిన్న ప్రాంగణాల్లోనే వీటిపై తర్ఫీదునివ్వొచ్చు. అందుకు తగిన శిక్షణ పొందిన కోచ్‌లు అవసరం. ఈ దిశగా చిన్న పిల్లల్ని ప్రోత్సహించడం ద్వారా కూడా వారిలో శారీరక దృఢత్వాన్ని పెంచొచ్చు.

శక్తివంతమైన జాతిని రూపొందించే క్రమంలో ఇంతవరకు చైనా అమలు చేస్తున్న సంప్రదాయ విధానాల్ని భారత్ పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా చిన్నతనం నుంచి పిల్లల్ని శారీరకశ్రమకు, ఆలోచనా పటుత్వానికి ప్రోత్సహించాలి. కేవలం ఐటి కొలువులు, ర్యాంకులే ప్రాతిపదికగా కాకుండా దృఢచిత్తం అలవడే విధంగా క్రీడలతో పాటు సైనికరంగంవైపు వారిలో ఆసక్తి పెంచాలి. అప్పుడే భారత్‌లో యువత మానసిక దౌర్బాగ్యాలకు లోబడి ఆత్మహత్యల వైపు ప్రేరేపితులు కాకుండా బలమైన జాతిగా మారే అవకాశముంటుంది. ఒకప్పుడు జర్మన్‌లు మాత్రమే శక్తివంతమైన జాతిగా భావించేవారు. వారొక్కరే ఈ ప్రపంచాన్ని ఏలేందుకు సమర్థులమని ప్రకటించుకునేవారు. రాన్రాను ఆ శక్తివంతుల జాబితాలో జర్మన్లు వెనకడుగేశారు. చైనీయులు ఆ హోదాను సంతరించుకున్నారు. అలాగని ఒక్కరాత్రితో చైనీయులు ప్రత్యేకజాతిగా ఆవిర్భవించలేదు. తరతరాల నుంచి శారీరకశ్రమను నమ్ముకోవడంతో పాటు అవసరమైతే విదేశాలకెళ్లి మరీ చెమటోడ్చారు. పసితనం నుంచి కూడా పిల్లల్ని అందుకను గుణంగా తీర్చిదిద్దారు. భారత్ ఇప్పటికైనా పురాతనమైన తన జాతి ఒకప్పటి శక్తి సామర్థ్యాల్ని, దృఢచిత్తాన్ని తిరిగి సాధించుకుని ప్రపంచంలో మేటిగా మారేందుకు ఇప్పటి నుంచైనా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

మూడు రకాల బియ్యంతో..
క్యాన్సర్ మటుమాయం!

- గత్వాన్, మహారాజీ, లైచాలో అధిక ఔషధ గుణాలు
- గిరిజన ప్రాంతాల్లో ఈ బియ్యమే ఔషధం

రాయ్‌పూర్ : క్యాన్సర్.. ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో ప్రధానమైంది. వయస్సుతో సంబంధం లేకుండా అందరిని కబలించివేస్తున్నది. శరీరంలో ఏదైనా గడ్డ లాంటి పరిమాణం ఉన్నా.. లేదంటే అన్యాహ్యా మార్పులను కొందరు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుంటారు. వాటిలో కొన్ని చిన్నపాటి వ్యాధులు ఉంటే.. మరికొన్ని ప్రాణాంతకమైనవి ఉంటాయి. క్యాన్సర్ వంటి జబ్బులను తొందరగా గుర్తించలేం. లోతుగా విశ్లేషిస్తే తప్ప ఆ ప్రాణాంతకమైన వ్యాధి అని నిర్ధారించుకోలేని పరిస్థితి. గతంలో క్యాన్సర్ బారినపడితే చాలు చావే శరణ్యంగా ఉండేది. కానీ టెక్నాలజీ పెరగడంతో ఈ వ్యాధిపై కూడా విజయం సాధించారు. కానీ చాలా ఖర్చుతో కూడుకున్న వైద్యం. పేదోడికి క్యాన్సర్ వస్తే కాటికి వెళ్లాల్సిందే.. కానీ ధనవంతుడు అయితే కోట్లు ఖర్చు పెట్టి కూడా జయం పొందుతున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఛత్తీస్‌గడ్ నుండి శాస్త్రవేత్తలు ప్రపంచానికి తీపి కబురు అందించారు. మూడు రకాల బియ్యంలో క్యాన్సర్‌ను జయించే కారకాలు ఉన్నాయని గుర్తించారు. గత్వాన్, మహారాజీ, లైచా రకం బియ్యంలో క్యాన్సర్ భరతం పట్టే ఔషధ గుణాలు ఉన్నాయని, క్యాన్సర్ కారకాలతో పోరాడే శక్తి ఉందని సీనియర్ శాస్త్రవేత్త దీపక్ శర్మ వివరించారు. రాయ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయ (ఐజీకేవీ), ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలు చేశారు. బియ్యంలోని అంతర్జీవ ద్రవ్యజాలం నుండి ఈ మూడు రకాలను సేకరించి ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయలో భద్రపర్చినట్టు దీపక్ శర్మ చెప్పారు. ఈయన అగ్రికల్చర్ యూనివర్సిటీలోని జెన్యూశాస్త్రం, మొక్కల పెంపకం విభాగంలో ప్రిన్సిపల్ సైంటిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మూడు రకాల బియ్యాన్ని వండి ఆహారంగా తీసుకుంటే సాధారణ కణాలకు ఎలాంటి నష్టం కల్గజేయకుండా ఊపిరిత్తులు, రొమ్ము క్యాన్సర్ బారి నుండి కాపాడుతుంది. మూడు రకాల్లో ముఖ్యంగా లైచా అనే రకం బియ్యంలో అత్యధిక ఔషధ గుణాలు ఉన్నాయి. శరీరంలో క్యాన్సర్ కణాలు ఉంటే వాటిని గుర్తించి మరీ నాశనం చేసే శక్తి ఉంటుంది. ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయంలోని గ్రాంట్స్ కమిషన్, ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌తో గతేడాది కీలక ఒప్పందం చేసుకుంది. ఈ తరహా పరీక్షలు వేరే రకం వంగడాలపై పరిశోధించడానికి అనుమతి పొందింది. బార్క్‌లోని బయో సైన్స్ గ్రూపులో అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వీపీ వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పలువురు శాస్త్రవేత్తలు ఇతర వరి వంగడాలపై పరిశోధనలు చేస్తున్నట్టు దీపక్ శర్మ తెలిపారు. తాను కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నట్టు వివరించారు. గత్వాన్, మహారాజీ, లైచాను బియ్యాన్ని ప్యాకెట్ల రూపంలో వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా గిరిజనులు నివసించే బస్టర్ ప్రాంతంలో ఈ తరహా వినియోగం అధికంగా ఉంది.

గత్వాన్ రకం బియ్యంలో కీళ్ల నొప్పులను మటుమాయం చేసే గుణం అధికంగా ఉంటుంది. లైచాను చర్మ సంబంధ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తుంటారు. గిరిజనులు ఆస్పత్రులకు వెళ్లకుండా కేవలం ఈ బియ్యాన్నే ఔషధిగా ఉపయోగిస్తున్నారని శాస్త్రవేత్తలు వివరించారు. శరీరంలోని కొన్ని వ్యాధులను దూరం చేయడంతో పాటు సాధారణ కణాలకు ఎలాంటి హాని కల్గజేయకుండా క్యాన్సర్ సెల్స్‌పై పోరాటం చేస్తుందని శర్మ వివరించారు. రోజుకు ఈ మూడు రకాల్లో ఏదో రకం బియ్యాన్ని 200 గ్రాములు చొప్పున తీసుకుంటే క్యాన్సర్ వారి జోలికి రాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు చెబుతున్నది ఏంటంటే... ముందుగా మూడు రకాల బియ్యం నుండి క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే మూలకాలను తీసుకుని ఎలుకలలో ప్రవేశపెట్టి పరిశోధనలు చేయనున్నారు. నిత్యం మానవుడు ఉపయోగించే ఆహార పదార్థంతో కలిపి అందించి క్యాన్సర్ భూతాన్ని జయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రూ. 16.80 కోట్లతో
బొమ్మూరులో సైన్స్ సెంటర్

- శంకుస్థాపన చేసిన మంత్రి శిద్దా రాఘవరావు



రాజమహేంద్రవరం, ప్రభ న్యూస్ : సైన్స్‌తో సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర అటవీ, సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో 15.20 కోట్ల రూపాయలతో నిర్మించనున్న సబ్ రిజనల్ సైన్స్ కేంద్రానికి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 5 నెలలలో సైన్స్ కేంద్రాన్ని నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటాన్నామన్నారు. అదనంగా ఇక్కడ సైన్స్ హబ్ ఏర్పాటుకు మరో ఒక కోటి 60 లక్షలు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విశాఖపట్టణంలో రూ. 25 కోట్లతో సైన్సు మ్యూజియం నిర్మాణం చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లాలో మరో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, తిరుపతిలో రూ. 500 కోట్లతో సైన్ససిటీ ఏర్పాటు చేయునున్నట్లు మంత్రి తెలిపారు. సైన్స్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందన్నారు. శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది విద్యాలయాలని, అటువంటి విద్యాలయాలలో మంచి పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాజమహేంద్రవరం మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ సైన్స్‌సెంటర్ 5 ఎకరాలల్లో నిర్మాణానికి 50 శాతం నిధులు రాష్ట్రం, 50 శాతం నిధులు కేంద్రం సమాకూరుస్తున్నట్లు తెలియజేశారు. ఈ కేంద్రం త్వరలో పూర్తిచేసేందుకు అందరి సహకారం కోరుతామని ఆయన అన్నారు. శాసనమండలి సభ్యుడు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి ఒక చరిత్ర ఉందని, ఇటువంటి ప్రాంతంలొ సైన్స్ సెంటర్ రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.. కలెక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి సైన్సు సెంటర్ల వంటివి సందర్శించడం వలన మంచి తెలివితేటలు పెరుగుతాయన్నారు. బొమ్మూరు సైన్స్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా అన్ని సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్సు మ్యూజియం డైరెక్టర్(కల్‌కత్తా) యస్.కుమార్, మాగంటి రూప, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి ప్రాజెక్ట్ అధికారి జె.డి రావు. తహసీల్దార్ కె.పోశయ్య, ఎం.డి.వో.రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్జీలు, సిబ్బంది వేతన సవరణపై
వచ్చే నెల మధ్యంతర నివేదిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా ఉన్న సబార్డినేట్ కోర్టుల న్యాయాధికారులు, సిబ్బంది, పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించిన మధ్యంతర నివేదికను వచ్చేనెల మార్చిలో సుప్రీంకోర్టుకు సమర్పించనున్నట్లు నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ చైర్మన్ జస్టిస్ పి వెంకటరామిరెడ్డి వెల్లడించారు. తుది నివేదికను గడువు కంటె ముందే ఇస్తామన్నారు. ఆదివారం ఇక్కడ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రా లకు చెందిన సబార్డినేట్ జడ్జీలు(న్యాయాధికారులు) , సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు.

నేడు చంద్రబాబు చేతులమీదుగా
పోగొండ రిజర్వాయర్ ప్రారంభం

- మారుమూల గిరిజన ప్రాంతాలకు సాగు, తాగునీటి సౌకర్యం
- పోలవరంపై జైరాం రమేష్ వ్యాఖ్యలు విడ్డూరం: మంత్రి దేవినేని



అమరావతి, ఆంధ్రప్రభ : పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న పోగొండ రిజర్వాయర్‌ను సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించడంతోపాటు పోలవరం పనులను స్వయంగా పరిశీలించనునాన్నరని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించడం ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాల్లోని రైతులకు సాగు, తాగునీరు అందించడమే కాకుండా ఆయకట్టు స్థిరీకరణకు ఎంతో తోడ్పడుతుందన్నారు. ఆదివారం విజయవాడలోని జలవనరుల శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రూ.129 కోట్ల వ్యయంతో నిర్మించిన పోగొండ జలాశయం వల్ల 4 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు 3,652 ఎకరాల స్థిరీకరణకు వీలు కలుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం సందర్శించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తారని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకూ ఆయన మూడు సార్లు స్వయంగా, 51 పర్యాయాలు వర్చువల్ ఇన్‌స్పెక్షన్ చేసినట్లు తెలిపారు. వచ్చే డిసెంబర్, జనవరిలోగా పోలవరం గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నామని చెప్పారు. 2019 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఉమా స్పష్టం చేశారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలోని 28 పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. త్వరలో వీటన్నింటినీ జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు.

పోలవరం ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతుంటే రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టు పనులను అడ్డుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ నేత జైరాం రమేష్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. నాలుగేళ్ళ తరువాత పోలవరం ప్రాజెక్టుపై ఆయన ఇలా మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రాన్ని ఆనాడు అడ్డగోలుగా విభజించడానికి మూలకారకుడైన జయరాం రమేష్ పోలవరం ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు కలపలేదో చెప్పాలన్నారు. పోలవరం ప్రాజెక్టుపై అసంబద్ధంగా, నిరాధరంగా ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని మంత్రి హెచ్చరించారు. ఒకవైపు ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే ఇలాంటి విమర్శలు తగవని హితవు పలికారు. రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టు పనులు 53 శాతం పూర్తయ్యాయని, అదే విధంగా హెడ్ వర్క్ పనులు 39 శాతం మట్టి పనులు 60 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. 30 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు కేంద్ర అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని ఇప్పటికి రూ.600 కోట్లను కేంద్ర జలవనరుల శాఖ విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన ప్రజల కోసం రివైజ్డ్ ఎస్టిమేషన్ కేంద్ర జలవనరుల శాఖకు అందజేశామని, దీనిపై రాష్ట్ర అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు.

లేపాక్షి ఉత్సవాల్లో భాగంగా హిందూపూర్ నియోజకవర్గానికి కృష్ణా జలాలను అందిస్తామని అదే విధంగా మే నెలాఖరు నాటికి హంద్రీనివా ద్వారా మడకశిరకు నీళ్లందించి రాయలసీమకు నీటి ఎద్దడి లేకుండా చూస్తామని మంత్రి చెప్పారు. జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రానున్న 116 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని చెరువులు, కుంటలను మరమ్మతులు చేస్తామని చెప్పారు. వర్షకాలం సీజన్ ఆరంభమయ్యే నాటికి ఈ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

నేడు సీఎం పోలవరం సందర్శన

- రైవస్ కాలువపై వంతెన నిర్మాణానికి మంత్రులు ఉమా, యనమల శంకుస్థాపన




అమరావతి, ఆంధ్రప్రభ : కరవు రహితాంధ్రప్రదేశ్ ధ్యేయంగా పెద్ద ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పానికి అంతా మద్దతుగా నిలిచి, సహకరించాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని రైవస్ కాలువపై రూ. 5.40 కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి మంత్రి యనమల రామకృష్ణుడుతో కలిసి, దేవినేని ఉమామహేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దీనిని ఎన్టీఆర్ జయంతి కల్లా పూర్తి చేసి, వంతెనకు ఎన్టీఆర్ పేరు పెడతామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే విధంగా రామవరప్పాడు వంతెనను నిర్మిస్తామన్నారు. సీఎం చొరవ వల్లనే సింగిల్ లైన్ వంతెనను డబుల్ లైన్‌గా చేశామన్నారు. రైతుల కోరిక మేరకు బుడమేరు, ఏలూరు కాలువలపై కూడా రెండు వంతెనలను నిర్మిస్తామని చెప్పారు. రూ.12 కోట్లతో చేపడుతున్న బ్రహ్మలింగం చెరువు పనులను డిసెంబర్ కల్లా పూర్తి చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జలవన రులశాఖ ద్వారా ప్రాజెక్టులకు రూ. 51,867 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ముఖ్య మంత్రి పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించ డానికి పోలవరం సందర్శిస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం ఎంతో పట్టుదలతో ముందుకుపోతున్నారని, పోలవరం పూర్తయితే రెండు, మూడు పంటలు పండించుకోవచ్చన్నారు. రూ.25 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా సీఎం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్ల మెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ, స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, తూర్పు పీసీ కమిటీ అధ్యక్షులు గుత్తా శివరామకృష్ణ, జలవన రుల శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెట్ మోడల్ పరీక్షకు స్పందన

- రాష్ట్రవ్యాప్తంగా పేపర్-1 (ఎస్‌జీటీ) మొడల్ పరీక్ష
- ఎస్టీయూ ఆధ్వర్యంలో 20 వేల మంది హాజరు
- అవగాహన, అనుమానాల నివృత్తికి దోహదం
- ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. విజయవాడ, కృష్ణా జిల్లాతో సహా అన్ని జిల్లా కేంద్రాలు, కొన్ని చోట్ల డివిజన్ కేంద్రాల్లో నిర్వహించిన టెట్ మోడల్ పరీక్షకు అభ్యర్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా ఉపాధ్యాయ అర్హత పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మొదటిసారిగా రాష్ట్రంలో అదీనూ ఆన్‌లైన్ పద్ధతిలో ప్రభుత్వం టెట్ పరీక్షను నిర్వహిస్తోంది. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర మానసికాం దోళన ప్రారంభమైంది. ఎలా రాయాలో అర్థంకాక అయో మయానికి గురవుతున్న అభ్యర్థుల్లో టెట్‌పై అవగాహన కల్పించి, చైతన్యపర్చి, భయం పోగొట్టాలనే ఉద్దేశంతో ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం ఈ మోడల్ పరీక్షను నిర్వహించింది. పేపర్-1 (ఎస్‌జీటీ) పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మందికి పైగానే అభ్యర్థులు హాజరయ్యారు. విజయవాడ, కృష్ణా జిల్లాతోపాటు ఉదయగిరి నియోజకవర్గం, కర్నూల్ ,చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం తదితర జిల్లాల్లో ఈ మోడల్ పరీక్షనిర్వహించారు. నిష్ణాతు లైన ఉపాధ్యాయవర్గం చేత ప్రశ్నాపత్రాన్ని పకడ్బందీగా రూపొందించి, నిర్వహించిన ఈ మోడల్ పరీక్ష అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదని ఎస్టీయు రాష్ర ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు ఆదివారం 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. పరీక్ష నిర్వహించిన గంట లోపే ప్రశ్నాపత్రాలను దిద్ది , వచ్చిన మార్కులను అభ్యర్థులకు అప్పటికప్పుడే తెలియజేశామన్నారు. అంతేకాకుండా వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అభ్యర్థులకు ప్రోత్సాహక బహుమతులను కూడా అందజేశామన్నారు. చిత్తూరు జిల్లాలో 14 కేంద్రాలు, గుంటూరు జిల్లాలో రెండు చోట్ల, కృష్ణా జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం, కర్నూలు జిల్లా కేంద్రంతోపాటు ఎనిమిగనూరు, డోన్, నంద్యాల, చిత్తూరు తదితర చోట్ల అభ్యర్థులు భారీ ఎత్తున హాజరయ్యా రని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని సీతారామపురంలో జరిగిన కేంద్రంలో 55 మంది హాజర య్యారని తెలిపారు. కేవలం అభ్యర్థుల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టాలనే లక్ష్యంతోనే ఈ రకమైన మోడల్ పరీక్షలను నిర్వహించామని చెప్పారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు కూడా ఉత్సాహంతో మోడల్ పరీక్ష రాసి, సందేహాలను నివృత్తి చేసుకున్నారని అన్నారు. ఈ తరహా మోడల్ పరీక్షలు అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనను, అనుమానాలను పటాపంచలు చేస్తాయని అన్నారు. దీంతో త్వరలో ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షను ఎటువంటి భయం, ఆందోళన లేకుండా అభ్యర్థులు స్వేచ్ఛగా రాయలగలుగుతారని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం తమకు సహకరించిందన్నారు.

యాప్.. రైతు జీవితాన్నే మార్చేసింది!

- ప్రత్యేక యాప్‌తో పంటల సాగు
- 2011లో గ్రీన్‌వే యాప్
- మయన్మార్‌లో పెరిగిన టెక్నాలజీ వాడకం

మయన్మార్ : శాస్త్ర సాంకేతిక రంగాన్ని వ్యవసాయ రంగంలో వినియోగించుకోవడంలో మయన్మార్ ముందడుగు వేస్తున్నారు. టెక్నాలజీ ద్వారా పంటకు వచ్చిన వ్యాధిని గుర్తించి నయం చేసుకుంటున్నారు. శాన్ శాన్ ఫ్లో ఓ కొత్త యాప్‌ను రూపొందించారు. స్మార్ట్ ఫోన్‌లో దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవడంతో వరికి సోకిన వ్యాధిని ఇట్టే పసిగట్టేయ వచ్చు. ఎలాంటి డబ్బులు చెల్లించకుండా రైతులకు అందుబాటులో ఉంచారు. గత రెండు సంవత్సరాలుగా దక్షిణ మయన్మార్‌లో వరి తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలోనే ఈ కొత్త రకం యాప్ ఆవిష్కరించబడింది. ఈయేడు మాత్రం రైతులు, కూలీలు చాలా పంట కోత సమయంలో చాలా ఆనందంగా కనిపించడాన్ని 35 ఏళ్ల శాన్ శాన్ ఫ్లో గమనించింది. సీజనల్ పరంగా పంటపై సమర్థవంతమైన పురుగుల మందు ఉపయోగించి దిగుబడిలో విజయం సాధించింది. ఇదంతా ఆమె రూపొందించిన యాప్‌తోనే సాధ్యమైందని చెప్పుకొచ్చింది. మాకు మా తల్లిదండ్రులు చూపించిన విధానంలోనే వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పశ్చిమ యంగోలోని అయ్‌యువర్ గ్రామంలో వివరించింది.

యాప్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఉపయోగించడం చాలా సులభతరమైంది. దేన్ని అయినా సాధించగలమనే నమ్మకం వచ్చింది. సరిగ్గా ఉపయోగించడంతో పాటు కళ్లు మూసుకుని ముందుకు వెళ్లే విధంగా ఉంది. టెక్నాలజీని ఉపయోగించుకుని ముందుకు వెళ్లే ఆలోచనలో ఈ తరంలో కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. మూడింట రెండు వంతులు వ్యవసాయంపై ఆధారపడి పని చేస్తున్నారు. దేశం జీడీపీలో దాదాపు 28శాతం వ్యవసాయంపైనే ఉంది. దశాబ్దాలుగా ఐసోలేషనిస్ట్ జుంటా పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నుండి రైతులు బయటికి రాకపోవడంతో దిగుబడులు తక్కువగా సాధించారు. అలాంటి వారికి శాన్‌శాన్ ఫ్లోయాప్ సమాధానం అవుతుంది. వారు రైతులకు అన్ని రకాల సమాచారాలు ఎప్పటికప్పుడు అందిస్తుంటారు. వాతావరణం, వాతావరణంలో వచ్చే మార్పులు, పంట ధర, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ ఏవి వాడాలి..? అనే విషయాలపై అప్రమత్తం చేస్తూ ఉంటారు. అదేవిధంగా చర్చా వేదికలు నిర్వహణ. నిపుణుల ద్వారా వారి అనుమానాలు నివృత్తి చేయడం వంటి అనేక కార్యక్రమాలతో రైతులను అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తుంటారు. గ్రీన్ వే యాప్‌ను ఇద్దరు వ్యవసాయ విద్యార్థులు రైతుల కోసం 2011లో వెబ్‌సైట్‌లో సెట్‌అప్ చేశారు. రాత్రిళ్లు యాప్‌ను మరింత అభివృద్ధి పర్చేందుకు సమయం కేటాయిస్తూ ఉండేవారు. అప్పటికే కొంత మంది రైతులు ఇంటర్‌నెట్ సదుపాయం కలిగి ఉన్నారు. 28 ఏళ్ల యిన్ యిన్ ఫ్యూ వివరిస్తూ ఉండేవాడు. ఎప్పుడు అయితే రైతుల చేతుల్లో స్మార్ట్ ఫోన్ వచ్చిందో అప్పటి నుండి చాలా మార్పు వచ్చింది. టెలీకాం రంగాన్ని అభివృద్ధి పర్చడానికి మయన్మార్ ప్రభుత్వం తలుపులు తెరించింది. దీంతో మార్కెట్‌లో నెట్ ఒక భాగంగా మారింది. పాత రకం కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లకు కాలం చెల్లిపోయింది. సిమ్ కార్డు ఖర్చుతో పాటు కొన్ని నియంత్రణలతో 2005లో ఉన్న 3వేల డాలర్ల ఖర్చు కాస్త, 2013 వచ్చే సరికి 1.50 డాలర్లకు పడిపోయింది. తమ బ్రాండ్‌లను పెంచుకోవడానికి పోటీదారులు ఆచరణాత్మకంగా స్మార్ట్ ఫోన్స్‌లను అందజేశారు. 2012లో కేవలం 7 శాతం ఉన్న స్మార్ట్ ఫోన్ వినియోగదారులు 2017 చివరికి వచ్చేసరికి 80శాతానికి చేరుకుంది. వ్యవసాయంతో పాటు వైద్య, ఆరోగ్య రంగాల్లో కూడా కొత్త యాప్‌ల ఆవిష్కరణకు మయన్మార్ పార్లమెంట్ ముందుకొచ్చింది. టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకుగాను చర్యలు చేపట్టింది. ఒకప్పుడు మయన్మార్‌లో రైతుల అంటే పేదోళ్లుగా ఉండేవారు. కానీ ఇప్పుడు ప్రతీ ఒకరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఇంట్లో కంప్యూటర్‌లు కనిపిస్తున్నాయి. గ్రీన్ వే వారి జీవితాన్ని మార్చేసింది.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీవాక్షం

టేబుల్

సెంటిమెంటు అని
కొట్టి పారెయ్యొద్దు.
కూసాలు లూజై
కాళ్ళు ఊగొచ్చు గాక.
కాల మహాసముద్రాన్ని
అవలీలగా ఈదిన
నా చిరకాల మైత్రీ యానిక
ఈ దారు వేదిక.

ఇవాళ పనికిరాదనుకోవద్దు
చరిత్ర పాతదే కావచ్చు
కాని ఇది ప్రాసంగికోజ్వలం!
దీనితో నా అనుబంధం
పలుచబడని సుమధుర సుగంధం
ఒంటరితనం ముసిరినప్పుడు
దీని పూర్వాశ్రమ వృక్షం కింద
సేదతీరుతాను.
బాధలు సతాయించినప్పుడు
తరుణోపాయం కోసం
దీనిపైన మోచేతులానించి
తలనిమురుకుంటాను.

సంసార సాగరంలో
ఇదొక ద్వీపం
మథనంలో పేరుకునే
సరికొత్త ఆశాదీపం

ఆకిటికీ
దీని కిరీటం
దూరాన పక్షుల బారులను
కాగితాలపైకి ఆకర్షించి
అక్షరాలుగా మారుస్తుంది.
నా కవిత్వపు కాగితం విమానాలు
టేకాఫ్ అయ్యే
సిమెంటు మైదానమై వ్యాపిస్తుంది.

పురాతనమే కాదు
అతి నూతనం కూడా.
దర్శిస్తే మహదాకాశం
నివసిస్తే భూ వైశాల్యం.

కేవలం బల్లచెక్క కాదు
అడుగులేని మహాపాత్ర
జీవితాన్ని ఎంత గుమ్మరించినా నిండదు
బహుశా నేనున్నంతవరకు
ఇదే నా నిరంతర జ్వలితయాత్ర.

- డా॥ ఎన్.గోపి
9391028496

అందని ఆకాశంతో..!

ఆకాశం అందనంత దూరంలో ఉందని పొరపడకు!
ఆ దూరం కొలతలకు అందనిదని అంచనాకు రాకు
ఏ క్షణమైనా ఉరికొచ్చే నింగిని చూసి అదోలా నవ్వకు
ఆ ఆకాశం బద్దలైతే విరుచుకుపడే వర్షం నీ దరికి రాదా?

మేఘాల్లో ఉరుముల మెరుపులు చూసి మౌనం దాల్చకు
ఆ ధ్వనుల ప్రతిధ్వనులు విని పరాకులోకి వెళ్లకు
ఇరుసుల్లా దూసుకొస్తుంటే నాకేమని నిద్రలోకి జారకు
ఆ వెలుగుల జువ్వలు క్షణాల్లో నీ కంటిని తాకవా?



పిడుగులు పరుగులు పెడుతుంటే నిమ్మకు నీరెత్తకు
పాశుపతాస్త్రమై వస్తుంటే విలయం కాదని వదిలేయకు
అల్లంత దూరాన లేచే ఆ మంటలు నిన్నూ తాకక మానవు

జీవనయాత్రలో ప్రణయాల పరుపులే కాదు
విలయాల వికృతులూ ఉంటాయని మరువకు
ప్రకృతిలో పరమార్థపు అంచులు చూడు
ఆకాశపు చిత్రాల్లో సప్తవర్ణాల అర్థం వెతుకు
ఉరుమైనా..మెరుపైనా మనది కాదని అనుకోకు
పిడుగులు మాత్రమే ప్రమాదమని పొరపడకు
ఆకాశం...నువ్వూ వేర్వేరు కాదని తెలుసుకో
ప్రకృతీ...నువ్వూ మమేకపు నీడలని మరువకు
అంటీముట్టనట్టుండి లౌక్యమని విర్రవీగకు
నువ్వు దూరం జరిగినా ప్రకృతి వదలదు
అడుగడుగూ అది నీతో కలిసే వేస్తుంది.

- వయ్యస్సారెస్
9000013367

కృత్రిమ వ్యాకరణం కవిత్వపు భావశిల్పమవుతుందా?

వస్తు నిర్వహణే వస్తు శిల్పమని..కేవలం ఒక వస్తువును కాకుండా భిన్న వస్తువుల్ని స్వీకరించి వాటిని నిర్వహించడం వస్తుశిల్పమవుతుందని చెబుతూ పోతారే తప్ప ఆయా వస్తువులను దేశ విదేశాల కవులు ఏఏ డిక్షన్స్‌లో శైలీ విన్యాసాల్లో, దెవి షెల్ లో చెప్పారో విశ్లేషించరు. తిలక్ లాంటి కవులే hyperbole poetryరాశారని..మంత్రలోకపు మణిస్తంభా లాంటి అవాస్తవిక over imagenery కవితా పాదాలు కవిత్వంలో ఉన్నాయని..ఇలాంటి వస్తుశిల్ప నిర్వహణ వల్ల ప్రయోజనాలేమిటో..రా.రా.లాంటి వాళ్లు ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోలేదు.

వ్యాకరణం భాష పుట్టాక పుట్టిందా? ప్రజల భాషను ప్రజలకు దూరం చేయడానికి కొంతమంది సృష్టించారా? అన్నది ఆలోచించాలి. ప్రజలు మాట్లాడుకునే జీవద్భాషలో కవిత్వం రాయాలి. తెలుగు భాషను రక్షిస్తామంటూ మళ్లీ వ్యాకరణాల భాషతో రాసే గ్రాంధిక కవిపుంగవులకు సన్మానాలు చేస్తూ ఎన్నాళ్లు ప్రజలను ప్రభుత్వాలను మోసం చేస్తారు? వచన కవిత్వపు భాష, రూపం ప్రజాస్వామికం. ప్రజలకు అర్థం కాని కవిత్వం రాజులను, భూస్వాములను, వారి భోగలాలసలను కీర్తించిన కవిత్వం అప్రజాస్వామిక ఫ్యూడల్ రూపం. ఈ విషయం నేటి యువకవులు తెలుసుకోవాలి. సరళమైన వాడుక భాషలోనే వచన కవితలు రాయాలి. పాశ్చాత్య దేశాల కవితా నిర్మాణ పద్ధతులకు మనవాళ్ళు చెప్పిన కవితా నిర్మాణాలను తేడాలను గమనించాలి. నేడు మన సంప్రదాయ కుహనా కవిత్వపు పరిశోధకులు ఇంకా వస్తుశిల్పం, భావ శిల్పం, రచనా శిల్పం అంటూ కవిత్వాన్ని విశ్లేషిస్తున్నారే తప్ప పాశ్చాత్య దేశాలలో విస్తృతంగా విశ్వవ్యాప్తంగా వస్తున్న poetic-devicesల గురించి dictions గురించి ఆలోచించరు. వస్తువుకు సంబంధించిన శిల్పాన్ని వస్తు శిల్పమని ..వస్తు నిర్వహణే వస్తు శిల్పమని..కేవలం ఒక వస్తువును కాకుండా భిన్న వస్తువుల్ని స్వీకరించి వాటిని నిర్వహించడం వస్తుశిల్పమవుతుందని చెబుతూ పోతారే తప్ప ఆయా వస్తువులను దేశ విదేశాల కవులు ఏఏ డిక్షన్స్‌లో శైలీ విన్యాసాల్లో, దెవిషెల్‌లో చెప్పారో విశ్లేషించరు. తిలక్ లాంటి కవులే hyperbole poetryరాశారని..మంత్రలోకపు మణిస్తంభా లాంటి అవాస్తవిక over imagenery కవితా పాదాలు కవిత్వంలో ఉన్నాయని..ఇలాంటి వస్తుశిల్ప నిర్వహణ వల్ల ప్రయోజనాలేమిటో..రా.రా.లాంటి వాళ్లు ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోలేదు. అలాగే కవి తాను ఎన్నుకొన్న అంశాన్ని వివిధ రకాలుగా భావించి, కల్పించి, ఊహించి, చెప్పడమే భావశిల్పమంటారు. అంతేకాదు ఏ కవిత్వంలోనైన ఉత్తమమైన భావుకత లేనిదే(imagination) రాణించదని ఏ కృష్ణశాస్త్రినో, నాయనినో, వేదులనో, బసవరాజునో ఆకాశానికి ఎత్తేస్తారు. పైగా ఈ నాటి కవులలో ఆ భావుకత లేక భావశిల్పం లేదని చెప్పడమో చేస్తుంటారు. కాని నేటి ప్రపంచ కవితా నిర్మాణంలో, కేవలం భావుకతే కాకుండా వాస్తవికత, పర్సోనిఫికేషన్, మెటానమీ language of gesture కవిత్వంలో వాతావరణ కల్పన, భావం తాలూకు భంగిమను పట్టిచ్చే భాష ఎంపిక..ఇలా అనేకాంశాలు..భావశిల్పాన్ని ప్రభావితం చేస్తున్నాయని యువకవులకు విడమరిచి చెప్పేదెవరు? emotional investment in the poems imagery అన్న పాశ్చాత్య పరిశోధకుల మాటలూ నేటి కవులు గమనించాలి. ఇంకా మనవాళ్ళు పద్యమే కవిత్వమన్న భావన నుండి, గ్రాంధిక భాషే ప్రజల భాషన్న భ్రమల నుండి...వ్యాకరణం, ఛందస్సు వల్లనే శైలీ రమ్యత వస్తుందన్న పిచ్చిదనం నుంచి, ప్రాసల ప్రాభవం ప్రదర్శించడమే రచనాశిల్పమన్న. .వంచనాయుత భావజాలం నుండి బయటపడలేదు. అంతే కాదు వచన కవిత్వం అంతటా...అందరిచేత రాయబడుతుంటే..పత్రికల్లో ప్రచురింపబడుతుంటే..కవుల సంఖ్య పెరుగుతుంటే..ముసలి కవులు పీఠాలు కదులుతుంటే.. పండితభిషక్కులు ఉలిక్కిపడుతుంటే...మళ్లీ వచన కవితా నిర్మాణాలను అపహాస్యం చేయడానికి ప్రాచీన అలంకారికుల సిద్ధాంతాలకు వక్రభాష్యాలు చెబుతూ..లేక ఆధునిక వచన కవిత్వానికి అన్వయిస్తూ, అది లేదని, ఇది లేదని నేటి యువకవులను భయపెడుతున్నారు. వాస్తవానికి ప్రాచీన లాక్షణికులు వారి స్థలకాలాలను బట్టి కావ్యాలు..కవిత్వం ఎలా ఉండాలో చెప్పారు..ఉదాహరణకు...

కవిత్వం-డిక్షన్-21

1. రసవిశిష్టమైన రచనే కావ్యం- రుద్రటుడు (కావ్యశాస్త్రం)
2. వట్టి వచనం కావ్యాపకర్షహేతువైన దోషం- విద్యానాథుడు (ప్రతాపరుద్రయశోభూషణమ్)
3. చమత్కారం లేకపోతే కవులకు కవిత్వమే లేదు- కుంతకుడు (వక్రోక్తి)

ఇలా చెప్పడంతో పాటు శబ్దగత, వాక్యగత, అర్థగత దోషాలున్నాయని చెప్పారు. 18 అర్థదోషాల్లో 'నిరలంకృతి' అనే పేరుగల ఒక దోషంగా చెప్పాడు విద్యానాథుడు. అంటే ఇవాళ వచన కవిత్వంలో శబ్దగత, వాక్యగత, అర్థగత దోషాల కన్నా..కవిత్వం కాని కవిత్వపు భావనాబల దోషాలు, ఇమేజరికి, ప్రతీకలకు, అభివ్యక్తికి, కవితా నిర్మాణాలకు సంబంధించిన దోషాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. అలాగే రసవిశిష్టమైన కావ్యాలు కన్నా వచనమై తేలిపోయిన కావ్యాలు..కవితా సంపుటాలు ఎన్నో ఉన్నాయి. పైగా వాటికే అవార్డులు, రివార్డులు ఇస్తున్నారు. పాత డిక్షన్‌తో సంస్కృతపద పదబంధాల పేర్లతో కవితా సంకలనాలు వెలువడితే...వాటినే గొప్ప కవిత్వంగా..భావించి పెద్ద పెద్ద అవార్డులిచ్చి..ఇదే అసలు సిసలు..కవిత్వమని ప్రచారం చేస్తున్నారు. పాశ్చాత్య ఆధునిక కవిత్వ నిర్మాణ, విమర్శాశాస్త్రాల పరిచయం తెలుగువారికి పరిమితంగా ఉండడంతో ఏది కవిత్వమో ఏది కవిత్వం కాదో తేల్చుకోలేకపోతున్నారు. ఇక్కడ 'సంస్కృత అలంకార శాస్త్రాలు సాహిత్య సిద్ధాంత గ్రంథాలే గాని సాహిత్య విమర్శ సిద్ధాంత గ్రంథాలు కావు' అన్న వల్లంపాటి వెంకట సుబ్బయ్య మాటలు కవులు గుర్తించుకోవాలి. రసం, ధ్వని, చమత్కారం..ఇవన్నీ lambic pentameter లో స్ట్రాంగ్ ఫీలింగ్స్‌ను కలిగించడానికి, మంచి impression కలిగించడానికి పాశ్చాత్యకవుల కవితా నిర్మాణంలో ఎప్పుడో ఉపయోగించారు. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే యువకవులు..వచన కవిత్వం రాసే ముందు..




1. వచన కవిత్వం రాయడానికి పెద్దగా వ్యాకరణం అవసరం లేదని..
2. సహజమైన ప్రజల భాషలోనే నిజమైన కవిత్వముందని..
2. గ్రాంధిక భాష కవిత్వపు భాష కాదని..
4. వచన కవిత్వం రాయడానికి ప్రాచీన అలంకార శాస్త్రాల కన్నా పాశ్చాత్య దేశాల కవితా నిర్మాణాల గురించి నేర్చుకోవాలని..
5. వచన కవిత్వం ఎవరైనా రాయవచ్చని..సంప్రదాయ వ్యాకరణం అక్కరలేదని, రాయడం ఒకటి వచ్చుంటే చాలని...
6. అన్ని వర్గాల, వర్ణాల ప్రజలు వాడే వాడుక భాషే ప్రామాణిక వచన కవిత్వ భాషని..
7. నిజమైన తెలుగు భాష.. వచన కవిత్వంలో పరిమళిస్తుందని..
8. చిన్నయసూరి బాల వ్యాకరణం, బహుజనపల్లి ప్రౌఢవ్యాకరణం చదివి కవితలు రాయాల్సిన అవసరం లేదని..

యువకవులు తెలుసుకోవాలి. నేటి యువకవులు మంచి imagesతో అద్భుత కవిత్వం రాస్తున్నారు. వచన కవితలకు ఇమేజెస్ చాలా ముఖ్యం. ఎందుకంటే science congnizes reality in concepts, while art in images అంటూ చెప్పిన సోవియట్ విదుషీ షెర్బీనా..మాటలే నేటి వచన కవితల సృజనకారులకు మార్గదర్శకాలు కావాలని ఆశిద్దాం.

(కొత్త కలాల కోసం- కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
9912738815

శ్రీనాథుని కావ్యాల్లో శివలీలలు



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచం అనుసరించదగినది ఉంటాయనేది నిర్వివాదాంశం. దీన్ని ప్రపంచం ఏనాడో గుర్తించింది. ఇక్కడ పుట్టిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు ప్రపంచ సారస్వతానికి, మానవ జీవితానికి ఉత్తమ మార్గాన్ని చూపించేవిగా ఉంటాయి. అయితే నేటి యువత పెడదారులు పడుతూ మన సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్న పరిస్థితి నేడు కనిపించటం లేదు. ఎవరైనా కొందరు అధ్యయనం చేద్దామన్నా అందులోని భాషవారికి అందనిదిగా, కొరకరాని కొయ్యగా ఉంటుంది. ఈ దశలో ఆధునిక యువతీ యువకులకు మన సాహిత్య సౌరభాలను అందించాలనే సంకల్పంతో డాక్టర్ రామవరపు శరత్ బాబు కంకణం కట్టుకున్నారు. రామాయణ, భారత, భాగవత గ్రంథాలతో పాటు కాళిదాసు, శ్రీనాథుడు వంటి మహాకవుల కావ్యాలను అందరికి అర్థమయ్యే తేలిక భాషల్లో అందిస్తూ వస్తున్నారు. ఆ క్రమంలోనే ''శ్రీనాథ కృత శ్రీకంఠ పంచకం'' పేరుతో శ్రీనాథ కవి, సార్వ భౌముని పంచకావ్యాలైన నైషధం (శృంగార నైషధం), హరవిలాసం, భీమేశ్వర పురాణం, శివరాత్రి మహాత్మ్యం, శ్రీకాశీఖండం తీసుకొని ఒక గ్రంథంగా మనకు అందించారు. ఇందులోని నైషధం (శృంగార నైషదం) మినహా మిగిలిన కావ్యాలన్ని శివతత్వాన్ని శివభక్తిని చాటే కావ్యాలే. అయితే శృంగార నైషధాన్ని కూడా ఇందులో చేర్చటం పై శరత్‌బాబు ఒక వివరణ ఈ గ్రంథంలో తన మాటగా రాసిన దానిలో మనకు దొరుకుతుంది.

''శ్రీనాథుడు రాసిన కావ్యాల్లో శ్రీకంఠవృత్తాంత సంబంధమైన ఐదింటిని గ్రహించి వాటి కథాంశాల్ని నేటి యువతకందించటమే నా ప్రయత్న పరమార్థం. అయితే మిగతా నాల్గింటిమాటెలా ఉన్నా నైషధం శివ లీలా విభూతిని చెప్పేది కాదు కదా, మరి అదెలా శివ పరమౌతుందనే ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. పైగా ఇందులో కేవలం శ్రీనాథుని శృంగార నైషధం మాత్రమే కాక శ్రీహర్షుని సంస్కృత నైషధం, వేదవ్యాస, సంస్కృత మహాభారత, ఆంధ్ర మహాభారతాల ప్రసక్తి కూడా ఉంది కదా! అప్పుడది శ్రీనాథపంచకంలో ఎలా చేరుతుందనే ప్రశ్న కూడా తలెత్తవచ్చునంటే -సంస్కృతంలో ఛత్రి న్యాయమనే ఒక న్యాయం ఉంది. ''ఛత్రిణోగచ్ఛంతి' అనే నుడికారానికి ''గొడుగుల వారు వెడుతున్నార''ని అర్థం. వర్షంలో చాలామంది గొడుగులు వేసుకొని వెళ్లటం సహజమేగా! అయితే వారిలో కొంతమంది గొడుగులు లేనివారు కూడా కొంతమంది ఉండవచ్చు. ఈ గొడుగులు లేని వారిని కూడా గొడుగులున్నవారిగానే ఈ నుడికారం చెపుతుంది. కనుక నైషధం ప్రత్యక్షంగా శివుని పేర్కొనకపోయినా నలదమయంతులకు దూత అయిన 'హంస', శివుడేనని విద్వలోకం భావిస్తుంది. నాలుగు కావ్యాలు, శివపరమైనందున ఒకటి అంతగాకాకపోయినా, దానివలెనే పరిగణించవచ్చు కనుక ఈ ఐదింటి సమాహారం 'శ్రీనాథకృత శ్రీకంఠ పంచకమౌతోంది'' అంటూ ఒక సబబైన వాదనను వినిపించారు శరత్‌బాబు. ఈగ్రంథంలోని మొదటిది శృంగార నైషధం. నలదమయంతుల కథ. రెండవది హరవిలాసం. ఇది ఏడు ఆశ్వాసాల కావ్యం. ఇందులో తుంబురునికి దుర్వాసముని శాపం అతడు చిఱుతోండనంబిగా పుట్టం, శివుడు మిండ జంగంగా రావడం, శివుని శరీరంలో పొడమిన స్వేదాన్ని పార్వతి అపార్థం చేసుకోవడం-శివుడామెను స్వాంతన పరచటం, భక్త సిరియాళుని కథ, తారకాసుర సంహారం, శివుడు మూడవకన్ను తెరిచి మన్మధుని భస్మీభూతుని చేయడం, శివపార్వతుల వివాహం, క్షీరసాగర మథనం, విష్ణుమూర్తి అమృతాన్ని మోహినీ రూపం తో దేవతలకందేటట్లు చేయటం, అర్జునుడు శివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని చేకొనటం, అర్జునునికి ఊర్వశి శాపం వంటి వృత్తాంతాలు హరవిలాసంలో కనిపిస్తాయి.

మూడవ కావ్యమైన భీమేశ్వర పురాణంలో దక్షారామపురవర్ణనం, వ్యాసుడు కాశీనగరాన్ని శపించటం, శివుడు వ్యాసుని కాశీ నుంచి బహిష్కరించటం, వ్యాసుని దాక్షారామ ప్రవేశం, ప్రథమ గణసమేతుడై శివుడు దక్షారామాన్ని ప్రవేశించటం, బృహస్పతి దివస్పతికి దానవైశిష్ట్యాన్ని భూదాన మహిమను తెలియ చెప్పటం, దక్షవాటిక మహాత్మ్యం వంటి కథలతో ఆరు ఆశ్వాసాలతో ఉంటుందీ భీమేశ్వర పురాణం. నాలుగవదైన శివరాత్రి మహాత్మ్యం ఐదు ఆశ్వాసాలకావ్యం. ఇందులో విష్ణువు సముద్రాంతర్గతమైన భువిని వెలికితీయడం, బ్రహ్మవిష్ణువుల యుద్ధం, ఇరువురు శివుని స్తుతించటం, శివరాత్రి వ్రతాన్ని గూర్చి శివుడు వారికి తెలపటం, యజ్ఞదత్తుడనే బ్రాహ్మణుని వృత్తాంతం శివానుగ్రహంతో అతని భార్య సుశీలకు సుకుమారుడనే పుత్రుడు జన్మించటం, అతని దుష్ప్రవర్తన, సుకుమారుని ఆగడాలను, రాజుకు మొరపెట్టు కోవటంతో రాజు అతనికి దేశ బహిష్కార శిక్ష విధించటం, సుకుమారునికి చండాల వనితతో సంపర్కం, సుకుమారుడు చాండలితో ఇరువురు కుమార్తెలను, ఇద్దరు కుమారులను కని పంచావాన్నొందడం, సుకుమారుడొకనాడు శివరాత్రి వ్రతాన్ని దర్శించటం. ఇంటికి వచ్చి ప్రాణాలు విడవటం, యమ, శివకింకరుల ఘర్షణ, యముడు శివునితో ప్రబోధితుడై, శివభక్తుల జోలికి పోవద్దని అతని కింకరులనా దేశించటం వంటి ఘట్టాలతో శివరాత్రి మహాత్మ్యం కావ్యం నడుస్తుంది. ఇక ఐదవ కావ్యం శ్రీ కాశీఖండం. ఇందులో నారదుడు వింధ్య పర్వతం వద్దకు రావటం, వింధ్య మేరు పర్వతంపై స్పర్ధతో తన శరీరాన్ని పెంచి సూర్య చంద్రాది గ్రహగతులకవరోధం కలిగించటం, బృహస్పతి, అగస్త్యుల సంవాదం, కాశీ వియోగానికి అగస్త్యుని పరితాపం, విద్యగర్వాపహరణం, శివశర్మోపాఖ్యానం, వివిధలోకాలవర్ణణ, నిర్‌ృత , వరుణ, ఈశాన, నక్షత్ర, బుధ, శుక్రదిలోకాల వృత్తాంతం, శివశర్మ నిర్యాణం, మణికర్ణికామహాత్మ్యం, కళావతి ఉపాఖ్యానం, దివోదాసు వృత్తాంతం. స్త్రీ లక్షణ నిరూపణ, సాంబాదిత్య మహాత్మ్యం, శివుడు బ్రహ్మను కాశి పంపటం, విష్ణువు కాశిలో బౌద్ధ ధర్మాన్ని స్థాపించటం, దుర్గామహాత్మ్యం, కాశిలోవివిధ లింగామహాత్మ్యం, వ్యాసుడు కాశీపై కోపించిన వృత్తాంతం, దేవతాయంత్రవిధానం వంటి వృత్తాంతాలు ఈ 'శ్రీకాశీఖండం'లో కనిపిస్తాయి. అందరిని ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు శరత్‌బాబు. ఈ గ్రంథం చదివి భద్రపరుచుకోవాల్సిన గ్రంథమని చెప్పవచ్చు. శరత్‌బాబు కృషిని మెచ్చుకోకుండా ఉండలేము. **పేజీలు-252, వెల-రూ.250 ప్రతులకు, రామవరపు శరత్‌బాబు, ప్రశాంతి సదన్, జి-1,46-18-8,వండవారి పేట,దొనపర్తి,విశాఖపట్నం-530016, ఏ.పి.సెల్. 9885961329.**

- నియోగి
9553097319

సమాజ దార్శనికత్వం పఠాభి కవిత్వం!!

వచన కవిత్వాన్ని ఆకాశానికి ఎత్తినవారు తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి. ముఖ్యంగా ఆధునిక దృష్టికి- వచన కవితా నిర్మాణ ప్రక్రియల్ని చాలా ప్రాచుర్యంలోకి తీసుకొని వచ్చిన అభ్యుదయ పథికునిగా ఆయన ఆద్యుడు. అభివ్యక్తి వ్యంజనంలో నూతనంగా కవులందర్నీ ఒకసారి తనతొలి ఫిడేలురాగాలు డజను ఆలోచనాత్మకంగా విన్పించారు. ఈ కవితా సంకలనాన్ని 1939లో వెలువరించారు. కవితా సారాంశంలోని నిర్భయత, నిబద్ధతలతో బాటు వచన కవిత్వాన్ని నవ్యాత్మకమైనదిగా, తన సంవిధానాన్ని ప్రకటించడం వెనుక, తన అస్తిత్వాన్ని తెలిపారనే చెప్పాలి. అప్పటి నేతలు పట్టాభి, బాబూ, సుభాసు బోస్‌లని కూడా రాజకీయపు పోటీ వంటి అంశాల్ని కవితా పాదాలుగా ఆవిష్కరించడం గమనార్హం. తన భావాల్ని ఆవేశంగానో, వ్యంగ్యంగానో కాక తన కళ్లల్లో టెలిస్కోప్‌లు, మైక్రోస్కోపుల్ని ఉషోదయాల్ని చూసే కవిగా అర్థం చేసుకోవాలన్నారు.



శాంతినికేతన్ పట్ల మక్కువను పెంచుకుంటూ తన కవిత్వ పరిశీలన ఎంత విస్తృతమో తరువాత తరానికి స్పష్టమైన సంకేతంగా తెల్పారు. ''సంస్కార'' చలన చిత్రంలోనూ తన దృశ్యమానమై నిల్చిందనే చెప్పాలి. స్నేహలతగారితో పరిణయం కూడా కవితాలోకానికి మరింత ఆదర్శంగా స్ఫూర్తిగా చూపారు. స్వతహాగా ఆజానుబాహుడైన పఠాభిని ఆయన సృష్టించిన ''చండమారుత'' రాజకీయ నియంత్రణలకు సంచలనమయ్యింది. తాను నవ్యుడునని, తెంపిరిని కాదని ''కయితే నాదయితే'' అని తేల్చి చెప్పారు. అందుకే ఇన్నేళ్లయినా కవి లోకంలో కవకంకణాభరుడు పరిసరలలితశాలీనుడు, శ్లేషభూషణుడు అనే పర్యాయపదాల్ని తన పేరుకు పొట్టలో చుక్క మొలిపించుకున్నవాడు ''పఠాభి''. అలా ఇంగ్లీషు భాషా భాండారం నుండి కావల్సిన మూటల్ని కావ్య గౌరవం చెడకుండా వాడుకుంటానన్న సారస్వత విశ్వవ్యాపనుడు . అందుకే పఠాభి

ఎవర్నని యనుకొంటిరో మీరు నన్ను? ఏనుపఠాభిని...
ప్రఖ్యాతంకానున్న కవిని నేను...
నా వచన పద్యాల నే దుడ్డుకర్రలతో, పద్యాల నడుములు విరుగతంతాను
చిన్నయ సూరి బాల వ్యాకరణాన్ని చాలా దండిస్తాను...
నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను..అనుసరిస్తాను'' అంటూ తన నవీన పంథాను నర్మగర్భంగా కవితా లోకానికి తెలియచేసిన ప్రయోగవాది. ఒక రకంగా నిరాడంబరాహం భావకవిగా పేరుని సార్థకం చేసుకున్నారు. ఎందుకంటే కుతూహలం లేపే మైక్రోస్కోప్ ఉపయోగం చిన్నపిల్లలు ఎలా ఆసక్తి కన్పరుస్తారో అలా వయసు పైబడినా సరే నిత్యం గణిత విద్యార్థి కొత్త పాఠం నేర్చుకోవడం కంటే సాంప్రదాయ వీణావాదనం కన్నా ఫిడేలు రాగాలు నాజూకుగా విన్పించాలన్న సంగీతపు జిజ్ఞాసల్ని పెంచుకున్నారు. కవులందరూ గొప్పగా పొగిడే చంద్రుడు నగరవీధుల్లో ఇరుక్కున్నట్లున్నాడు అనడం, విచిత్రమైన ఆలోచనల్లోంచి వచ్చింది. ''భోగం పిల్ల'' నిజాయితీని కూడా మెచ్చుకోవడం ఆయనలో కన్పిస్తుంది. ముఖ్యంగా విశ్వకవి రవీంద్రుని కవిత్వాన్ని విన్పించిన రాగాల దివ్యత్వం, లయగతుల్ని తప్పక 2018లోనూ కావ్యగౌరవాన్ని పొందుతూనే ఉంది. ప్రపంచం చుట్టూ కమ్మిన అపోహలు, చూడని నిజాలు, తన సృజనతో స్వీయపదజాలాన్ని సృష్టించగలిగారు. ఈ ప్రయత్నంలో తానొక రుషిలా మారారనే చెప్పాలి.జీవితమంటే రంగుల స్వప్నాల్ని కనడమే కాదు, వాస్తవికాంశాల పట్ల సమగ్ర అధ్యయనం సాగించి, సారించడంగా భావించారు. అదే ఆయనను ఒక ప్రత్యేకత గలిగిన కవిగా నిలబెట్టింది. తన కవితాత్మక భావుకతతో తన తరాన్ని తన వైపు తిప్పుకోగలిగారు. అందుకే ఆయన్ని అకారణపు నిందలు శిక్షలు అధిగమించగలిగేలా ధైర్యం, ఆత్మస్థైర్యంలున్న మనిషిగా పఠాభిని అభివర్ణించారెందరో అభిమానులు.


(పఠాభి శతజయంతివత్సరం ప్రారంభసందర్భంగా)

- వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు
9441148158

ఆంధ్ర షెల్లి

వాని పాటకు పల్లవి మానవతయె
వాని మాటకు నెత్తావి భావుకతయె
వాని వచనమ్ము తెలుగు చెల్వంపు కులుకు
వాని సునిశిత వాక్కు మవ్వంపుములుకు॥

మేలి మెరుపుల అక్షర మేఘమాల
రాగపల్లకి పల్లకీలయల హొయలు
సొగసు నగిషీల కేళి ఆసుకవి శైలి
బాష్ప కవితా నయాగరా భావధార॥



నవతనే చాటు ఛందమానందవల్లి
పలుముషాయిరా సరదాల పాలవెల్లి
నడచు నాజూకు జాబిల్లి-నవ్వుమల్లి
అతడు ''దేవులపల్లి''- మా ఆంధ్ర షెల్లి॥

(ఫిబ్రవరి 24వతేదీ శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వర్ధంతి సందర్భంగా)

- డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ
9866944287

సాహిత్య వార్తలు

వి.ఆర్.విద్యార్థి, డా॥ కేతవరపు రాజ్యశ్రీలకు సృజన సాహితీ పురస్కారాలు

గతరెండు దశాబ్దాలుగా ఎందరో ప్రముఖ సాహితీ వేత్తలను సత్కరిస్తూ, సాహిత్య, ఆధ్యాత్మిక సభలు నిర్వహిస్తూ వస్తున్న సృజన సాహితీ సమాఖ్య, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా 2017సం.కుగాను సాహిత్యరంగంలో దశాబ్దాల తరబడి తనదైన ఒక ప్రత్యేక ముద్రతోను, ప్రకృతి సౌందర్యాలను తన కవితా సృజనతో అందిస్తూ సాగిపోతున్న ప్రముఖ కవి వి.ఆర్. విద్యార్థికి, కవయిత్రిగా, రచయిత్రిగా, వక్తగా, ఆధ్యాత్మిక ప్రసంగకర్తగా కీర్తి గడించిన డా॥కేతవరపు రాజ్యశ్రీకి ప్రతిష్టాత్మకమైన సృజన సాహితీ జీవన సాఫల్య పురస్కారాలను అందించడానికి నిర్ణయించింది. ఈ పురస్కారానికి గాను నగదు, పురస్కార పత్రం సృజన జ్ఞాపిక, శాలువలతో వీరికి సత్కారముంటుంది. త్వరలో సత్తుపల్లిలో జరిగే ప్రత్యేక సభలో ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాలు వీరికి అందించడం జరుగుతుంది.

- జి. రామకృష్ణ, బి. మధుసూదనరాజు, గట్టేవాసు
సృజనసాహితీ సమాఖ్య నిర్వాహకులు-సత్తుపల్లి-507303

మొంబత్తి ఆవిష్కరణ సభ

శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభ, సంయుక్త ఆధ్వర్యంలో కె.హరనాథ్ రచించిన మొంబత్తి కవితాసంపుటి ఆవిష్కరణ సభ నేటి సాయంత్రం 5.30 గంటలకు కళాసుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, హైదరాబాద్ నందు జరుగుతుంది. సుధామ అధ్యక్షతన జరిగే ఈ సభకు సినీనటి సంగీత ముఖ్య అతిథిగా, కళాజనార్ధనమూర్తి, కె. అనితారెడ్డి, విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆత్మీయ అతిథిగా డా॥లక్ష్మణరేఖ గోపాలకృష్ణ పాల్గొంటారు. వి.పి. చందనరావు గ్రంథ పరిచయం గావిస్తారు.

సలీం సాహిత్య సమాలోచన జాతీయసదస్సు

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సయ్యద్ సలీం సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు 22,23, తేదీలలో రెండు రోజుల పాటు 180 సెమినార్ హాల్, సర్ సి.వి.రామన్ సైన్స్ బ్లాక్, వై.వి.యం. కడప నందు తెలుగు శాఖ, యోగివేమన విశ్వ విద్యాలయం, శశిశ్రీ స్మారక సమితి, కడప సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతుంది. 22వ తేదీ ఉదయం 10.30 గం.లకు ప్రారంభమవుతుంది. ఈ రెండు రోజులలో ఐదు సదస్సులు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలెందరో పాల్గొంటారు. 23వతేదీ సాయంత్రం ఆరుగంటలకు ముగింపు సభ ఉంటుంది.

● పీఎన్‌బీ కుంభకోణం

200 డొల్ల కంపెనీలు...

బినామీ ఆస్తులు



● సీబీఐ, ఈడీ దర్యాప్తులో వెలుగుచూస్తున్న నిజాలు ● డజనుకుపైగా ఆస్తుల జప్తు?
● దోషుల్లా ప్రవర్తించకండి ● మోడీజీ.. మౌనం వీడండి: రాహుల్

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి కనీసం 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఆదాయ పన్ను శాఖ(ఐటీ) దర్యాప్తు చేపట్టాయి. నీరవ్ మోడీ, చోస్కీ కంపెనీల్లో నాల్గవ రోజైన ఆదివారం సోదాలు చేపట్టిన ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్ఎ) కింద కనీసం రెండు డజను స్థిరాస్తులను జప్తు చేసే దిశగా ముందుకు సాగుతున్నది. ఈడీ ఆదివారం దేశవ్యాప్తంగా ఆభరణాల షోరూమ్‌లు, వర్క్‌షాపులను కలుపుకొని కనీసం 45 ప్రాంగణాలపై దాడులు జరిపింది. మోడీ, ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలకు చెంది ఐటీ శాఖ జప్తు చేసిన 29కి పైగా ఆస్తులను పిఎంఎల్ఎ కింద ఈడీ మదింపు చేస్తున్నది అని ఈడీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రూ.20 కోట్ల విలువైన వజ్రం, స్వర్ణాభరణాలను స్వాధీనం చేసుకున్నది అని చెప్పారు. కుంభకోణంలో భాగంగా నిధుల సరఫరా లేదా స్వీకరణ కోసం దేశ, విదేశాల్లో వినియోగించిన దాదాపు 200 డొల్ల కంపెనీలను ఈడీ, ఐటీ శాఖ గుర్తించాయని ఆయన చెప్పారు.

కంపెనీల బ్యాలెన్స్ షీట్ల తనిఖీలో సిబిఐ

మెహుల్ చోస్కీ యాజమాన్యంలో గీతాంజలి గ్రూప్‌కు చెందిన 18 భారత్ కంపెనీల బ్యాలెన్స్ షీట్లను సిబిఐ పరిశీలిస్తున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) ద్వారా దఖలు చేయబడిన గ్యారంటీల ఆధారంగా వేర్వేరు బ్యాంకుల నుంచి రూ.11,384 కోట్ల నగదును ఎలా తీసుకున్నది తెలుసుకునేందుకు అలా చేస్తున్నట్టు సిబిఐ అధికారులు ఆదివారమిక్కడ తెలిపారు. కుంభకోణానికి సంబంధించి వేలాది డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డుల కోసం అరెస్టయిన బ్యాంకు అధికారులు గోకుల్‌నాథ్ శెట్టి(రిటైర్డ్), మనోజ్ ఖారత్, నీరవ్ మోడీ కంపెనీ సిగ్నేటరీలతో పాటుగా పిఎన్‌బికి చెందిన ఇతర అధికారులను ఏజెన్సీ ప్రశ్నిస్తున్నట్టు చెప్పారు. ఒక భారీ సెర్వర్ నుంచి రికవరీ చేసిన రికార్డులను సైతం అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుతానికి చోస్కీ, నీరవ్ మోడీ, పిఎన్‌బి అధికారుల కుమ్మక్కు జోలికి పోకుండా కుంభకోణం పరిమాణం, నిధుల బట్వాడా, ఇతర ఉన్నతాధికారుల పాత్రను అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. షెట్టి గత ఏడు సంవత్సరాలుగా బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను పక్కదారి పట్టిస్తూ మోసపూరితంగా ఎల్‌ఓయూలు జారీ చేసినట్టు అభియోగం. షెట్టి, ఖారత్ స్విఫ్ట్ ద్వారా ఈ ఎల్‌ఓయూలకు సంబంధించిన మెస్సేజ్‌లు పంపించేవారు. పిఎన్‌బి అధికారులు ఎల్‌ఓయూల గురించి బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్‌లో ఎంట్రీలు జరపకుండానే ఈ మెస్సేజ్‌లు పంపించేవారు. అలా యాంట్‌వెర్ప్, హాంగ్‌కాంగ్, బహ్రెయిన్, మారిషస్, ఫ్రాంక్‌ఫర్ట్‌లలో ఉన్న కెనరా బ్యాంక్, ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంకులకు మెస్సేజ్‌లు పంపించారు. గత ఆరు సంవత్సరాలుగా బ్యాంకు దృష్టికి రాకుండా రూ.11,384 కోట్ల విలువైన ఎల్‌ఓయూలు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్స్‌ను జారీ చేశారు. పిఎన్‌బి జారీ చేసిన ఎల్‌ఓయూలు, పోగవుతున్న వడ్డీలు చూసి విదేశాల్లోని భారతీయ బ్యాంకులు దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఈ ఏడాది జనవరిలో షెట్టి పదవీవిరమణ చేయడంతో కుంభకోణం బైటపడిందని అధికారులు తెలిపారు.

శ్వేత పత్రానికి కాంగ్రెస్ డిమాండ్

పిఎన్‌బి కుంభకోణం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థపై ఒక శ్వేతపత్రం తీసుకురావాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారిడిమాండ్ చేశారు. ఆదివారమిక్కడ విలేకరులతో మాట్లాడుతూ భారతీయ బ్యాంకుల్లో మోసాలు నానాటికి పెరిగిపోతున్నాయని అన్నారు. భారతీయ బ్యాంకులకు రూ.800 కోట్లు బకాయిపడిన రోటోమాక్ పెన్స్ యజమాని విక్రమ్ కొఠారి పత్తాలేకుండా పోయారని మనీష్ తివారి వేలెత్తి చూపారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు డేటా ప్రకారం గడచిన ఐదేళ్లలో రూ.61,260 కోట్ల మేరకు బ్యాంకింగ్ మోసాలు చోటు చేసుకున్నాయి. అందులో నాలుగేళ్ళు ఎన్డీయే ప్రభుత్వం హయాంలో జరిగాయి. ఆరోపిత మోసగాళ్ళు, బీజేపీ అత్యున్నత నేతల మధ్య సంబంధాలు భారతీయ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యం పట్ల తీవ్రమైన సందేహాలకు దారి తీస్తున్నాయి అని ఆయన అన్నారు. మోసగాళ్ళ పేర్లు, నిర్ధరక ఆస్తుల(ఎన్‌పిఎలు) వివరాలను ప్రచురించేలా అన్ని బ్యాంకులను కేంద్రం ఆదేశించాలని డిమాండ్ చేశారు.కాగా రోటోమాక్ పెన్స్ కంపెనీ నుంచి రూ.352 కోట్ల రుణ వసూలు చర్యలు ప్రారంభించినట్టు అలహాబాద్ బ్యాంక్ రికవరీ ఇన్‌చార్జ్ రాజేష్ గుప్తా వెల్లడించారు.పిఎన్‌బి కుంభకోణంలో ఇతర బ్యాంకుల ప్రమేయంపై అభియోగాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కుంభకోణంపై ఒక పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ డిమాండ్ చేశారు. నోట్ల రద్దు సందర్భంగా పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ చోటు చేసుకున్నది. ఇందులో మరిన్ని బ్యాంకులు పాలుపంచుకున్నాయి. పూర్తి వాస్తవం వెలుగులోకి రావాలి అని ట్వీట్ చేశారు.

మోడీజీ..
నేను తినను ఇంకొకర్ని తిననివ్వను అంటే ఇదేనా?

భారీ బ్యాంక్ కుంభకోణం జరుగుతుంటే కేంద్రం మొద్దు నిద్రపోయిందని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి మండిపడ్డారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం అంటే ఇదేనా అని నిలదీశారు. నేను తినను.. ఇంకొకర్ని తిననివ్వను అంటూ ప్రధాని మోడీ గొప్పగా చేసిన ప్రకటన ఏమైందని ఎద్దేవా చేశారు. జన్‌ధన్ యోజన కింద పేదలు, కష్టజీవులు జాతీయ బ్యాంకుల్లో దాచుకున్న కష్టార్జితం ప్రియమైన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు దోచుకోవడానికేనా అని ఒక మాయావతి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నిందితులపై కఠినమైన చర్యలు తీసుకొని, ప్రజల్లో బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుజ్జీవంపజేయాలని మాయావతి విజ్ఞప్తి చేశారు.

పిల్లలకు రెండు గంటలు పాఠాలు...
స్కామ్‌పై పెదవి విప్పరు



పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. కుంభకోణంపై ప్రధాని, ఆర్థిక మంత్రి మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ పరీక్షలు ఎలా పాస్‌కావాలనే దానిపై పిల్లలకు రెండు గంటలు చెబుతారు కానీ, రూ.22 వేల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణంపై రెండంటే రెండు నిముషాలు కూడా మాట్లాడరు అని రాహుల్ మండిపడ్డారు. జైట్లీ ఎవరికి కనిపించకుండా దాక్కున్నారని ఎద్దేవా చేశారు. మీరే దోషి అన్నట్టుగా వ్యవహరించవద్దు. మాట్లాడండి అని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ట్వీట్ చేశారు. దానికి మోడీరోబ్స్ఇండియా అని హ్యాష్‌టాగ్ చేశారు.

మోసానికి ముద్దుపేరు వజ్రం

● అక్రమార్కుల పాలిట కల్పవృక్షం ● మనీలాండరింగ్‌కు దగ్గరి దారి
● పీఎన్‌బీ స్కాంలో కొత్తకోణం



న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ చేసిన రూ.1.8 బిలియన్ డాలర్ల కుంభకోణానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ బలి పశువైంది. ఈ కుంభకోణంలో మోడీ మేనమామ, మరో వజ్రాభరణాల వ్యాపారి, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోస్కీ పాలుపంచుకోవడం చర్చనీయాంశమైంది. వజ్రం పెట్టుబడిగా వ్యాపారుల మధ్య అపవిత్ర బంధం, చేస్తున్న మోసాలపై సిబిఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలకు తోడు సెబీ సైతం దృష్టిపెట్టింది. స్టాక్ మార్కెట్ బ్రోకర్లతో వీరికి గల అనుబంధాన్ని ఆరా తీస్తున్నది. నీరవ్ మోడీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న కంపెనీల్లో ఫైర్‌స్టార్ డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, రాధాషిర్ జ్యూవలరీ కంపెనీ, జ్యూవలరీ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ లాంటివి ఉన్నాయి. ఆ క్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మదింపును బ్యాంకింగ్ రెగ్యులేటర్ సెబీ చేపట్టింది. అలాగే వజ్రం, ఆభరణాల వ్యాపారంతో ముడిపడి

ఉన్న ఖాతాదారులందరిపై నిఘా పెట్టడానికి అన్ని బ్యాంకులు సన్నాహాలు చేసుకుంటున్నాయి. గతంలోనూ స్టాక్ మార్కెట్ అక్రమాల్లో ఆభరణాల వ్యాపారుల ప్రమేయానికి సంబంధించిన అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాక బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారులు గతంలోనూ ఉన్నారు. అలాంటి రంగాలకు చెందిన వారికి రుణాలు ఇచ్చేముందు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలనే ముక్తాయింపునకు బ్యాంకులు చేరుకున్నాయి. అంతేకాక అక్రమ మార్గాల్లో నగదును విదేశాలకు పంపించే మనీ లాండరింగ్ వ్యవహారానికి వజ్రాల వ్యాపారం చేదోడు వాదోడుగా ఉంటున్నదని దర్యాప్తు ఏజెన్సీలు భావిస్తున్నాయి.

10 మిలియన్లకు చేరిన రాజ్‌నాథ్‌సింగ్ ట్విట్టర్

న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దేశంలో అత్యధిక ట్విట్టర్ ఫాలోవర్లు కలిగిన టాప్-5 నేతల్లో ఒకరుగా మారారు. రాజ్‌నాథ్ ట్విట్టర్‌ను ఫాలో అవుతున్నవారి సంఖ్య శనివారం రాత్రికి 10మిలియన్ల మార్కు దాటిందని హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. రాజ్‌నాథ్‌తో పాటు మరో నలుగురికి మాత్రమే 10మిలియన్ల దాటిన ఫాలోవర్లు ఉన్నారు. వీరిలో ప్రధాని నరేంద్ర మోడీ 40.3 మిలియన్ల ఫాలోవర్లతో ప్రథమ స్థానంలో ఉన్నారు. అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 13.3 మిలియన్ల ఫాలోవర్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఈయన తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 11.8 మిలియన్లతో తృతీయ స్థానంలో ఉన్నారు.


సిలిండర్ పేలిన కేసులో
18కి పెరిగిన మృతుల సంఖ్య



జైపూర్: వివాహ వేడుకలో సిలిం డర్ పేలిన దుర్ఘటనలో మరణిం చినవారి సంఖ్య 18కి చేరిందని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఆరుగురిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారన్నారు. కాగా గాయపడినవారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంద న్నా రు.వీరిని మెరుగైన చికిత్స కోసం జైపూర్ తరలించామన్నారు. శిథిలాల నుంచి మరో 9మృతదేహాలను వెలికి తీశామన్నారు. దీంతో మరణించినవారి సంఖ్య 18కి చేరిందన్నారు. మరో ఇద్దరు శిథిలాలు కింద చిక్కుకున్నారని భావిస్తున్నట్టు అజ్మీర్ కలెక్టర్ గౌరవ్ గోయల్ తెలి పారు. రాష్ట్ర విపత్తు నిరోధక రక్షక దళాలుతోపాటు, సైన్యానికి చెందిన రక్షక దళాలు సంయుక్తంగా శిథిలాల్లో చిక్కుకున్నవారిని రక్షించేందుకు పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే బాధితుల కుటుంబాలను పరామర్శించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నష్ట పరిహారం విడుదల చేశారు. ప్రమాదంలో మరణించినవారి కుటుంబ సభ్యులకు 2లక్షలు నష్టపరిహారం ప్రకటించారు. గాయపడినవారిని ఆదుకునేందుకు 50,000 తక్షణ సాయం ప్రకటించారని అధికారులు తెలిపారు. అదేవిధంగా శ్రీ సిమెంటు కంపెనీ అదనంగా మరో లక్ష రూపాయలు నష్టపరిహారం ప్రకటించిందని సీఎం తెలిపారు..

ప్రజాస్వామ్యమే... పరమావధి

● పార్టీ సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి ● జాతి ప్రయోజనాల కోసమే జనసంఘ్ పుట్టింది
● బీజేపీ నూతన కేంద్ర కార్యాలయ ప్రారంభంలో ప్రధాని మోడీ





న్యూఢిల్లీ: బీజేపీ అణువణువునా ప్రజాస్వామ్యంతో నిండి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రతీ అంశాన్ని ప్రజాస్వామ్యయుతంగా ఆలోచించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని అభివర్ణించారు. న్యూఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని.. భారతీయ జన సంఘ్ నాటి నాటి నేటి బీజేపీ వరకు ప్రజల కోసం తమ పార్టీ చేసిన కృషిని మోడీ స్మరించుకున్నారు. 1951లో భారతీయ జనసంఘ్ ఆవిర్భవించింది మొదలు.. నేటి వరకు పార్టీ సిద్ధాంతాలు, విలువలు, దేశభక్తి విషయంలో ఎక్కడ తప్పలేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారిలో చాలా మంది నాయకులు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసినప్పటికీ.. ఆ తర్వాత కాలంలో వారి వారి రాజకీయ లబ్ది కోసం నూతన పార్టీలను ప్రారంభించాలని గుర్తు చేశారు. ఒకటి లేదా రెండు బలమైన జాతీయ పార్టీల ఆవశ్యకమైన నేపథ్యంలోనే స్వాతంత్ర్యానంతరం జనసంఘ్ పార్టీ పుట్టిందన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతీయ జనసంఘ్ ,బీజేపీ జాతి ప్రయోజనాలకు కోసం ఎన్నో రకాల పోరాటాలు చేశాయి. ఆవిషయంలో మేమెంతో గర్వపడతాం. అందుకే బీజేపీకి దేశభక్తికి సంకేతమైన కాషాయ రంగును ఎంచుకున్నారు. ఒకానొక సమయంలోఎన్డీఏ కూటమి భాగస్వాములైన పార్టీలు(టీడీపీ సహా) బీజేపీతో తమ భేధాభిప్రాయాలను బయటపెట్టాయి. కానీనాటి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వ ఏర్పాటులో ఎన్ని అవాంతరాలెదురైనా అధిగమించారని గుర్తు చేసుకున్నారు. ప్రాంతీయ పార్టీలతో మమేకమై కూటమిని ఏర్పాటు చేయడంలోవాజ్‌పేయి కృషి చిరస్మరణీయమని కొనియాడారు. నాడు ఆయన కృషి ఫలితంగా దేశంలో ప్రాంతీయ పార్టీలకు కూడా ధీమా కలిగిందన్నారు. ప్రజాస్వామ్యం తమ నరనరాల్లో ఉందని.. అందుకే అందరికే కలిసిపోయి పాజిటివ్ ఆలోచనలు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కొత్త భవనం పనుల కోసం కావచ్చు కానీ... దాని పరిధి మాత్రం దేశ సరిహద్దుల వరకు ఉంటుందన్నారు.కార్యకర్తలే పార్టీకి ఆత్మలాంటి వారిని మోడీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ బేరర్లు,కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ ఆఫీస్

న్యూఢిల్లీలో ప్రధాని మోడీ ప్రారంభించిన బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రపంచంలో అతిపెద్దదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. 1.70 లక్షల చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఇంతపెద్ద కార్యాలయం ఏ ఇతర రాజకీయ పార్టీకి కూడా లేదని చెప్పుకొచ్చారు. దేశంలోని ప్రతీ జిల్లాలో బీజేపీకి సొంత ఆఫీసులున్నాయన్న షా..2015 లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లోనే దేశంలోని 694 జిల్లాల్లో 635 పార్టీ కార్యాలయాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. కొత్త హెడ్ ఆఫీసును ఆధునిక హంగులతో రూపొందించామని..నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని ఛాంబర్లలో అందుబాటులో ఉంచామన్నారు. సోషల్ మీడియాకు కూడా ప్రత్యేక వింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నూతన కార్యాలయం ప్రారంభంతో పార్టీ కార్యకర్తలు, నాయకుల కల నెరవేరిందని షా చెప్పారు.

రూ.7వేల 900 కోట్ల ప్రాజెక్టుకు ప్రధాని శ్రీకారం

దేశంలోనే అతిపెద్ద నౌకాశ్రయం జెఎన్‌పీటీ నాలుగవ టర్మినల్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారు. రూ.7వేల 900 కోట్ల విలువైన ఈప్రాజెక్టు ద్వారా దేశంలోనే అతిపెద్ద కార్గో హ్యాడ్లింగ్ సామర్థ్యం కలిగిన కంటేనర్ పోర్టుగా జెఎన్‌పీటీ మరో రికార్డు సృష్టించింది. నాలువల టర్మినల్ ప్రాజెక్టుతో జేఎన్పీటీ సామర్థ్యాన్ని రెండింతలు కానుంది. ప్రస్తుతం జెఎన్పీటీ కంటైనర్ సామర్థ్యం 4.8 మిలియన్ స్టాండర్డ్ గా ఉండగా.. తాజాగా ప్రారంబించిన టెర్మినల్ తో మరో 2.4 మిలయన్‌స్టాండర్డ్ కంటైనర్ యూనిట్లు సామర్థ్యంతోడైంది. రెండో దశ పనులు 2022 నాటికి పూర్తయితే మరో 2.4 మిలియన్ స్టాండర్డ్ కంటైనర్ యూనిట్ల సామర్థ్యం జెఎన్పీటీకి వస్తుంది..దీంతో దాదాపు 10 మిలియన్లస్టాండర్డ్ కంటేనర్ యూనిట్లసామర్థ్యం కలిగిన పోర్టుగా జెఎన్‌పీటీ... ప్రపంచంలోనే 33వ అతిపెద్ద పోర్ట్ గా రికార్డుకెక్క నుంది. ఎన్పీటీ ఫస్ట్ తొలిదశ నాలుగవ టర్మినల్ ప్రారంభించిన తర్వా త ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా మనకు చోటు కల్పించాలంటే జలమార్గాలను మరింతగా విస్తరించుకోవాల్సిన ఆవ శ్యతక ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

పేదలకు రైల్వే 'స్వర్ణ' కానుక



న్యూఢిల్లీ : రైల్వే రంగంలో నిరుపేదలకు చోటు కల్పించే దిశగా ఆ శాఖ అడుగులు వేస్తున్నది. రాజధాని, శతాబ్ది రైళ్లలో ప్రయాణించేఅవకాశం నిరుపేదలకు కల్పిస్తున్నది. 'స్వర్ణ' అనే పేరుతో ఈ ప్రాజెక్టు చేపడుతు న్నదని ఓ సీనియర్ అధికారి వివరించారు. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. దీన్ని గతేడాది రైల్వే శాఖ తీసుకొచ్చింది. నిరుపేదలకు ఈ రెండు రైళ్లలో అవకాశం కల్పిస్తున్నది. విమాన టికెట్ ధరలతో పోటీపడే ఈ రైళ్లల్లో పేదలకు ఆ శాఖ 'స్వర్ణ' కానుక ఇస్తున్నది. కొన్ని రైళ్లను ఎంపిక చేసి రెండో దశకు విస్త రించనున్నారు. ప్రయాణించేవారు నిరుపేదలు అని గుర్తించి వాటి ఫలాలు అందజేస్తామని రైల్వే బోర్డు సీనియర్ అధికారి ఒకరు వివరించారు. ఒక్కో కోచ్‌కు రూ.50లక్షలు వెచ్చించి కోచ్‌ను అనుసంధానించనున్నారు. మెరుగైన వసతులు, ప్రయాణం కల్పించేదిశగా బోగీలు ఉంటాయి. సాధారణ బోగి అయితే కేవలం రూ.30 నుండి 35లక్షలు మాత్రమే అవసరం ఉంటుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోచ్‌లలో మంచి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకునేందుకు అన్ని జోన్‌ల ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరులు నిర్ణయం తీసు కన్నారు. సౌకర్యాలు అనగా.. బోగీ లోపలి డిజైన్‌లు, టాయిలెట్లు, పరి శుభ్రత, సిబ్బంది ప్రవర్తన, క్యాట రింగ్, సమయసారిణి, రక్షణ, భద్రత వంటి అంశాలపై దృష్టిసారించనుంది.

ఇరాన్‌లో విమానం కూలి
66మంది దుర్మరణం




టెహ్రాన్: ఇరాన్ పాసింజర్ విమానం కూలిపోవటంతో సిబ్బందితో సహా 66మంది ప్రయాణికులు మృతి చెందారు. ఈ ఘటనపై ఎయిర్‌లైన్స్ అధికారి మొహమ్మద్ టాబాత్బాయ్ మీడియాతో వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈపీ 3704 విమానం టెహ్రాన్ నుంచి సుమారు 500కిలోమీటర్లు దూరంలో ఉన్న యసూజ్‌కు బయలుదేరిందన్నారు. ఎటీఆర్.72 డబుల్ ఇంజిన్‌గల ఈ విమానం 1993నుంచి సర్వీస్ చేస్తుందన్నారు.కాగా ఆదివారం టెహ్రాన్ నుంచి యసూజ్‌కు బయలుదేరిన 45నిమిషాల తరువాత రాడార్ తెర నుంచి విమానం అదృశ్యమైందన్నారు. ప్రమాద సమయంలో ఒక చిన్నారితో కలిసి మొత్తం 60మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. వీరితోపాటు మరో 6మంది సిబ్బంది ఉన్నారన్నారు. అనంతరం విమానం కోసం గాలింపు చేపట్టగా దురదృష్టవశాత్తూ విమానం కూలిపోయిందని తెలిసిందని మొహమ్మద్ తెలిపారు. అయితే ఈ ఘటనలో మొత్తం అందరూ చనిపోయారని తెలిపిన ఆయన అనంతరం రక్షణ సిబ్బంది సంఘటన ప్రాంతానికి ఇంకా చేరుకోనందున విమానంలో ఉన్న 66మంది చనిపోయారని ఖచ్చితంగా నిర్ధారించి చెప్పలేమన్నారు. అత్యవసర సిబ్బంది నుంచి వైరుధ్యమైన నివేదికలు వస్తున్నాయన్నారు. విమానం కూలిపోయిన పర్వత శ్రేణుల్లోని వాతావరణం రక్షణ సిబ్బందికి ప్రతికూలంగా ఉందన్నారు. మంచు తుపాను కారణంగా అధికారులు పంపిన హెలికాప్టర్ ఘటన ప్రాంతానికి చేరుకోలేకపోయిందన్నారు. దీంతో కొన్ని రక్షణ దళాలును రోడ్డ మార్గంలో పంపించామన్నారు. 5రెస్క్యూ, రిలీఫ్‌టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. కానీ వారు ఇప్పటికీ సంఘటన ప్రాంతానికి చేరుకోలేదన్నారు.

పాక్ మాజీ ప్రధాని షరీఫ్ ఆస్తులు
18ఏళ్ల కిందటే 58 మిలియన్లు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు చెందిన అవినీతి నిరోధకశాఖ మాజీ ప్రధాని షరీఫ్‌కు 18ఏళ్ల కిందటే 58మిలియన్ల డాలర్ల ఆస్తులు ఉన్నాయని కోర్టులో తెలిపిందని స్థానిక మీడియా తెలిపింది. నవాజ్ షరీఫ్ (68), అతని కుటుంబ సభ్యులపై మూడు అవినీతి కేసులు సుప్రీంకోర్టు ఆదేశంతో గత సెప్టెంబరు 8న నమోదు చేశారు. సుప్రీం తీర్పుతో షరీఫ్ ప్రధాని పదవికి అనర్హత పొందటంతో ఆయన పదవినుంచి తప్పుకున్న సంగతి విదితమే. కాగా ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 22న జరగనుంది.

త్రిపురలో ప్రశాంతం

● 74 శాతం పోలింగ్ ● గతంలో కంటే 17శాతం తక్కువ
● మార్చి 3న ఎన్నికల ఫలితాలు ● గెలుపుపై సీపీఎం, బీజేపీ ధీమా



అంబస్సా: కమ్యునిస్టుల కంచుకోట త్రిపురలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 91.82 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి 17 శాతం తగ్గి..74 శాతం నమోదైంది. ఎన్నికల ఫలితాలు మార్చి 3న ప్రకటిస్తారు. మొత్తం 60 అసెంబ్లీ నియోజక వర్గాలకుగాను 59 స్థానాల్లో పోలింగ్ జరిగింది.చరిలం సీపీఎం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రామేంద్ర నారాయణ దేబ్ వారం రోజుల క్రితం మృతి చెందడంతో అక్కడ పోలింగ్ నిర్వహించలేదు. ఆ నియోజక వర్గానికి మార్చి 12న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో మొత్తం 292 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 23మంది మహిళా నాయకులు కూడా ఉండటం విశేషం. పోలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3వేల 174 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. గత 25 ఏళ్లుగా త్రిపుర అధికారాన్ని హస్త గతం చేసుకున్న వామపక్షాలు ఈసారి కూడా గెలుపుపై ధీమాగా ఉండగా.. బీజేపీ మాత్రం ఈసారి విజయం తమనే వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా త్రిపురలో ర్యాలీ, బహిరంగ సభలతో హోరెత్తించారు. అయితే గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు తేడా ఉంటుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేస్తోందని.. త్రిపుర ప్రజలు వామపక్షాల పాలనలో విసిగి పోయారని అంటున్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతం 1.87. అయితే 2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధపెట్టింది. దీంతో 2015 స్వయంప్రతిపత్తి జిల్లా మండలి ఎన్నికల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలను రాబట్టగలిగింది. అయితే త్రిపుర విభజన కోరుతున్న పార్టీలతో బీజేపీ జతకట్టిందని.కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇటీవల పర్యటనలో త్రిపుర విభజన అంశాన్ని ఉన్నతస్థాయి కమిటీ వేసి పరిశీలిస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నదే ఆసక్తికరంగా మారింది. కమ్యూనిస్ట్ లకు కంచుకోటగా చెప్పుకునే త్రిపురలో 20 స్థానాలు గిరిజనులు నివసించే ప్రాంతంలో ఉన్నాయి. ప్రతీసారి ఎన్నికల్లో గెలుపును ఈ స్థానాలే నిర్ణయిస్తాయి. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ర్యాలీ నిర్వహించిన సంతిర్ బజార్‌లోనూ గిరిజనుల ఓటు అత్యధికం. ప్రస్తుతం త్రిపురలో అధికారంలో ఉన్న సీపీ ఎం మాత్రం మరోసారి విజయం తమదే అని ఢంకాబజా యిస్తోంది.ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ బీజేపీపై విమర్శలు గుప్పింస్తూ..కమలదళం తమ రాష్ట్రాన్ని విభజించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. వామపక్షాల ఆధ్వర్యంలోనే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపాల మన్నారు. ఇతర రాష్ట్రాల్లోని వారికంటే తమ రాష్ట్రంలోని గిరిజనుల పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు. త్రిపురలో మొత్తం 25 లక్షల 73వేల 413 మంది ఓటర్లుండగా.. పురుష ఓటర్ల సంఖ్య 13 లక్షల 5వేల 375 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 12 లక్షల 68వేల 27 మంది ఉన్నారు.


లక్ష్యం సాధించిన కేవీఐసీ

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా (పీఎంఈజీపీ) 2016-17కు గాను నిర్దేశించిన లక్ష్యాన్ని ఖడి అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) సాధించింది. గుర్గావ్‌కు చెందిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ తెలిపిన వివరాల ప్రకారం... 2008-09లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా ఖడి అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ లక్ష్యాన్ని నిర్ధేశించింది. 2008-09లో ఉపాధి కల్పించడంలో కేవీఐసీ 50 శాతానికి దిగువనే ఉండిపోయింది. కానీ 2016-17 వచ్చే సరికి అనూహ్యమైన మార్పు వచ్చింది. నిర్ధేశించిన లక్ష్యాన్ని అధిగమించి ఔరా అనిపించుకుంది. 100.37 శాతం సాధించి పేరొందిన కంపెనీల సరసన చేరుకుంది.

చైనా దురాక్రమణపై ఫిలిప్పీన్స్ ఆగ్రహం

బీజింగ్: దక్షిణచైనా సముద్రంలో చైనా అనుసరిస్తున్న దురాక్రమణ ధోరణిపై ఫిలిప్పీన్స్ ప్రజల్లో నిరసన వెల్లువెత్తుతోంది. దేశాధ్యక్షుడు రొడ్రిగో డుటెర్టే చైనాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని చూసున్నా, ప్రజలు అందుకు ససేమిరా అంటున్నారు. స్వదేశం తీర ప్రాంతాన్ని రక్షించుకోవాలనీ, ఈ విషయంలో చైనాతో కరకుగా ఉండాల్సిందేనని రొడ్రిగోపై ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు. ఆసియాలో అమెరికా వైఖరి ఏమిటో ఇదమిత్థంగా తెలియకపోవడంతో ఆగ్నేయాసియాలో తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు చైనా తీవ్రయత్నాలు సాగిస్తోంది. ఆగ్నేయాసియా దేశాల సంఘానికి సింగపూర్ నేతృత్వం వహిస్తోంది. సింగపూర్ అమెరికాతోనూ, తైవాన్‌తోనూ సంబంధాలను మెరుగుపర్చుకుంటుండటం వల్ల చైనా, సింగపూర్‌ల మధ్య సంబంధాలు సజావుగా లేవు. అంతేకాక, దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్ హద్దుల విషయమై అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేయడంవల్ల కూడా సింగపూర్, చైనాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగా ఉండేవి.

ఎఫ్‌బీఐపై ట్రంప్ అసహనం



వెస్ట్‌పాం బీచ్: ఫ్లోరిడా స్కూలు కాల్పులు ఘటనలి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎఫ్‌బిఐ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసులో చాలా సంకేతాలు అందినా ఎఫ్‌బిఐ వాటిని పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ శనివారం రాత్రి ట్విటర్ వేదికగా స్పందించారు. వారి పనితీరు సమంజసంగా లేదన్నారు. వారు సమయమంతా ఎన్నికల ప్రచారంలో రష్యా పాత్రపై దృష్టి కేంద్రీకరించేందుకే వినియోగిస్తున్నారన్నారు. అయితే వారి ఆలోచిస్తున్నట్టుగా ఏ కుట్ర లేదన్నారు. ఇప్పటికైనా వారు తమ పనితీరుతో పూర్వవైభవాన్ని సాధించాలన్నారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ గతనెలలో ఫ్లోరిడా స్కూలు కాల్పుల కేసులో నిందితుడు ఈ దురాగతానికి పాల్పడబోతున్నట్టు ముందుగానే సమాచారం అందించినా వారు ఖాతరు చేయలేదు. ఎఫ్‌బిఐ అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ అధికారులు సరైనవిధంగా దర్యాప్తు చేయటంలో విఫలమయ్యారని తెలిపారు. ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్ ఎఫ్‌బిఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ రేను పిలిచి రిజైన్ చేయవలసిందిగా కోరారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐకి ప్రధాన విమర్శకుడిగా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



రిఫైనరీల విస్తరణకు
రూ. 70కోట్ల పెట్టుబడులు : ఐఓసీ

న్యూఢిల్లీ : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చమురుశుద్ధి సామర్థ్యాన్ని పెంచడానికి 2030 నాటికి రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెడుతుంది. ఐఓసీ ప్రస్తుతం 80.7 మిలియన్ టన్నుల చమురుశుద్ధి సామర్థ్యాన్ని 2030 నాటికి 116.55 మిలియన్ టన్నులకు పెంచుతుందని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం వినియోగం కంటే ఉత్పత్తి ఎక్కువగా ఉం ది. సుమారు 247.6 మిలియన్ టన్నులని ముడిచమురు అవసరమని, ఏడాదికి 3.5 నుంచి 4శాతం వినియోగం పెరు గుతోంది.. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాగా అమెరికాకు చెం దిన ఎనర్జీ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ అంచనా ప్రకారం 2040 నాటికి భారత్‌కు 434 మిలియన్ టన్నుల ఇంధన అవసరం ఏర్పడు తుందని, ప్రస్తుతం 194 మిలియన్ టన్నులని తెలిపింది. అయితే ఇండియన్ ఎనర్జీ ఏజెన్సీ మాత్రం 450 నుంచి 492 మిలియన్ టన్నుల వరకు ఇంధన అవసరాలుండవచ్చునని అంచనా వేసింది. ప్రభుత్వ రంగానికి చెందిన మిగిలిన చము రుసంస్థలు కూడా చమురుశుద్ధి సామర్థ్యాన్ని పెంచుకునే ఆలోచనలో ఉన్నాయి.



కేటాయింపులతో 'రాబడులు'
సంస్కరణలతో.. వ్యవస్థలో మార్పు

- ●మేగ్నటిక్ మహారాష్ట్ర సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ
- ●రూ.10లక్షల కోట్లు పెట్టుబడులే లక్ష్యం ●35లక్షల మందికి ఉపాధి
- ● మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్



ముంబై : బీజేపీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం బడ్జెట్‌లో సంస్కరణల ద్వారా కొత్త పని సంస్కృతిని తెరపైకి తెచ్చిందని.. దీంతో దేశవ్యాప్తంగా సామాజిక ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు కనిపిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇక్కడ జరుగుతున్న మేగ్నటిక్ ఇండియా సదస్సులో మాట్లాడుతూ అన్నారు. సంక్షోభ సమయంలో తమ ప్రభుత్వం పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. తమ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులకే పరిమితం కాకుండా వాటి ఫలితాలను రాబడుతామని ఆయన అన్నారు. గత మూడున్నర సంవత్సరాల కాలంలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ద్వారా బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి బలమైన ఆర్థిక వ్యవస్థగా మారిందని త్వరలోనే భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మారనుందన్నారు. త్వరలోనే మహారాష్ట్ర కూడా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మారుతుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. పటిష్టమైన విధానాలు.. పక్కా ప్రణాళిక, నిర్వహణ ద్వారా దేశాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోవచ్చునని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇక్కడ చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ 'మాగ్నెటిక్ మహారాష్ట్ర' సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు. తన ప్రసంగంలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించిన రాష్ట్రంగా మహారాష్ట్ర రికార్డు కెక్కుతుందన్నారు. ఈ సదస్సుకు సుమారు 150 మంది పెద్దకంపెనీల సీఈవోలు హాజర య్యారు. ప్రస్తుతం దేశం సరైన దిశలో ముందుకు పోతోందని.. అన్నీ లావాదేవీలు పారదర్శకంగా పనిచేస్తున్నా యన్నారు. ప్రభుత్వం విధానాలతో పాటు ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వం అన్నిటికి బాధ్యత వహిస్తోందన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే సంపూర్ణదృష్టితో చూడాలని, అప్పుడే పురోభివృద్ధి చెందుతున్నారు. తన ప్రభుత్వం పటిష్టమైన విధానం, పక్కా ప్రణాళిక, నిర్వహణతోనే దేశం ముందుకు పోతుందని భావిస్తున్నామన్నారు. తన అంచనా ప్రకారం మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ(రూ.65లక్షల కోట్ల)కు చేరుతుందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి మహారాష్ట్రప్రభుత్వం పెట్టుబడులు ఆకర్షిం చడానికి గట్టి చర్యలు తీసుకుందన్నారు. మహారాష్ట్ర అభివృ ద్ధిని చూసే తమ ప్రభుత్వం భవిష్యత్తులో భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటుందన్నారు. ఫ్రోస్ట్ అండ్ సుల్లీవాన్ ర్యాంకింగ్‌లో మహారాష్ట్ర దేశంలో నెంబర్ వన్ స్థానాన్ని సాధించిందని.. అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ప్రధాని అన్నారు. ఫిబ్రవరి 2016లో ముంబైలో పధానమంత్రి మేకిన్ ఇండియాను ప్రారంభించిన తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీని ట్యాగ్‌లైన్ 'మేడ్ ఫర్ బిజినెస్ 'అని పెట్టారు. 5,000 ఎంఓయులపై ఒప్పందాలు : ఇదిలా ఉండగా మహారాష్ట్రప్రభుత్వం ఈ సదస్సులో కనీసం 5,000 ఎంఓయూలు అవగాహన ఒప్పందాలు కుదర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులు రాబట్టాలని చూస్తోంది. సుమారు 35 లక్షల మందికి ఉద్యోగాలుక ల్పించాలనుకుంటోంది. ఈ బిజినెస్ సదస్సుపాటు ఈ నెల 23 వరకు ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 23 ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. వాటిలో ముంబై మెట్రో, ముంబై - నాగపూర్ సూపర్ కమ్యూనికేషన్ ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై - కోస్టర్ రోడ్, ముంబై ట్రాన్స్ - హార్బర్ లింక్, నవీ ముంబైఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దీనికి ప్రధానమంత్రి మోడీ ఆదివారం నాడు శంకుస్థాపన చేశారు.

నాలుగు సూత్రాలపై
మేగ్నటిక్ మహారాష్ట్ర :ఫడ్నవీస్


మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ మెగ్నెటిక్ మహారాష్ట్ర మొత్తం నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉందని.. అవి ఉద్యోగం, స్థిరత్వం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలికం), భవిష్యత్ పరిశ్రమలపై ఆధా రపడి ఉందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి మహారాష్ట్ర మహాద్వారం(గేట్‌వే) అవుతుందన్నారు. వినూత్నమైన పారిశ్రామిక వాడలకు స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చిరునామా మహారాష్ట్ర అవుతుందన్నారు.

మహీంద్రా గ్రూపు పెట్టుబడులు రూ.2,325 కోట్లు




మహీంద్రా గ్రూపు మహారాష్ట్ర లో మొత్తం మూడు ప్రాజెక్టులపై రూ.2,300 కోట్లు పెట్టుబడులు పెడుతుంది. వాటి లోనే సుమారు రూ.1,700 కోట్లు వినోద కార్యక్ర మాల ప్రాజె క్టును ఇక్కడి కాందీవల్ ప్రాంతంలో మెగాపోలీస్ వద్ద పెట్టు బడులు పెడుతున్నట్లు ఎంఅండ్ఎం గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. నాగపూర్‌లో టెక్ మహీంద్రా రూ.125 కోట్ల పెట్టుబడితో గ్రీన్ టెక్ హబ్‌ను ఏర్పాటు చేస్తుందని సు మారు రూ.2,500 మందికి ఉద్యోగులు లభిస్తాయన్నారు. ఇ ప్పటికే మహీంద్రా గ్రూపు నాలుగు లీజర్ సర్వీసెస్‌ను విజ యవంతంగా నడిపిస్తోందన్నారు. మహీంద్రా హాలీడేస్ పర్యా టక రంగంలో దూసుకుపోతోందన్నారు. మరో రూ.500 కోట్లను కొత్త ఎలక్ట్రిక్ వెహికిల్ విధానానికి వినియోగిస్తామని మహీంద్రా అన్నారు.

ముఖేష్ అంబానీ వాటా రూ.60వేల కోట్లు



బిలియనీర్ ముఖేష్ అంబానికి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీతో పాటు దాని గ్లోబల్ భాగస్వా ములు కలిసి మహారాష్ట్రలో ఇంటిగ్రెటెడ్ డిజిటల్ రంమ గంలో సుమారు రూ.60వేల కోట్లు పెట్టుబడులు పెడతామని ఆయన ఇక్కడ జరుగుతున్న మాగ్నెటిక్ మహారాష్ట్రఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రకటించారు. అయితే ఈ పెట్టుబడులు ఎక్కడెక్కడ పెడతామనే విషయంపై స్పష్టంగాచెప్పలేదు. అయితే తమ ప్రాజెక్టులకు గ్లోబల్ ఇన్వెస్టర్లను మంచి స్పందన లభించిందన్నారు. వారం రోజుల్లోగా 20 గ్లోబల్ కంపెనీలు తమ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని అంబాని అన్నారు. వాటిలో సిస్కో,సీమన్స్; హెచ్‌పీ, డెల్, నోకియా, నీవిడాలని వివరించారు. ఆయన మాట్లాడుతూ తయారీరంగంలో చైనా విప్లవాత్మకమైన విజాయాలు సాధించి రికార్డు సాధిస్తే, భారత్ దాని కంటే వేగంగా తయారీరంగంలో పారిశ్రామిక విప్లవాన్ని సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే టెలికంరంగంలో జియోనెట్‌వర్కు పేరుతో రూ.1.40 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టింది. తాజాగా మరో రూ.60వేల కోట్లు పెట్టుబడులు పెడతామని ముందుకొచ్చింది.

ముంబై -పూనే హైపర్‌లూప్ ప్రాజెక్టు వర్జిన్‌గ్రూపు..



మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదర్చుకొని ముంబై - పూనేల మధ్య హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ నిర్మాణ వ్యవస్థను చేపట్టబోతోంది. దీంతో ముంబై - పూనేల మధ్య ప్రస్తుతం ప్రయాణానికి సుమారు మూడు గంటల సమయం పడుతుంది. హైపర్‌లూప్ అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణం కేవలం 20 నిమిషాల్లో చేరుకోవచ్చు. మహారాష్ట్రప్రభుత్వం వర్జిన్ గ్రూపు ఒప్పందం కుదర్చుకుందని గ్రూపు చైర్మన్ రిచర్డ్‌బ్రాన్‌సన్ చెప్పారు. ఆయన కూడా ఈ సదస్సుకు హాజరయ్యారు. సంవత్సరానికి హైపర్‌లూప్ ద్వారా 1.5కోట్ల మంది ప్రయాణించవచ్చునని ఆయన అన్నారు. దీంతో మహారాష్ట్ర రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ ప్రాజెక్టుపై సుమారు 5500 కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయని.. వేలాది మందికి ఉద్యోగాలు కల్పించవచ్చునని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయంతో పాటు ఎన్ని సంవత్సరాల్లో పూర్తవుతుందో వివరాలు మాత్రం ఇంకా ప్రకటించలేదు.

నీరవ్ తర్వాత.. కొఠారి?
● రోటోమాక్ పెన్ అధినేత




కాన్పూర్ : ఇటీవల వజ్రాల వ్యాపారి నీరావ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సుమారు రూ.11,400 కోట్లు కుచ్చుటోపీ పెట్టాడు. తాజాగా బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ స్కాం రూ.17,600 కోట్లని చెబుతున్నారు. ప్రస్తుతం మోడీ బ్యాంకుకు పంగనామాలు పెట్టి అమెరికాలోని జెడబ్ల్యు మారియట్ హోటల్‌లో విలాసవంతమైన సూట్‌లో సేదతీరుతున్నాడు. ఇవన్నీ పక్కన పెడితేతాజాగా రోటోమాక్ పెన్స్ యజమాని విక్రం కొఠారి కూడా కాన్పూర్ నుంచి మాయమయ్యాడని చెబుతున్నారు. ఆయన బ్యాంకులకు సుమారు రూ.837 కోట్లు బకాయిపడ్డారని చెబుతున్నారు. మోసగాళ్లకు ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు కామధేనువులుగా తయారయ్యాయి. కొఠారి విషయానికి వస్తే అలహాబాద్ బ్యాంకుకుచెందిన కాన్పూర్ బ్రాంచీ నుంచి రూ.352 కోట్లు రుణం తీసుకున్నారు. వీటిలో పాటు బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల నుంచి సుమారు రూ.485 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. అలహాబాద్‌కు చెందిన రీకవరీ ఏజెంట్ రమేశ్‌గుప్తా మాత్రం కొఠారికి చెందిన ఆస్తులను జప్తు చేసుకున్నామని ప్రకటించారు. అలహాబాద్ బ్యాంకు విక్రం కొఠారి నుంచి బకాయిలు వసూలు చేసే పనిలో పడింది. ఆయన ఆస్తులను తనఖా పెట్టుకొని రుణాలు ఇచ్చామని బ్యాంకు చెబుతోంది. కాబట్టి ఆయన వీలైనంత వరకు ఎక్కువ మొత్తంలో రుణాలు వసూలు చేసుకుంటామని బ్యాంకు భరోసా వ్యక్తం చేస్తోంది. కొఠారి ఖాతాను బ్యాంకు ఎన్‌పీఏ కింద తన పద్దుల్లో రాసుకుంది. గత వారం నుంచి కాన్పూర్‌లోని కొఠారి కార్యాలయం మూతపడింది. ఆయన కూడా అందుబాటులో లేరు. పీఎన్‌బీ మోసం కేసు బట్టబయలు కాగానే కొఠారి కూడా మాయం అయ్యారని చెబుతున్నారు.

వడ్డీరేట్లు యథాతథం
● కొటక్ పరిశోధన పత్రం

న్యూఢిల్లీ : ఈ ఏడాది జూన్ వరకు రిజర్వ్‌బ్యాంకు వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించే అవకాశాలున్నాయని బ్రోకరేజి సంస్థలు నివేదికలు పేర్కొన్నాయి. పెరిగిపోతున్న రిటైల్ ద్రవ్యోల్బణంతో పాటు రుతుపవనాలపై స్పష్టతవచ్చేంత వరకు రైతులకు కనీస మద్దతు ధర, ముడి చమురు ధరలు తదితర అంశాలు వడ్డీరేట్ల తగ్గింపునకు అడ్డంకిగా మారాయని కొటక్ పరిశోధన పత్రం లో ప్రకటించింది. రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నాటికి 5.85 శాతానికి ఎగబాకే అవ కాశాలున్నాయని పత్రంలో వివరించింది. మొత్తానికి ఆర్‌బీఐ పరిస్థితులను నిశి తంగా గమనిస్తోందని పేర్కొంది. ఫిబ్రవరి 7న జరిగిన ద్రవ్య పరపతి సమీ క్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను యధాతథంగా 6 శాతంగా కొన సాగించడానికి నిర్ణయిం చింది. ఇదిలా ఉండగా గ్లోబల్ బ్రోకరేజి సంస్థ మో ర్గాన్‌స్టాన్లీ మాత్రం 2018 చివరి త్రైమాసికంలో వడ్డీరేట్లను పెంచుతాయని ప్రక టించింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు ద్రవ్యోల్బణం పెరగే అవకా శా లున్నందు వల్ల క్యూ4లో వడ్డీరేట్లు పెరుగుతాయని మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది.

పీఎస్‌యూ బ్యాంకుల నుంచి
వాటాలు తగ్గించుకోండి

●ప్రభుత్వానికి అసోచామ్ సూచన



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11, 400 కోట్ల భారీ స్కాంబహిర్గతం కావడంతో.. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల్లో తమ వాటాను 50 శాతం కంటే తగ్గించుకోవాలని భారత పారిశ్రామికమండలి అసోచామ్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రైవేట్ బ్యాంకుల మాదిరిగా పీఎస్‌యు బ్యాంకులు వ్యవహరించడానికి అనుమతించరా దని, వాటాదారులకు బాధ్యతను వహించాల్సి ఉంటుందన్న స్పృహ ఉండాలని, అదే సమయంలో డిపాజిటర్ల ప్రయోజనం కాపాడాల్సి బాధ్యత ఉంటుందని అసోచామ్ ప్రభుత్వానికి గుర్తు చేసింది. పీఎన్‌బీ ముంబై బ్రాంచీ నుంచి రూ.11,400కోట్ల విలువ చేసే లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్ఓయు)లు మోసపూరితంగా జారీ చేసి బిలియనీర్ నగల వ్యాపారి నీరవ్ మోడీకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పీఎస్‌యు బ్యాంకులు ఒక సంక్షోభం తర్వాత మరో సంక్షోభంల్లో కూరుకుపోతున్నాయని, దీనికి ఒక హద్దు అంటూ ఉండాలని ప్రభుత్వానికి గుర్తు చేసింది. పన్ను చెల్లింపుదారుల డబ్బుతో బ్యాంకులకు ఎన్ని సార్లు బెయిల్ అవుట్ ప్యాకేజీలు ఇచ్చి ఆదుకుంటరాని ప్రశ్నించింది.

ప్రస్తుతం పీఎస్‌యు బ్యాంకుల్లో పని చేసే ఉన్నతాధికారులు ప్రభుత్వం ఉద్యోగిలా భావిస్తున్నారని,, ప్రస్తుతం సీనియర్ మేనేజ్‌మెంట్ హోదాలో పనిచేసే వారు ప్రభుత్వ ఉన్నతాధికారుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని, వారు రోజు వారి బ్యాంకింగ్ వ్యవహారాల్లో అనవసరపు జోక్యం చేసుకుంటున్నారని అసోచామ్ ఆవేదన వ్యక్తం చేసింది. బ్యాంకు ఉన్నతాధికారులు విలువపై సమయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారు లతో గడపడం వల్ల బ్యాంకుల్లో జరిగే కీలక లావాదేవాలపై ముఖ్యంగా రిస్క్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టలేకపోతున్నారని పేర్కొంది. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల్లో తమ వాటాను 50 శాతం కంటే తగ్గించుకుంటే బ్యాంకులకు స్వయం ప్రతిపత్తి తో పాటు సీనియర్ మేనేజ్‌మెంట్ బాధ్యతతో వ్యవహరిస్తారని అసోచామ్ పేర్కొంది. బ్యాంకు బోర్డులో ఖచ్చితమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలని, సీఈవోలు పూర్తిస్థాయిలో బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వ అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులుండరాదని పేర్కొంది. ప్రస్తుతం రోజుకో కొత్త కొత్త టెక్నాలజీ రావడంతో బ్యాంకింగ్ రంగం కూడా వాటిని అమలు చేస్తోంది. ఈ టెక్నాలజీలు ఇటు వరంగాను శాపంగా మారిపోతున్నాయని తెలిపింది. అసోచామ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం దీనిపై పూర్తిస్థాయిలో ఆత్మపరిశోధన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్యాంకింగ్ రంగానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరతూనే, బ్యాంకింగ్ రంగం వ్యాపారంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఆయనకోరారు. దీనికి రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా నాయకత్వం వహించి, బ్యాంకింగ్ రంగంలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

ప్రాజెక్టుల ఆలస్యం...
ప్రభుత్వానికి ఆర్థిక భారం

● 349ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై రూ.2లక్షల కోట్లపైనే....



న్యూఢిల్లీ : ప్రభుత్వ చేపట్టిన మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులు ఆలస్యం అయ్యే కొద్దీ ఈ ప్రాజెక్టులపై వ్యయం మరింత పెరుగుతూపోతోంది. ఇప్పటి వరకు 349 ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు ఒక్కో ప్రాజెక్టు రూ.150 కోట్లు లేదా అంత కంటే ఎక్కువ విలువ చేసేవి. ఈ ప్రాజెక్టులు వివిధ కారణాల వల్ల ఆలస్యం కావడంతో వీటిపై వ్యయం అదనంగా రూ.2 లక్షల కోట్లు దాటిపోతోందని ప్రభుత్వం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులు రూ.150 కోట్లు లేదా అంతకంటే విలువైన ప్రాజెక్టును కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ ప్రాజెక్టు అమలుచేసి పర్యవేక్షిస్తోంది. వాస్తవంగా చూస్తే మొత్తం 1283 ప్రాజెక్టులకు రూ.15,58,352.33 కోట్లు వ్యయం చేయాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల జాప్యం కావడంతో ఈ ప్రాజెక్టులపై వ్యయం ప్రస్తుతం రూ.17,59 ,448 3.87 కోట్లను దాటిపోతోంది. వాస్తవ ప్రాజెక్టు వ్యయం కంటే అదనంగారూ.2,01,091.54 కోట్లు లేదా వాస్తవ వ్యయం కంటే 12.90 శాతం పెరుగుతుందని మంత్రిత్వశా ఖ విడుదల చేసిన తాజా నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక అక్టోబర్ 2017లో విడుదల చేసింది. మొత్తం 1283 ప్రాజెక్టుల్లో 349 ప్రాజెక్టుల వ్యయం 302 రెట్లు పెరిగింది. ఈ ప్రాజెక్టులపై 6,59, 009.46 కోట్లు వ్య యం అవుతుందని భావిస్తే ప్రస్తుతం ఇవి 37.46 శాతం పెరిగాయి. 1283 ప్రాజెక్టు ల్లో 12 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 34 కొత్త ప్రాజెక్టులను ఈ నెలలో మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ జరుపుతుంది. 13 ప్రాజెక్టులు మాత్రం షెడ్యూలు కంటే ముందు న్నాయి. 317 ప్రాజెక్టులు షెడ్యూలు ప్రకా రం పనులు కొనసాగుతు న్నాయి. 302 ప్రాజెక్టులు ఆలస్యంగా కొనసాగుతున్నా యి. 349 ప్రాజెక్టుల వ్యయం మాత్రం భారీగా పెరిగిపోయింది. 105 ప్రాజెక్టుల విషయానికి వస్తే ఇటు ఆల స్యంతో పాటు వ్యయం కూడాపెరిగిపోతోందని నివేదికలో వివరించింది. మొత్తానికి చూస్తే 258 ప్రాజెక్టుల్లో ఆలస్యం కాస్తా తగ్గించుకుంటూ వచ్చాయి.. తాజాగా షెడ్యూలు పూర్తిని సవరించారు. 302 ఆలస్యం అయిన ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ 49 ప్రాజెక్టులు 1 నెల నుంచి 12 నెలల వరకు, 66 ప్రాజెక్టులు 13 నుంచి 24 నెలల వరకు, 108 ప్రాజెక్టులు 25 నుంచి 60 నెలల వరకు 79 ప్రాజెక్టులు 61 నెలల అంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టులు ఆలస్యం అయ్యి వ్యయం పెరగడానికి దారి తీసిన పరిణామాల గురించి వివరిస్తూ.. భూసేకరణ ఆలస్యంతో పాటు అటవీ అనుమతులు, పరికరాలు సమయానికి సరఫరా చేయకపోవడం, నిధులు కొరత, మావోల ఇబ్బందులు, న్యాయపరమైన చిక్కులు, శాంతిభద్రతల పరిస్థితుల కారణంగా ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయని నివేదికలో వివరించింది.

ఈ వారం మార్కెట్
పీఎన్‌బీ సంక్షోభం...గ్లోబల్ పరిణామాలు


●ముడి చమురు ధరలు కీలకం● ఫలితాల సీజన్ సమాప్తం



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీల కం కానున్న అంశాల విషయానికి వస్తే గ్లోబల్ మార్కెట్లో సంభవించే పరిణామాలు, ముడిచమురు ధరలతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో జరిగిన భారీ కుంభ కోణం ప్రభావితం చేయబోతున్నాయని మా ర్కెట్ నిపుణులు అభిప్రాయ పడుతు న్నారు. ఇప్పటికే డిసెంబర్ త్రైమా సికం ఫలితాల సీజన్ దా దాపు ము గిసినట్లు లెక్క. ఇక దేశ ఆర్థిక వ్యవస్థ విషయానికి వస్తే ఆందోళన కలిగించే అంశా నికి వస్తే.. పెరిగిపో తున్న వాణి జ్యలో టు అని వారు చెబుతు న్నారు. ఇప్పటికి మార్కెట్లో 5 శాతం కరెక్షన్ కనిపి స్తోంది. ఇక్కడి నుంచి మా ర్కెట్ స్థిర పడే అవకాశాలున్నా యని, ఇన్వె సర్లకు ప్రధా నంగా ఆందో ళన కలిగించే అంశం వాణిజ్య లోటు అని వారు చెబుతు న్నారు. పీఎస్ యు బ్యాంకుల్లో ఏదో ఒకరూపంలో రోజుకో స్కాం బయట పడుతుండటంతో మిగిలిన బ్యాంకుల పై కూడా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల స్కాం వెలుగు చూడ్డంతో దాని ప్రభావం మిగిలిన పీఎస్‌యు బ్యాంకులపై కనిపి స్తోంది. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్ఓయుల తీసుకొని వజ్రాల వ్యాపారా నీరావ్‌మోడీ యూనియన్ బ్యాంకు, అలహాబా ద్, యాక్సిస్ బ్యాం కుల నుంచి రుణా లు తీసుకున్నారు. ఈ బ్యాంకులు కూడా పరో క్షంగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. స్కాం బహిర్గతం కావడంతో పీఎన్‌బీఐ 52 వా రాల కనిష్ఠానికి దిగిచ్చింది.

దీంతో మిగిలిన పీఎస్‌యు బ్యాంకుల షేర్లపై ప్రభావం కనిపిం చింది. శుక్రవారం నాడు పీఎన్‌బీ, ఎస్‌బీఐ, యూనియ న్ బ్యాంకు, అలహాబాద్ , యాక్సిస్ బ్యాంకులు నష్టాలను చవిచూ శాయి. దేశీయ పరిణామా లతో పాటు ముడి చమురు ధరలు ఈ వారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించబోతున్నాయి. గత వారం స్టాక్ మార్కెట్ 286.71 పాయింట్ల నష్టపోగా.. నిఫ్టీ 93.20 పాయింట్లు క్షీణించింది

విస్తరణబాటలో
రెయిన్‌బో హాస్పిటల్స్



హైదరాబాద్ : చిల్డ్రన్స్ హెల్త్‌కేర్ చెయిన్ రెయిన్‌బో గ్రూపు ఆఫ్ హాస్పటల్స్ కొత్త గా రెండు ఆస్పత్రులను అందు బాటులోకి తేబోతోం ది. వచ్చే ఏడాది చివరి నాటికి రూ.150 కోట్ల పెట్టుబడులతో మొత్తం 320 పడకల ఆస్పత్రిని ప్రారం భించబోతోంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం మొత్తం పది ఆస్పత్రుల్లో 1080 పడకల ఆస్పత్రి నిర్వహిస్తోంది. మరో రెండు పిల్ల ఆస్పత్రులను చెన్నై, విశాఖపట్నంలలో 150 పడకల ఆస్పత్రిని ప్రారం భించబోతున్నట్లు రెయిన్‌బో గ్రూపు హాస్పిటల్స్ చైర్మన్ ఎండీ రమేశ్ కంచర్ల తెలిపారు. వీటితో పాటు ప్రస్తుతం బెంగళూరు, విజ యవాడలో ఉన్న ఆస్పత్రులను విస్తరి స్తున్నట్లు వీటికి అదనపు పడకలను పెంచు తున్నట్లు ఆ యన తెలిపారు. మొత్తం పెట్టుబడులురూ.150 కోట్ల వరకు ఉంటా యన్నారు. పెట్టుబడులు అంతర్గతంగా సమకూర్చుకుం టామన్నారు. గ్రూపు 1999 లో ప్రారం భించింది. మల్టీ స్పెషాలిటి చిల్డ్రన్ హాస్పిటల్స్ హైదరా బాద్, విజయవాడ, బెంగళూరు, ఢిల్లీలో చిన్న పిల్లల ఆస్పత్రులను నిర్వహిస్తోంది.

ఐపీఓకు 8 పీఎస్‌యూ కంపెనీలు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెం దిన మొత్తం ఎనిమిది కంపెనీలు వచ్చే ఆర్థిక సం వత్సరంలో ఐపీవో మార్కెట్‌కు రానున్నా యి. వాటిలో హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్, రైట్స్‌లున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కు రావడం వల్ల ఈ కంపెనీల వాస్తవ విలువ ఏ మిటో తెలుస్తుంది. కంపెనీలు బాధ్యతయు తంగా పనిచేయడానికి వీలుంటుంది. డిపా ర్ట్‌మెంట్ ఆఫ్ఇన్వె స్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్య దర్శి నీరజ్‌గుప్తా మాట్లాడుతూ... ఈ కంపెనీ ఇష్యూ ధర, మార్కెట్లోకి ఎప్పుడు వచ్చేది త్వరలో ప్రకటిస్తామని తెలిపా రు. వాటిలో హెచ్‌ఏఎల్ ఇప్పటికే మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి నుంచి అనుమతులు కూడా తీసుకుంది. ప్రభుత్వం ఈ కంపెనీ నుంచి పది శాతం వాటాలు విక్రయించాలనే ఆలోచనలో ఉంది. వీటితో పాటు నాలుగు పీఎస్‌యు లు , రైట్స్, ఐఆర్ఈడీఏ, భారత్ డైనమిక్స్, మిధానిలు ఇప్పటికే సెబి వద్ద ఐపీవోకు దరఖాస్తు చేసుకున్నాయి. రైట్స్ ఐపీవో ద్వారా ప్రభుత్వం 12 శాతం వాటాలు విక్రయించి రూ.600కోట్లు సేకరించాలనే ఆలోచనలో ఉంది. దీంతో పాటు 13.90 శాతం వాటాలను ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలెప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ),రక్షణ రంగానికి చెందిన భారత్ డైనమిక్స్‌లో 12 శాతం, మిశ్రధాతు నిగంలో 25 శాతం వాటాలు విక్రయించాలనే ఆలోచనలో ఉన్నాయి.

కేంద్రంపై తెదేపా అవిశ్వాసం పెడితే

మద్దతిస్తాం



కందుకూరు గ్రామీణం, ప్రభ న్యూస్: తెలుగుదేశం పార్టీ కలిసొస్తే కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి తాము సిద్ధమేనని, మార్చి చివరిలో కేంద్రంపై అవిశ్వాసం పెడతామని, టీడీపీ పెట్టినా మద్దతు ఇస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా కందుకూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తానా అంటే జనసేన నేత పవన్‌కల్యాణ్ తందానా... అంటూ వంత పాడుతున్నారని వారిద్దరి తీరును దుయ్యబట్టారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల వివాదంపై పవన్‌కల్యాణ్ నిజనిర్ధారణ కమిటీతో తేలుస్తాననడంలో అర్థం లేదన్నారు. అవసరమైతే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడాలన్నారు. ప్రత్యేక హోదా కోసం ఏప్రిల్ 6న వైఎస్సార్ సీపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని జగన్ మరోమారు స్పష్టం చేశారు. పదవులకు రాజీనామాలు వద్దని మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని పవన్‌కల్యాణ్ సలహా ఇస్తున్నారని, ఆయన సలహా పాటించడానికి తాము సిద్ధమేనని, అయితే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే లోక్‌సభలో 54 మంది సభ్యుల సంతకాలు చేయాలని, అంత బలం తమకు లేదని, టీడీపీ కూడా మద్దతివ్వాలని, ఇందుకు చంద్రబాబును పవన్ కల్యాణ్ ఒప్పించాలని అన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు తమతో కలిసి టీడీపీ సభ్యులు కూడా పదవులకు రాజీనామా చేయాలని మూడు రోజుల క్రితమే తాను కోరినప్పటికీ చంద్రబాబునాయుడు నుంచి ఇంతవరకు ప్రతిస్పందన లేదని జగన్ విమర్శించారు. గత నాలుగేళ్ళుగా కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే మెచ్చుకున్న చంద్రబాబు, శాసనసభ ఎన్నికలకు ఇక సంవత్సరకాలమే ఉండటంతో బీజేపీ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటున్నారని, కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాతనే బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని, కేబినెట్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యులు ఉన్న విషయం మర్చిపోయారా అని జగన్ ప్రశ్నించారు. 2017 జనవరి 27న అన్ని రాష్ట్రాలకన్నా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికే అధిక నిధులు ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక తెలుగు దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని, ఆ తరువాత ఫిబ్రవరిలో 2017-18 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కూడా ఆయన మెచ్చుకున్నారన్నారు. కానీ హఠాత్తుగా ఇప్పుడే కొత్తగా రాష్ట్రానికి నష్టం జరిగినట్టు పల్లవి ఎత్తుకున్నారని విమర్శించారు. శాసనసభ ఎన్నికల ముందు జనాన్ని మరోసారి మోసగించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు.

ఆరోగ్య శ్రీ మరింత విస్తరణ

వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరోగ్య శ్రీ (ఇప్పుడు ఎన్టీఆర్ వైద్యసేవ) పథకాన్ని మరింత విస్తరిస్తామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైద్య చికిత్స ఖర్చు వెయ్యి రూపాయలు దాటిన ప్రతి పేదవాడికి ఆ తరువాత చికిత్సనంతా ఆరోగ్య శ్రీ క్రింద ఉచితంగానే అందిస్తామన్నారు. తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధి పీడితులకు నెలకు పది వేల రూపా యలు వంతున పింఛను ఇస్తామని, అంతేగాక ఆరోగ్య శ్రీ కింద ఇతర రాష్ట్రాల ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫీజులు చెల్లిస్తామని తెలిపారు.

దళారీలకు నేత చంద్రబాబు..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మన రాష్ట్రంలోని వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ల దళారీలకు నాయకుడిగా తయారయ్యారని జగన్ ఆరోపించారు. శనగ, కంది, పొగాకు తదితర పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. రైతులు తమ ఉత్పత్తులను దళారులకు అమ్ముకున్న తరువాత చంద్రబాబు వాటిని కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయించి దళారులకు ప్రయోజనాలు చేకూరుస్తున్నారన్నారు. చంద్రబాబు హెరిటేజ్ కంపెనీ వీటి వల్లే లాభపడుతుందని, అందుకే ధరల స్థిరీకరణకు ప్రయత్నించడం లేదని ఆరోపించారు. గత శాసనసభ ఎన్నికల్లో వ్యవసాయోత్ప త్తుల ధరల స్థిరీకరణకు ఐదువేల కోట్ల రూపాయలతో నిధి ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని ఇప్పటికీ అమలు జరపడంలేదని దుయ్యబ ట్టారు. నిరుద్యోగులను కూడా చంద్రబాబు దగాచేశారని, నిరుద్యోగ భృతి ఇంతవరకు ఆచరణలోకి రాలేదని గుర్తుచేశారు.

హోదా కోసం

కలిసి నడుద్దాం

- పార్టీలకతీతంగా ఐక్యపోరాటం
- నాటకం ఆడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- బాధ్యతలేకుండా మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు
- నేటి నుంచి మార్చి 8 వరకు నిరసన కార్యక్రమాలు
- బడ్జెట్ సమావేశాలు ముగిసేలోగా హోదా సాధిద్దాం
- విజయవాడ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, నేతలు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా సాధన కోసం పార్టీలకతీతంగా కలిసి నడిచి ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు తీర్మానించాయి. కేంద్ర బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపు రాష్ట్రా నికి ప్రత్యేక హోదా వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి పెంచుదామని, సోమవారం నుంచి మార్చి 8 వరకు వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుకు పత్యేక హోదా సాధనసమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో ఇంకా ముసుగులో గుద్దులాట సరికాదని, పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే అభిప్రాయన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రం పట్ల ఏమాత్రం బాధ్యత లేనట్లుగా మాట్లాడుతున్నరని విమర్శించారు. హోదాపై ఆయనకు చిత్తశుద్ధి ఉంటే అందరినీ ఆహ్వానించాలని, ఐక్యంగా పోరాడి ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ కేంద్రంపై పోరుసాగిద్దామని మధు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రానికి ఏమి అవసరమో, ఏమి సాధించాల్సి ఉందో అన్న అంశంపై ఒక్క చంద్రబాబుకు తప్ప అందరికీ స్పష్టత ఉందని ఎదేవా చేశారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ సమానమని చెప్పిన ఆయన ఇప్పుడు ఏదో మాట్లాడుతూ గందరగోళంలో ఉన్నారని, తొలుత ఆయన దీనినుంచి బయటకు రావాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సంయుక్తంగా పోరాటం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదాను పక్కకుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. హోదా సాధించే వరకు ఉద్యమించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. హోదా సాధన కోసం 'ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష' చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా పోరాటంలో కలసి రానివారంతా రాష్ట్ర ద్రోహులేనని అన్నారు. తమతో కలిసి రాకపోతే ఏ పార్టీ అయినా భూస్థాపితం అవుతుందని హెచ్చరించారు. అనంతరం సినీ హీరో శివాజీ మాట్లాడుతూ హోదా సాధన కోసం పాటుపడతామని కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి తన పాపాన్ని సగం కడుక్కుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ఎంతో చేసిందనిఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

ప్రత్యేక హోదా సాధన కోసం ఎక్కడ రాజీపడే ప్రసక్తేలేదని కేంద్రం దిగివచ్చే వరకు పోరు కొనసాగిస్తామన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికైనా హోదా సాదనకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. వైసీపీ నేత కొలుసు పార్దసారధి మాట్లాడుతూ రాష్ట్రానికి జరిగిన అన్యాయం పట్ల ప్రతిఒక్కరి రక్తం ఉడికిపోతోందన్నారు. ఎవరి పై పోరాటం చేస్తారో ప్రజలకు ముఖ్యమంత్రి స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రానికి ఆన్యాయం జరుగుతున్న చంద్రబాబు చూస్తూ ఉండిపోయారే తప్ప ఎలాంటి పోరాటం చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. చట్టసభల్లో ఇచ్చిన హామీలను కేంద్రానికి తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు.

సమావేశ నిర్ణయాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలు రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా కోసం చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించాయి. దీనిలో భాగంగా పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఈ నెల 19న ఒంగోలులో ఏపీజెఏఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష, 19 నుంచి 28 వరకు కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్ష, 20న రాజమండ్రిలో బహిరంగ సభ. 28న కర్ణాటకలో హీరో శివాజీ నేతృత్వంలో సమావేశం. మార్చి 1న వైసీపీ ఆధ్వర్యంలో అన్ని కలెక్టరేట్ల ముట్టడి. మార్చి 4న కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన. 5న వైసీపీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ లో ధర్నా. మార్చి 6,7 తేదీలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నా. 8న కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో పార్లమెంట్. మార్చి 5న వారం రోజుల్లో అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ ఎంపీలకు లేఖలు రాయాలని నిర్ణయించారు.

జనంలోకి వెళదాం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపి కంభంపాటి హరిబాబు, ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు, ఎంపి గోకరాజు గంగరాజు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పి.వి.ఎన్.మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు, సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి పురంధేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన సమావేశం రాత్రి 7 గంటల వరకు కొనసాగడం విశేషం. ఈ సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు రాగా వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై పార్టీలో అంతర్గతంగా చర్చ జరిగింది. ఎవరి అభిప్రాయాలను వారు తెలిపినా..కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అందించిన నిధులు, శరవేగంగా సాగుతున్న అభివృద్ధి తదితర అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నామని మాత్రం బిజెపి సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. ఒక విధంగా చెప్పాలంటే బాబుతో చర్చకు తాము సిద్ధమని కొందరు నాయకులు మాట్లాడగా అసెంబ్లీలో తేల్చుకుంటామని ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అయితే టిడిపి నేతల చేస్తున్న విమర్శలకు ధీటుగా బదులివ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన నిధులపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బిజెపి వల్లనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వాస్తవాలు మాట్లాడకుండా కేంద్రం ఇచ్చిన నిధులకు తమ పథకాల పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని భవనాలకు డిజైన్లు సిద్ధం కాకపోయినా..డిపిఆర్ రాకున్నా..2500 కోట్లు ఇచ్చామని మిత్రపక్షంగా ఉన్న తెలుగు దేశం నాయకులు వాస్తవాలకు భిన్నంగా అవాస్తవాలు మాట్లాడుతున్నారని నాయకుల వ్యవహారశైలిని దుయ్య బట్టారు.



తెలుగుదేశం పార్టీ నాయకులు నోరు పారేసుకుంటు బిజెపిపై వాళ్లు జరుపుతున్న మూకుమ్మడి దాడికి ప్రతిగా అన్ని విషయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని మాధవ్ నాయకులకు సూచించారు. రాష్ట్రానికి జరిగిన అభివృద్ధిపై స్క్రిప్ట్ చదవాల్సిన అవసరం తమ పార్టీ అధ్యక్షుడు హరిబాబుకు లేదని, చంద్రబాబు చర్చకు వస్తే తాము కూడా చర్చకు సిద్ధంగా ఉన్నామని, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. తమను పిలిపించి మాట్లాడే అవకాశం మిత్రపక్షంగా చంద్రబాబుకు ఉందని తమ అధ్యక్షుడు కూడా అందుకు సిద్ధంగా ఉన్నారని ఎక్కడికి పిలిచినా వస్తామని వీర్రాజు అన్నారు. ఢిల్లీ వంటి అభివృద్ధిని ఏపికి అందించామని, రాష్ట్రం విడిపోయాకనే అభివృద్ధి ఎక్కువగా జరిగిందన్న వీర్రాజు రాష్ట్రాభివృద్ధిపై ఎవరూ చింతించాల్సిన అవసరం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పాలంటే నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పురంధేశ్వరి అన్నారు. అందుకు కార్యాచరణను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకతపై ఆమె మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు, వ్యయాలు. ఏయే పథకాలకు నిధుల మళ్లింపులు వంటి అంశాలన్నింటిని అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడతామని ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు సమావేశంలో స్పష్టం చేశారు. కాగా సమావేశంలో నేతల ప్రసంగాలు సాగుతున్న సమయంలో పార్టీ సీనియర్ నాయకుడు కె లక్ష్మీపతిరాజు లేచి బిజెపిని రాష్ట్రంలో బలపడకుండా చేస్తున్నారని అనగా కలకలం రేగింది. కేంద్రం ఇచ్చిన నిధులుపై ప్రజలకు వివరించేందుకు గాను బస్సు యాత్ర నిర్వహించాలన్న లక్ష్మీపతిరాజు వ్యాఖ్యలకు హరిబాబు అడ్డుతగిలారు. లక్ష్మీపతిరాజును కూర్చొమని కోరగా తన గళం వినిపిస్తానని అందరి అభిప్రాయాలు వినాల్సిందేనని ఆయన ఘంటాపథంగా చెప్పగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దేశం పార్టీని కట్టడి చేయలేకపోవడం పట్ల పార్టీ క్యాడర్‌లో అసహనం ఉందన్న విధంగా లక్ష్మీపతిరాజు వ్యాఖ్యానించారని పార్టీ వర్గాల సమాచారం.

ఇక వారి అనుమతి

అవసరం లేదు..

రియాద్ : సౌదీ అరేబియా మహిళలకు అక్కడి ప్రభుత్వం మరో శుభవార్తనందించింది. ఇక మీదట సౌదీ మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చు. ఇందుకు అడ్డంకి ఉన్న నిబంధనలను ఎత్తివేస్తూ ప్రభుత్వ అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు సౌదీ అరేబియాలో మహిళలు ఏదైనా వ్యాపారం చేయాలంటే భర్త,తండ్రి లేక సోదరుల అనుమతి అవసరం ఉండేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండా ప్రభుత్వం నిబంధనలు సడలించింది. మహిళలు పురుషుల అనుమతి లేకుండా వ్యాపారం చేసుకోవచ్చని సౌదీ అరేబియా వాణిజ్యశాఖ ఉత్తర్వులిచ్చింది. ప్రైవేట్ రంగంలో కూడా మహిళలు రాణించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

ప్రపంచంలోనే

తొలి ఐటీ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రపంచంలోనే తొలిగారిగా ఐటీ సదస్సు నేడు హైదరాబాద్‌లో జరుగుతోంది. నాస్కామ్ నేతృత్వంలో కేంద్ర ఐటీ శాఖ భాగస్వామ్యంతో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. 35 దేశాల నుంచి సుమారు 5వేల మంది ప్రతినిధులుఇందులో పాల్గొననున్నారు. టెక్నాలజీ పరివర్తన, దాని ఫలితాలపై ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీ నుంచి లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రసంగించనున్నారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావులతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఐటీ సంస్థల అధిపతులు, నిపుణులు ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొననున్నారు.

అభ్యర్థుల గుండెల్లో టెట్ 'గంట'

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయా? లేవా? అన్న సమాచారం విద్యాశాఖ సేకరించాల్సి ఉంది. ఇక్కడ ఈ ప్రస్తావన ఎందుకొచ్చిందంటే ... కొందరికి పరీక్ష కేంద్రం కేటాయించిన తీరు చూస్తే తెలుస్తోంది. కళాశాలే లేని ప్రాంతంలో అక్కడ అభ్యర్థులను కేటాయించారు. హాల్‌టికెట్ పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రం గురించి వాకబు చేయగా హాల్ టికెట్‌లో ఉన్న చిరునామాతో అసలు అక్కడ కాలేజే లేదు. దీన్ని బట్టి కేంద్రాలు కేటాయింపులో ఏమాత్రం నిబద్ధత ఉందో చెప్పకనే తెలుస్తోంది.

ప్రధానంగా అభ్యర్థులకు పరీక్ష కేంద్రం కేటాయింపులో ఎంత నిర్లక్ష్యం వహించారో అన్నది తేట తెల్లమవుతోంది. సాంకేతికంగా రోజు రోజుకు కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో ఏ మండల కేంద్రం ఎక్కడ ఉందో.. అక్కడి నుంచి ఎంత దూరంలో ఉన్న కేంద్రానికి అభ్యర్థులను కేటాయించాలన్న సమాచారం గూగుల్ మ్యాప్ ద్వారా తెలుసుకోవడం సులభతరం. ఇంతటి సాంకేతిక అనుకూలత ఉన్న నేపథ్యంలో అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన అభ్యర్థులను ఏకంగా ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలో పరీక్షా కేంద్రం కేటాయించారంటే విద్యాశాఖ వైఫల్యం బహిర్గతమవుతోంది. అనంతపురం జిల్లాకు చెందిన అనేక మంది అభ్యర్థులకు విజయవాడ, గుంటూరు, ప్రకాశం(ఒంగోలు)జిల్లాలకు వేశారు. వీరందరూ అంత దూరం వెళ్లాలంటే ఎలా?!.

విద్యాశాఖ కొద్దిమేర ఆలోచించి కసరత్తు చేసి ఉంటే ఇవన్నీ సులభతరమే. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 4,46,833. వీరందరిని సరాసరి ఒక్కొక్క జిల్లాకు 34,372మంది అభ్యర్థులకు కేంద్రాలు కేటాయించాలి. కళాశాలలు తక్కువగా ఉన్న పరిస్థితుల్లో పక్కనే ఉన్న జిల్లాకు సర్దుబాటు చేయవచ్చు. ప్రధానంగా రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల అభ్యర్థులకు పక్కన కర్ణాటక రాష్ట్రంలో కేటాయించడానికి అవకాశాలు ఉన్నాయి. కేవలం 50-100కిలో మీటర్ల పరిధిలో కర్ణాటకలో అనేక ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. కర్నూలు జిల్లా వాసులకు రాయచూర్, సింధనూర్, అనంతపురం జిల్లా వాసులకు బళ్లారి.. చిక్కబళ్లాపురం, దొడ్డబళ్లాపురం, బాగేపల్లి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలు కోకల్లలు. ఇక చిత్తూరు జిల్లా అభ్యర్థులకు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న కోలారు, ముళబాగల్, మాళూరు తదితర కళాశాలలను కేటాయించడానికి అవకాశాలు ఉన్నాయి.

ఒకే అభ్యర్థికి ఒకే సమయంలో రెండు పరీక్షలు- వేర్వేరు కేంద్రాలు ఎలా?

డైట్, బి.ఇడి చేసిన అభ్యర్థులతో పాటు భాషా పండితులకు వేర్వేరుగా పేపర్-1, పేపర్-2, పేపర్-3 పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ మూడు పరీక్షలు రాయడానికి అభ్యర్థులు ప్రత్యేక రుసుంతో దరఖాస్తు చేసుకున్నారు. ఇలాంటి వారికి ఒక రోజు తేడా లేదా ఒక సెషన్ తేడాతో ఒకే కేంద్రం కేటాయిస్తే రాయడానికి అవకాశం ఉంటుంది. అయితే మన విద్యా శాఖ ఘనత మాత్రం విచిత్రంగా ఉంది. అనంతపురం జిల్లా మండల కేంద్రమైన నల్లచెరువుకు చెందిన ఉప్పుతల కార్తీక్(హాల్ టికెట్ పేపర్-1 నెంబర్ 1711414304349, పేపర్-2 నెంబర్ 1721415600328). రెండు పరీక్షలూ రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇతనికి 02-03-2018న ఒకే రోజు ఒకే సమయం వేర్వేరు జిల్లాలు గుంటూరు పేపర్-1కు కేటాయించగా, పేపర్-2 కృష్ణా జిల్లాకు కేటాయించారు. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన కప్పల లక్ష్మీనారాయణ(పేపర్-2 హాల్ టికెట్ నెం. 1731112400925, పేపర్-3 హాల్ టి. నెం. 1761216400285)కు 02-03-2018న ఒకే రోజు రెండు పేపర్ల పరీక్షలను వేర్వేరు కేంద్రాలుగా అనంతపురం జిల్లా హిందూపురం, కడపలో కేటాయించారు. ఇలా హాల్ టికెట్‌లు అందుకున్న వారు పరీక్షలు ఎలా రాయాలో విద్యాశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. ఇవి కొన్ని మచ్చుకు మాత్రమే ఇలా వేలాది మంది అభ్యర్థులు ఇలాంటి ఇబ్బందులే పడుతున్నారు. దీనిపై సమగ్రంగా త్వరగా ఆలోచించి ఇలాంటి వారికి సరైన పరిష్కారాం చూపాల్సిన బాధ్యత విద్యాశాఖతో పాటు పాలకులదే.

ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలు



(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఐదుమంది మృతి వెనుక అసలుకథ ఏమిటో అంతుపట్టని విషయంగా మారింది. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోయి దుర్గంధం వెదజల్లడంతోపాటు వారికి సంబందించి ఎటువంటి ఆధారపత్రాలు లభించకపోవడంతో పోలీసులు అయోమయంలో పడ్డారు. కొద్దిరోజుల క్రితం లారీని ఒంటిమిట్ట పరిసరాల్లో పోలీసులు అనుమానంతో వెంబడించడం, వెంటనే తేరుకున్న లారీలోని వ్యక్తులు చెరువుకట్టపై ఆపి చెరువులో దూకి పరారైనట్లు సమాచారం. వీరికోసం పోలీసులు కూడా పెద్దఎత్తున గాలించారు. అయితే మృతిచెందిన వ్యక్తులు పాదచారులా లేక ఎవరైనా ఎక్కడైనా చంపి ఇక్కడ పడేశారా అన్న విషయాలు ప్రశ్నార్థకరంగా మారాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతరిస్తున్న 42 భాషలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న భాషలు, మాండలికాలను ప్రాంతాలవారిగా చూస్తే అండమాన్ అండ్ నికోబార్ దీవులకు చెందినవి 11, మణిపూర్7, హిమాచల్ ప్రదేశ్ 4కు చెందినవి ఉన్నాయన్నారు. అదేవిధంగా ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గాడబా, నాయకి మాండలికాలు ఉన్నాయన్నారు. ది సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజేస్, మైసూరు అంతరించపోతున్న భాషలను రక్షించేవిధంగా పనిచేస్తుందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. జనాభా లెక్కల ప్రకారం 1,635 హేతుబద్ధమైన మాతృభాషలు, 234 గుర్తించదగిన భాషలు కాక దేశవ్యాప్తంగా 22 ప్రధాన భాషలు ఉన్నాయి.

సింగపూర్ యాత్రకు 39 మంది రాజధాని రైతులు

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధాని రైతుల మూడో విడత సింగపూర్ యాత్రను వెలగపూడి సచివాలయంలో ఆదివారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అమరావతి ప్రాంతానికి చెందిన 39 మంది రైతులు, ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు సాధన, శేషిరెడ్డి, అధికారులు కృష్ణకపర్తి, కె.దివ్య బృందం ప్రత్యేక బస్సులో హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్ళింది. అక్కడి నుంచి సింగపూర్‌కు ప్రత్యేక విమానంలో వెళ్లేందుకు ఏపీసీఆర్‌డీఏ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో 68 మంది రైతులు సింగపూర్ యాత్రను విజయవంతంగా ముగించుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్‌డీఏ ప్రత్యేక కమిషనర్ వి.రామమనోహరరావు, ల్యాండ్స్ డైరెక్టర్ బిఎల్.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



మూడో సీటు గెలిచేదెలా?

• వ్యూహ ప్రతివ్యూహాల్లో తేదేపా తలమునకలు • అభ్యర్థిని ప్రకటించిన వైకాపా • ఆసక్తికరంగా రాజ్యసభ ఎన్నికలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీకానున్న మూడు సీట్లను భర్తీ చేయడానికి రాజ్యసభకు త్వరలో ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో ఏపీ ప్రతిపక్ష పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. దీంతో ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరమైన మలుపు చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరును వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయిరెడ్డి శనివారం విశాఖలో ప్రకటించారు. దీంతో రాజ్యసభ ఎన్నికలు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొంది తెలుగుదేశం పార్టీలో చేరిన 23 మంది ఎమ్మెల్యేలతో మూడవ రాజ్యసభసీటును ఎలాగైనా దక్కించుకుని అధికార తెలుగుదేశం పావులు కదుపుతోంది. ఇందుకోసం మూడో అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు యోచిస్తోంది.

ప్రస్తుతం మూడు స్థానాలకు ఖాళీ ఏర్పడనుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికైన రేణుకా చౌదరి, కొణిదల చిరంజీవి, తెలుగుదేశం పార్టీ నుండి ఎన్నికైన టి. దేవేందర్‌గౌడ్ రిటైర్‌మెంట్ కానున్నారు. ఈ నేపథ్యంలో 44 మంది సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉండగా, మిగిలిన 131 మంది తెలుగుదేశం, బీజేపీ కూటమిలో ఉన్నారు. రాజ్యసభలో మన రాష్ట్రం నుండి మొత్తం ఓట్లు 175 మంది ఉన్నారు. ఇందులో ప్రారంభదశలో 67 మంది ఎమ్మెల్యేలు వైకాపాకు ఉండగా ఈ మూడున్నరేళ్ళ కాలంలో 23 మంది ఫిరాయించి తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో వైకాపాకు ప్రస్తుతం 44 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. అయితే, రాజ్యసభ సీటు దక్కించుకోవడానికి సరిగ్గా 44 మంది మాత్రమే అవసరం. వైకాపా ఒక రాజ్యసభ సీటును దక్కించుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం తమకుందని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తమ పార్టీ అభ్యర్థిని కూడా ప్రకటించింది.

రాజ్యసభ సీటు గెలుపొందాలంటే ఎవరైనా అభ్యర్థి కనీసం 44 మంది ఎమ్మెల్యేలు మొదటి ప్రాధాన్యతా ఓటును వేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వైకాపాకి ఈ మ్యాజిక్ ఫిగర్‌కు సరిపడా 44 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే, తెలుగుదేశం పార్టీకి రెండు సీట్లకు సరిపడా అంటే 88 మంది ఎమ్మెల్యేలు పోగా ఇంకా మరో 43 మంది సభ్యులు మిగిలి ఉంటారు. అంటే కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానంతో మూడు రాజ్యసభ సీట్లను పొందేందుకు అవకాశం ఉంది. అది అంత సాధ్యమయ్యే పని కాదని తెలిసినప్పటికీ తెలుగుదేశం రెండో ప్రాధాన్యతా ఓటింగ్‌పై ఆశలు పెట్టుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందేందుకు సరిపడా ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నందున రెండో ప్రాధాన్యతా ఓటుకు తమ అభ్యర్థులను వెల్లిచ్చే పరిస్థితి లేదు. అయితే, మూడోస్థానం దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ రెండో ప్రాధాన్యతా ఓటును వినియోగించుకునే అవకాశం ఉంది. ఒకవేళ మొదటి ప్రాధాన్యతా ఓట్లు టై అయితే, రెండో ప్రాధాన్యతా ఓటు కీలకం కానున్నాయి. 2016లో మొత్తం నాలుగు స్థానాలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా తెలుగుదేశం పార్టీ 3 స్థానాల్లోనూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలోనూ పోటీచేసాయి. దీంతో అప్పట్లో ఈ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి.

గడచిన రెండేళ్లుగా తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేలను కొనుగోలుచేస్తూ వారిని ఎటువైపు బెసకకుండా చూసుకుంటోంది. ఈనేపథ్యంలోనే తెలుగుదేశం పార్టీ మూడో అభ్యర్థిని రంగంలోకి దింపి రాజ్యసభలోని మూడు స్థానాలను దక్కించుకోవాలని వ్యూహరచన చేస్తోంది. అయితే, ఇక్కడ రాజ్యసభ ఓటింగ్‌లో కూడా బ్యాలెట్ విధానం అమలులో ఉంటుంది. ఎవరైతే ఒక పార్టీ గుర్తుపై గెలుపొందారో వారు వారి బ్యాలెట్ పత్రాలను చూపాల్సి ఉంటుంది. ఈ బ్యాలెట్ పేపర్‌లో తమ ప్రాధాన్యతా ఓట్లను వేసిన తరువాత పార్టీ నిర్ణయించిన ఎన్నికల ఏజెంట్‌కు చూపించి ఆ ఓటును బ్యాలెట్ బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 59ని ఇందుకోసం 2003లో అమెండ్‌మెంట్ చేశారు.

దీంతో పార్టీ ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలు తమ ఓట్లను పార్టీ ఎంపిక చేసిన ఏజెంట్‌కు చూపించాల్సి ఉంటుంది. అయితే, గెలుపొందిన పార్టీ అభ్యర్థికి ప్రాధాన్యతా ఓటు వేయనప్పటికీ ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకునే శాసన సభ్యుడు అనర్హతకు గురయ్యే అవకాశం లేదు. ఓటింగ్‌లో పారదర్శకత కోసమే ఈ బ్యాలెట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినందున ఎమ్మెల్యేలు అనర్హతకు గురయ్యే అవకాశం ఎంతమాత్రమూ లేదు. అయితే, పార్టీ సూచించిన అభ్యర్థికి ఓటు వేయనప్పటికీ సదరు శాసన సభ్యుడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొని వెసులుబాటు మాత్రం ఇందులో కల్పించారు. కాబట్టి ఈ రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్ జారీ చేయకుండానే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ఒకవేళ పార్టీ అయినా విప్ జారీ చేసినప్పటికీ అది చెల్లుబాటు కాదు. గత ఏడాది ఆగస్టులో గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లను చెల్లవని ప్రకటించింది. దీనికి కారణం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలు తమ పార్టీ సూచించిన ఏజెంట్‌కు కాకుండా ఇతర ఏజెంట్‌కు తమ బ్యాలెట్ పేపర్‌ను చూపించినందుకు ఆ రెండు ఓట్లు చెల్లవని ఎన్నికల సంఘం పేర్కొంది.





వాణిజ్య సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

• 14 దేశాల వాణిజ్య మంత్రులు, 40 దేశాల ప్రతినిధులు

• ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక • ఏర్పాట్లపై మంత్రి యనమల సమీక్ష

విశాఖపట్నం, ప్రభ న్యూస్: మూడు రోజులపాటు విశాఖలో నిర్వహించబోతున్న మూడవ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు సీఐఐలో 14 దేశాల నుంచి వాణిజ్యమంత్రులు హాజరుకానున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. ఈనెల 24 నుంచి 26 వరకూ విశాఖపట్నంలో నిర్వహించేభాగస్వామ్య సదస్సు 2018కు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ముఖ్యంగా ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ప్రారంభోత్సవంలో పాల్గొంటుండగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు రోజులూ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు భాగస్వామ్య సదస్సులో సుమారు పదకొండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లుగా ఆయన వెల్లడించారు. మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సహితంగా నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులతో సంబంధిత ఏర్పాట్లను కూడా ఆయన సమీక్షించారు. ఈ సదస్సు చారిత్రాత్మకంగా గుర్తుండిపోయేలా నిర్వహించాలని భావించారు. ఎక్కడా రాజీపడకుండా, ఎలాంటి లోపాలూ తలెత్తకుండా ఉండాలని ఆశించారు. అధికారులు పూర్తి సమన్వయంతో ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా పర్యవేక్షించాలన్నారు. వైద్యశిబిరం, అంబులెన్సు, ఫస్టు ఎయిడ్ వంటివన్నీ అందుబాటులో ఉండేలా చూసి, అత్యవసర సేవల కోసం అగ్నిమాపక వ్యవస్థనూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్రమశిక్షణతో భాగస్వామ్య సదస్సును ఆదర్శవంతంగా నిర్వహించాలని ఆయన భావించారు. మీడియా కేంద్రం ఏర్పాటు, లైవ్ టెలికాస్టు ఏర్పాట్లు చేసి, వుడా జీవీఎంసీలు నగర సుందరీకరణ, ముఖ్య పర్యాటక ప్రాంతాల సందర్శకు ఆయా శాఖలు ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు. దావోస్, యూరప్ పర్యటనల్లో పలువురు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేలా అక్కడ పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేషంగా కృషి చేసారని చెబుతూ, విశాఖ తీర ప్రాంతంతో పాటూ ఇక్కడ ఉన్న పోర్టులు, ఎగుమతులూ, దిగుమతులకు అనుకూలంగా ఉన్న నేపద్యం కూడా పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని యనమల రామకృష్ణుడు వెల్లడించారు. ఇవన్నీ రాష్ట్రం ఎదుగుదలకు ఎంతగానో దోహదపడు తున్నాయని చెప్పారు.

భాగస్వామ్య సదస్సులు ఇక సొంత భవనంలో నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. వచ్చే ఏడాది నిర్వహణకు శాశ్వత ప్రాతిపదికన భవన సముదాయం సిద్ధం చేయనున్నట్లుగా చెప్పారు. రెండు వేల కోట్ల రూపాయల వ్యవయంతో ఏపీఐఐసీ మైదానంలో కన్వెన్షన్ సెంటర్, అయిదు నక్షత్రాల హోటల్, కమర్షియల్ భవన సముదాయంకు సదస్సులో భాగంగా శంకుస్థాపన చేయున్నట్లుగా చెప్పారు. ఈ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇచ్చిన సీఎంఆర్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. గత రెండు సదస్సుల్లో పదకొండు లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు గుర్తు చేశారు. వీటిలో 47 శాతం సఫలమయినట్లుగా ఆయన వివరించారు. మిగిలిన వాటితోనూ సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకూ 300 ఎంవోయూలు జరిగాయని మూడు వేల కోట్ల రూపాయల పెట్టుబడులుగా వచ్చాయని, ఇంకా రాబోతున్నాయని చెబుతూ, ముగింపు సదస్సులో పూర్తి వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. విశాఖపట్నం తిరుపతి, విజయవాడల్లో పెద్ద కన్వెన్షన్ సెంటర్లు తీసుకు వస్తున్నట్లుగా ఆయన వెల్లడించారు.

మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో వచ్చిన పారిశ్రామిక ప్రతిపాదనలను సంబంధిత శాఖలు పారదర్శకంగా వర్గీకరించాయన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సంబంధిత ఏర్పాట్లును వివరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాలం భవాని, , ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, పల్లా శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, వెలగపూడి రామకృష్ణబాబు, పీలా గోవింద సత్యనారాయణ, పోలీసు కమిషనర్ యోగానంద్, వుడా వీసీ బసంత్ కువార్, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ పాల్గొన్నారు.

హైడ్రామా..ఇక చాలు!

• కేంద్ర, రాష్ట్రాలపై బొత్స విసుర్లు



ఆరిలోవ(విశాఖపట్నం), ప్రభ న్యూస్; రాష్ట్ర విభజన హామీలపైన, ప్రత్యేక హోదాపైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీజేపీ, తెదేపాలు కలిసకట్టుగా హైడ్రామాలు ఆడుతున్నాయని నిష్పక్షపాతంగా రాజీనామాలకు సిద్ధపడుతున్న వైకాపా నాయకులపై అబండాలు వేసున్నాయే తప్ప రాష్ట్రప్రయోజనాల గురించి ఆలోసించే ఇంగితజ్ఞానం వారికి లేకుండా పోతుందని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన 15 రోజుల తరువాత సిఎమ్ చంద్రబాబు నోరు విప్పి మిత్ర పక్షాన్ని వెనుకేసుకొస్తున్నారని బడ్జెట్ కేటాయింపు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా సిఎమ్ నోరు ఎందుకు మెదపటం లేదని ప్రశ్నించారు. విభజన హామీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎపిసోడ్, ఎపిసోడ్‌లుగా నాటకాలు ఆడు తున్నారని, అసలు మీ ఇరువురి పార్టీల మిత్ర బంధం ఎలా ఉందని, భవిష్యత్‌లో రాష్ట్రప్రజలకు ఇలానే మభ్యపెట్టు కుంటూ పోతారా అని ధ్వజమెత్తారు. తెదేపా కేంద్ర మంత్రి అయిన అశోక్ గజపతిరాజు కనబడుట లేదంటూ పత్రికలలో ప్రకటనలు ఇవ్వాలంటూ వ్యంగ్యాస్త్రాలను సంధించారు. కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు భోగాపురం ఎయిర్‌పోర్టు ను రద్దు చేసే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. కేంద్రంలో రాష్ట్ర విభజన హామీల గురించి నోరెందుకు కదపడం లేదంటూ సూటిగా ప్రశ్నిం చారు.దొడ్డిదారిన రాజకీయాలలోకి ప్రవేశించిన మంత్రి నారాయణగారూ మీకు రాజ్యాంగం గురించి, ఎలక్షన్ నిబం ధనల గురించి అసలు అవగాహన ఉందా ప్రశ్నించారు. ఇప్ప టికైనా రాష్ట్ర ప్రయోజనాల గురించి, రాష్ట్రప్రజల మనోభావాల గురించి ఆలోచిస్తే ప్రజలు క్షమిస్తారన్నారాయణ.

అధికారులను బెదిరించడం తగదు: డొక్కా



అమరావతి, ఆంధ్రప్రభ : ప్రభుత్వ ఉద్యోగులను, ఉన్నతాధికారులను బెదిరించడం ప్రతిపక్ష వైసీపీ నేతలకు తగదని రాష్ట్ర శాసన మండలి ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ హితవు పలికారు. ఆదివారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి అధికారులను బెదిరించేలా విశాఖలో వాఖ్యాలను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అధికారులను బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడంలాంటి చర్యలు నేతలకు తగదని, తక్షణమే విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు పట్ల విశ్వాసంలేని వైసీపీ ప్రజాప్రతినిధులు వారి అధినేత జగన్ విశాఖ పోలీస్ కమిషనర్, కృష్ణా కలెక్టర్లను బెదిరించిన తరహాలోనే ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వ్యవహరించడం దారుణమన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం సహకరించేలా రాష్ట్ర బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తూ బాగుంటుందని, వాటిని విస్మరించి రాజకీయాలు చేయడం తగదని సూచించారు.కాంగ్రెస్ పాలకులు అడ్డగోలు విభజనతో లోటు బడ్జెట్‌తోపాటు తీవ్ర కష్టనష్టాలతో ఏర్పడిన నవ్యాంధ్రకు విభజన చట్ట ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకువచ్చేందుకు బీజేపీ నేతలు కృషి చేస్తే రాష్ట్రప్రజల నుంచి కనీస గౌరవం దక్కుతుందని తెలిపారు.

వీడియో కాల్ చేసి...

ఆత్మహత్య చేసుకుంది!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తన బాయ్ ఫ్రెండ్‌కు వీడియో కాల్ చేసి మరీ ఏంబీఏ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది. కొంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కొంపల్లి లోని శివ శివానీ కాలేజీలో హనీషా చౌదరి ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెది అనంతపురం. దక్షిష్ పటేల్ అనే యువకుడిని ఆమె ప్రేమించింది. ఏం జరిగిందో ఏమో అతనికి చివరి కాల్ చేసి, వీడియోలో అతను చూస్తుండగానే లైవ్‌లోనే కళాశాలకు చెందిన హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో లోపల గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే అతను హాస్టల్‌కు చేరుకుని, విషయం చెప్పి తలుపులను బద్దలు కొట్టి చూడగా ఆమె అపస్మారక స్థితిలో కనిపించింది. ఆమె స్నేహితుల సాయంతో సిగ్మా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయిందని వైద్యులు స్పష్టం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు, అనంతపురంలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతురాలు అనంతపురం జిల్లాకు చెందిన బుగ్గయ్య చౌదరి కుమార్తెగా పోలీసులు గుర్తించారు.

బాలికపై దాడిచేసి అత్యాచారం

• ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ తిరుమలగిరిలో నిర్భయ తరహా ఘటన చోటు చేసుకుంది. స్నేహితుని వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న మైనర్ బాలికపై గుర్తు తెలియని వ్యక్తి కిరాతకంగా దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పదో తరగతి చదువుతున్న మిలటరీ జవాను కుమార్తె అమ్ముగూడ వద్ద స్నేహితుడిని కలిసి రైలు పట్టాల సమీపం నుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బాలికను అడ్డగించి బెదిరించాడు. అనంతరం చెట్ల పొదల్లోకి లాక్కెళ్లాడు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి రాడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాలికపై అత్యాచారం జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలికను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనాస్థలికి చేరుకుని బాధితురాలిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు కలవడానికి వెళ్లిన స్నేహితుడే ఈ దారుణానికి ఒడిగట్టాడా? లేక ఎవరైన బాలిక కదలికలు గమనించి అత్యాచారం చేశారా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా నిందితుడిని పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, నిందితుడు కోసం తీవ్రంగా గాలిస్తున్నామని మరోవైపు పోలీసులు చెబుతున్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మె హెచ్చరిక

• నేడు ఛలో విజయవాడ

అమరావతి, ఆంధ్రప్రభ: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ప్రధాన డిమాండ్లను పరిష్కారానికి సోమవారం చలో విజయవాడ చేపడుతున్నట్లు ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాశీ మధుబాబు పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశమైందని, ఫిబ్రవరి 20లోగా ప్రభుత్వం నిర్ణయం ప్రకటించకపోతే సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వేస్టేషన్ నుండి అలంకార్ థియేటర్ వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. కార్మికుల ప్రధాన సమస్యలైన నేరుగా డిపార్టుమెంటు జీతాలు, సుప్రీంకోర్టు తీర్పునునుసరించి సమాన పనికి సమానవేతనం అమలు చేయాలని, విధినిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వటంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా బిల్ కలెక్టర్లకు, మీటర్ రీడర్లకు పీస్ రేట్ విధానం రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, విద్యుత్ రంగంలో సర్వీస్ అవుట్ సోర్సింగ్ విదానానికి స్వస్తి పలకాలన్నారు.

బెజవాడ రైల్వేస్టేషన్‌ను

ప్రైవేటీకరిస్తే ఊరుకోం!

అమరావతి, ఆంధ్రప్రభ: విభజన హామీలకు తూట్లు పొడుస్తున్న కేంద్రం మళ్లీ తాజాగా మరో వివాదానికి తెర తీసింది. దశాబ్దాల చరిత్ర కలిగిన విజయవాడ రైల్వే స్టేషన్‌ను ఏకంగా ప్రైవేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకు సిద్ధపడుతుండడంతో అన్ని పార్టీలు, యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకేస్తూ ఆందోళనకు దిగుతూ ప్రతిఘటిస్తున్నాయి. రోజుకు లక్ష మంది ప్రయాణీకులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్న బెజవాడ రైల్వేస్టేషన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ రైల్వేస్టేషన్‌కు రోజూ రూ.70 లక్షలకు పైగానే ఆదాయం వస్తుంది. ఏడాదికి రూ. 252 కోట్ల ఆదాయం నాన్ టిక్కెట్ రూపంలో లభిస్తుంది. 8.81 ఎకరాల ల్లో ప్లాట్‌ఫారాలున్నాయి. 7. 87 ఎకరాల్లో రిజర్వుస్థలఉంది. 1.90 ఎకరాల సర్క్యులేటింగ్ ఏరియాను రూ. 195 కోట్లకు ప్రైవేట్ వారికి అప్పగించడానికి కేంద్రం సన్నద్ధమైందంటున్నారు. లక్షలాది మంది ఈ స్టేషన్‌పై పరోక్షంగా,ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఏకంగా 45 ఏళ్లపాటు అద్దెకు ఇచ్చేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేసింది. అయితే 99 ఏళ్లపాటు లీజు అగ్రిమెంట్ చేయాలని ప్రైవేట్ సంస్థలు పట్టుబట్టడడంతో ఆమేరకు విజయవాడ రైల్వే అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం పరిస్థితి టెండర్లు ఖరారు దశలో ఉంది. లీజు వ్యవహారంలోనే ప్రైవేట్ సంస్థలు మెలికపెట్టడడంతో ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. పై నుంచి ఆదేశాలు రాగానే బెజవాడ రైల్వేస్టేషన్‌ను లీజుకు ఇవ్వడం దాదాపుగా ఖాయమవుందంటున్నారు.అయితే లీజు గడువు ముగిసిన తర్వాత తిరిగి స్టేషన్‌ను ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఈ నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు రైల్వే స్టేషన్‌ను ప్రైవేటీకరిస్తూ ఆందోళనబాట పట్టారు. ఇప్పటికే విశాఖ రైల్వేజోన్,మెట్రోరైలు విభజన హామీలను బుట్టదాఖలా చేసిన కేంద్రం తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్‌ను కూడా ప్రైవేట్‌పరం చేసేందుకు కసరత్తు చేస్తుండడడంపైపార్టీల నేతలు,రైల్వే యూనియన్లు తీవ్ర ఆ గ్రహ ం వ్యక్తం చేస్తున్నాయి. అందులో భాగంగా ఆదివారం బెజవాడ రైల్వేస్టేషన్ వద్ద పెద్ద ఎత్తున సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ఆ పార్టీ నేత బాబూరావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఇంత జరుగుతున్నా రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు కిమ్మనడం లేదన్నారు. అంతా తీవ్రంగా వ్యతిరేకిస్తే తప్పా బెజవాడ రైల్వేస్టేషన్‌ను కాపాడుకోలేమని అన్నారు. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకపోతే మరింత తీవ్రంగా ఉద్యమించాల్సి ఉంటుందన్నారు.



మంత్రి దేవినేనితో కొణతాల భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ : ఉత్తరాంధ్ర ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ ఆదివారం రాత్రి విజయవాడలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కలిశారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా వేయి కళ్లతో ఎదురు చూస్తున్న సుజల స్రవంతి ప్రాజెక్టుతో పాటు వంశధార, బహుధ ,మహానది తదితర సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రామకృష్ణమంత్రితో కూలంకషంగా చర్చించారు. ప్రధానంగా సుజలస్రవంతి ప్రాజెక్టుకు సత్వరమే టెండర్లు పిలిచి,పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రిని కోరారు.

పవన్‌పై అనుమానాలు లేవు: లంకా



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రయోజనాల విషయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్తశుద్ధిపై అనుమానాలు లేవని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఆదివారం విజయవాడ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకొనే వ్యక్తిని తెలిపారు. ఆయన ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులలో ఐవైఆర్ కృష్ణారావు వ్యవహార శైలి గత సంవత్సర కాలంగా ప్రజలందరికీ తెలిసిందేనని, ఆయన వ్యవహార శైలి వైసీపీకి అనుకూలమని చెప్పారు. అలాగే తోట చంద్ర శేఖర్ వైసీపీ అభ్యర్థిగా ఏలూరు నుంచిపోటీ చేశారని, అయన కుటుంబసభ్యులు రాజధాని అమరావతి నిర్మాణం పై కేసులు వేసి నిర్మాణం ఆలస్యానికి కారణం అయ్యారనే విషయాన్ని గుర్తు చేశారు. ఉండవల్లి పార్లమెంట్ సభ్యుడుగా వుండి, విభజన అనంతరం రాష్ట్రానికి ఏమి కావాలో అడగలేదని, ఇప్పుడు అయన ఇచ్చే సలహాలు రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా లేవన్నారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సమావేశంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ వాస్తవాలు మాట్లాడారని, దీనితో రాష్ట్రప్రభుత్వ వాదన వాస్తవమనేది నిర్ధారణ అయిందన్నారు.

బలిపీఠంపై చిన్నారి పెళ్ళికూతుళ్ళు!

• రోజురోజుకీ పెరుగుతున్న బాల్య వివాహాలు

• పేదరికం ప్రధాన కారణం • పత్తాలేని చైల్ట్ లైన్స్

• ఉమ్మడి హైకోర్టు ఆందోళన

అమరావతి, ఆంధ్రప్రభ : ఆట, పాట, చదువుసంధ్యలతో హుషారుగా సాగాల్సిన బాల్యం వివాహబంధంలో చట్రంగా మారుతోంది. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నా ఇంకా సమాజంలో అనాగరికత, అజ్ఞానం కొనసాగుతూనే ఉంది. భేటీ బచావో.. భేటీ పడావో.. మా ఇంటికి మా లక్ష్మి లాంటి ఎన్నో పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టినా అవి అధికారుల అలసత్వంతో అటకెక్కాయి. బాలికసంరక్షణ కేవలం కాగితాలకే పరిమితమైంది. ఆడపిల్లను భారంగా భావిస్తున్న కుటుంబ సభ్యులు పెళ్ళి చేసి తమ బరువు దింపుకోవాలన్న ఆలోచనతో బాల్య వివాహాల వైపు అడుగులు వేస్తున్నారు. శారీరకంగా, మానసికంగా ఏమాత్రం పటిష్టంగా లేని దశలో ఈ చిన్నారులు గర్భవతులై ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఇటు పుట్టే బిడ్డతో పాటు తల్లి ప్రాణం కూడా ప్రమాదపుటంచుల్లో ఊగిసలాడుతోంది. దీంతో బాల్యం బంధీగా మారి చిన్నారులు జీవితాలను దుర్భరంగా గడుపుతున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్నట్లు ఇటీవల జరిపిన కొన్ని సర్వేల్లో వెల్లడైంది. అంతే కాకుండా తాజాగా ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బాల్య వివాహాల సంఖ్య అత్యధికంగా ఉందని వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతోంది. అధికారిక లెక్కల ప్రకారం గడిచిన మూడేళ్ళలో 2883 బాల్య వివాహాలు అడ్డుకున్నట్లుగా చెబుతున్నారు. అయితే వేల సంఖ్యలో వివాహాలు జరిగాయని పలు స్వచ్ఛంధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా పరిపక్వత చెందిన అనంతరమే వివాహాలు చేయాల్సి ఉండగా బాల్య దశలోనే పెళ్ళిళ్లు చేస్తుండడంతో పౌష్టికాహార లోపం, రక్తహీనతతో మరణా లు సైతం సంభవిస్తున్నాయి. బాలికా సంరక్షణ కోసం అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వివాహాలకు చెక్ పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఒకప్పుడు కుటుంబ వ్యవస్థ పెద్దగా ఉండడంతో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. అయితే ఆ తరువాత విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందడంతో బాలికలు బడి బాట పట్టారు. అన్ని రంగాల్లో రాణిస్తూ తమకు తామే సాటిగా నిరూపించుకున్నారు. అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు మళ్ళీ పాత రోజులను పునరావృతం చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక భారం, పేదరికం బాల్యాన్ని చిదిమేసే పరిస్థితి నెలకొంది. మరోసారి బాల్యం ప్రమాదపు అంచుల్లోకి వెళుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా పెరిగిన ఖర్చులు కుటుంబ పోషణ భారంగా మారడంతో అనేక కుటుంబాలు ఆడపిల్లలకు తొందరగా పెళ్ళి చేసి భారం దించుకోవాలనే ఆలోచనకు వస్తున్నారు. ప్రమాదకరమైన మేనరిక వివాహాలకు సైతం మొగ్గు చూపుతున్నారంటే పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతోంది. అధికారుల అలసత్వం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన పేద వర్గాలకు సక్రమంగా అందకపోవడం వలనే బాల్య వివాహాలు జరుగుతున్నాయన్న వాదన వినిపిస్తుంది. మరోవైపు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సైతం ఖజానాలోనే ములుగుతున్నాయని చెబుతున్నారు. ఇదిలా ఉంటే బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చైల్డ్ లైన్ జాడా కనబడడం లేదు. చిన్నారుల పాలిట శాపంగా మారిన బాల్య వివాహాలను అరికట్టాల్సిన ఈ సంస్థ కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. అవి కూడా సమర్థవంతంగా పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి బాలికా సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన. చైల్డ్ లైన్ నెం.1098 చాలా చోట్ల పనిచేయడం లేదనే చెబుతున్నారు. ప్రతి జిల్లాలో తప్పనిసరిగా చైల్డ్ లైన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. దీంతో మారుమూల గిరిజన ప్రాంతాలు సరైన సౌకర్యాలు లేని పల్లెటూర్లలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని దీనికి సంబంధించిన సమాచారం తమకు తెలియడం లేదని చైల్డ్ రైట్స్ అధికారులు తమ వంతు వాదనను వినిపిస్తున్నారు.ప్రభుత్వం మరింత చొరవ తీసుకొని అధికార వర్గాలను అప్రమత్తం చేయకపోతే వివాహ బంధంలో చితికిపోతున్న బాల్యం మరింత ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తుందంటున్నారు.





సాయిధరమ్‌తేజ్ కొత్త చిత్రం

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందబోయే నూతన చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రీ బాలాజీ సినీ మీడియా పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావులు సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, మాస్ కథాంశాలతో గుర్తింపు పొందిన సాయిధరమ్‌తేజ్, కమర్షియల్ చిత్రాల దర్శకుడిగా పేరుపొందిన గోపీచంద్ మలినేని కలయికలో ఈ చిత్రాన్ని రూపొందించబోవడం ఆనందంగా ఉంది. ఓ కొత్త జోనర్ చిత్రంగా ఈ సినిమా ఉండనుంది. ఇదివరకు సాయిధరమ్ చేయని కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజా సంగీత సంచలనం ఈ చిత్రానికి బాణీలను అందించనున్నారు. ప్రస్తుతం మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది అని అన్నారు.

ఇప్పుడు ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తారు...!

సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటనలో ప్రత్యేకత ఆయన సంభాషణలు చెప్పే విధానమే. అతి తక్కువ మాటలతో ఆకట్టుకునేలా నటిస్తారాయన. అయితే ఇది ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కో చిత్రానికి తగినట్లు మార్పులు చేసుకుంటారు. ప్రస్తుతం మహేష్ నటిస్తున్న భరత్ అనే నేను చిత్రంలో సంభాషణలు చెప్పే తరహా పూర్తి భిన్నంగా ఉంటుందట. చేస్తున్నది రాజకీయ నాయకుడి పాత్ర కాబట్టి అందుకు తగినట్లే ప్రసంగాలు చేయాల్సి ఉంటుంది. గత చిత్రాల్లోలా నెమ్మదిగా కాకుండా స్వరం పెంచి సంభాషణలు చెబుతూ...తన రాజకీయ లక్ష్యాలను ప్రజలకు తెలిపే క్రమంలో మహేష్ ఎక్కువగా మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఈ మాటలనే తనదైన శైలిలో కొత్తగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారట ఈ స్టార్ హీరో. భరత్ అనే నేను ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో మహేష్ డబ్బింగ్ చెప్పబోతున్నారు. ముఖ్యమంత్రి పాత్ర కోసం సంభాషణలు పలికే విధానంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు మహేష్. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వేసవికి విడుదల కానుంది. ఈ చిత్రం అనంతరం మహేష్ తన 25వ చిత్రంలో అడుగుపెడతారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథతో దర్శకుడు వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. పూజా హెగ్డే నాయికగా ఎంపికైంది. న్యూయార్క్ లో ఎక్కువ భాగం చిత్రీకరణ చేయనున్నారు. మే చివరి వారంలో ప్రారంభమయ్యే మహేష్ 25వ సినిమా వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. దిల్‌రాజు, అశ్వనీదత్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.


మహేష్‌బాబు

ఆత్మీయ సమావేశమే...


రజినీకాంత్, కమల్ హాసన్

దాదాపు నాలుగు దశాబ్దాలుగా రజినీ, కమల్ సూపర్‌స్టార్‌లుగా కొనసాగుతున్నారు. ఇప్పటికీ చిత్ర పరిశ్రమలో వాళ్ల స్థానం ప్రత్యేకం. వాణిజ్య విలువలున్న చిత్రాలతో స్టైలిష్ హీరోగా రజినీకాంత్ పేరు తెచ్చుకుంటే...ప్రయోగాత్మక, విభిన్న సినిమాలతో కమల్ ప్రేక్షకుల అభిమాన పాత్రుడయ్యారు. ఇక తాజాగా రాజకీయ అరంగేట్రం నేపథ్యంలోనూ వీళ్లిరువురూ పోటీ పడుతున్నారు. మంచి మిత్రులైనా...సినిమాల్లో అనివార్య పోటీ ఎలా సాగిందో...ఇకపై రాజకీయాల్లోనూ పోరు తప్పదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాళ్లిద్దరూ ఎక్కడ సమావేశమైనా ఆ సందర్భం ఆసక్తికరంగా మారుతోంది. తాజాగా కమల్ హాసన్ రజినీకాంత్‌ను కలిసి కొంతసేపు చర్చలు జరిపారు. ఇది రాజకీయవర్గాల్లో చర్చనీయంగా మారింది. కమల్ రజినీ సమావేశం ఆంతర్యం ఏంటన్నది ఊహిస్తున్నారు. రజినీని కలిసిన అనంతరం కమల్ హాసన్ మాట్లాడుతూ...ఇది వ్యక్తిగత సమావేశం మాత్రమేనని, ఎలాంటి రాజకీయ ప్రస్తావన రాలేదని చెప్పారు. కమల్ మాటల్లో వింటే....నేను సినిమాల్లోకి వచ్చే ముందు నా ఆత్మీయ మిత్రులను కలిసి ఇష్టా ఇష్టాలు తెలిపాను. ఇప్పుడూ అంతే, రాజకీయ రంగంలో అడుగుపెడుతున్నందుకు నా మిత్రుడైన రజినీని కలిసి మాట్లాడాను. మా చర్చలో రాజకీయాల అంశాలు లేవు. అన్నారు. త్వరలోనే కమల్ హాసన్ ప్రజలను కలిసేందుకు పర్యటనలు చేయనున్నారు. మధురైలో భారీ సభ జరిపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



టి.సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యష్ చోప్రా స్మారక పురస్కారాన్ని ఈ ఏడాదికి ప్రముఖ గాయని ఆశాభోంస్లేకి అందజేశారు. ముంబైలోని ఓ స్టార్ హోటల్లో జరిగిన ఈ పురస్కార ప్రదాన కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, నటి రేఖ, జయప్రద, పరిణీతి చోప్రా తదితరులు పాల్గొన్నారు.

క్లైమాక్స్‌లో సాక్ష్యం


బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్, పూజాహెగ్డే జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం సాక్ష్యం. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ భారీగా నిర్మించిన సెట్లో క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవైపు నిర్మాణానంతర పనులు కూడా చకచకా సాగిపోతున్నాయి. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...ఇటీవల ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదలచేసిన పోస్టర్‌కు విశేషమైన స్పందన లభించిందని చెప్పారు. మే 11న సినిమాను విడుదల చేయనున్నామని అన్నారు. ఇంతవరకు రామోజీ ఫిలింసిటీ, పొల్లాచ్చి, వారణాసి, హాస్‌పేట తదితర లొకేషన్లలో చిత్రీకరణ జరిపామని చెప్పారు. ఈ సినిమాలో ఫైట్స్ సీక్వెన్స్‌లకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ లుక్ ఈ చిత్రంలో సరికొత్తగా ఉంటుందని అన్నారు. హీరోహీరోయిన్ల మధ్య సాగే రొమాంటిక్ సన్నివేశాలతో పాటు హీరో చేసే సాహసోపేతమైన సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. ఫిలింసిటీలో షెడ్యూల్ అనంతరం మరో భారీ షెడ్యూల్‌ను అమెరికాలో జరపనున్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్‌రానా, పవిత్రలోకేష్, వెన్నెల కిషోర్, మధు గురుస్వామి, లావణ్య తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఎ.విల్సన్, సంగీతం: హర్షవర్ధన్, కళ: ఎ.ఎస్.ప్రకాష్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.


రకుల్‌ప్రీత్‌సింగ్

నాయికలకు స్వర్ణయుగం నిడివి చాలా తక్కువ. చూస్తుండగానే పలకరించి వెళ్లిపోతుంటుంది. రెండేళ్ల కిందట రకుల్‌తో ఇలాంటి అద్భుత సమయమే స్నేహం చేసింది. వరుసగా అగ్ర కథానాయకులతో నటించే అవకాశాలు దక్కాయి. వీటిలో ఆమె కలల కథానాయకులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో విరామం లేకుండా నాలుగేళ్లు

నా వ్యాపారం కాపాడుకోవాలిగా...!

గడిచాయి. ఇంతలో కొత్త నాయికలు రావడం, రకుల్‌కు స్పైడర్ లాంటి ఊహించని అపజయం ఎదురవడం ఆమె క్రేజ్‌ను పూర్తిగా తగ్గించేసింది. దీంతో అనూహ్యంగా తెలుగులో అవకాశాలూ తగ్గిపోయాయి. తమిళం, బాలీవుడ్‌లో మాత్రం ఆమె గాలి వీస్తూనే ఉంది. తమిళంలో కార్తీతో మరో కొత్త చిత్రాన్ని, సూర్య, శివ కార్తికేయన్‌లతో సినిమాలు చేస్తోంది. ఇక హిందీలో ఆమె తాజా చిత్రం అయ్యారే మంచి విజయం దిశగా దూసుకెళుతోంది. అజయ్ దేవగణ్‌తో మరో చిత్రంలో ఎంపికైంది. ఇలా తమిళం, హిందీలో రకుల్ జోరు తగ్గలేదు. అయితే తనకు బాగా పేరు తీసుకొచ్చిన టాలీవుడ్‌లో సినిమాలు తగ్గడమే ఈ భామకు మింగుడుపడటం లేదు. అయితే ఈ పరిస్థితిని ముందే ఊహించానని చెబుతోంది రకుల్. ఎన్ని చిత్రాలు చేసిన...అవకాశాలు లేని రోజు రానే వస్తుందని తెలుసని అంటోంది. రకుల్ మాట్లాడుతూ....నేను బాలీవుడ్ చిత్రం యారియాన్ చేసి నాలుగేళ్లవుతోంది. మళ్లీ ఇంత కాలం తర్వాత అయ్యారేలో నటించాను. తెలుగులో అగ్ర కథానాయకుల సరసన వరుస సినిమాలు దక్కుతున్న సమయంలో హిందీలోనూ అవకాశాలు వచ్చాయి. అయితే ఒక్క హిందీ చిత్రం కోసం తెలుగులో అన్ని సినిమాలు పాడు చేసుకోవడం సరైంది కాదు అనిపించింది. ఈ ప్రాంతీయ భాషల్లో ఎన్నేళ్లు నటించినా...మళ్లీ బాలీవుడ్ చేరే రోజు వస్తుందని ముందే ఊహించాను. అనుకున్నట్లే ఇప్పుడు హిందీ చిత్రాలు చేస్తున్నాను. కేవలం కథ నచ్చి సినిమాలు చేస్తున్నానని చెప్పడం అబద్ధమే అవుతుంది. కాంబినేషన్, నిర్మాణ సంస్థ ఇవన్నీ చూసుకుంటాం. నాయికగా నా వ్యాపారాన్ని కాపాడుకోవాలంటే ఇవన్నీ తప్పవు. అని చెప్పింది.

కొత్తరకమైన హారర్ రా రా

- ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీకాంత్



శ్రీకాంత్, నాజియా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం రా రా. విజి చరిష్ యూనిట్ దర్శకత్వంలో శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న నాని మాట్లాడుతూ, నాకు అష్టాచమ్మా చిత్రం నుంచి శ్రీకాంత్‌గారితో మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు హారర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం చేశారు. ఈ సినిమా ఆయనకు మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నా అని అన్నారు. మరో అతిథిగా విచ్చేసిన హీరో తరుణ్ మాట్లాడుతూ, శ్రీకాంత్‌గారి 125వ సినిమా ఇది. అందరూ హాస్యనటులు ఈ సినిమాలో నటించారు అని అన్నారు.

చిత్ర హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇది హాస్యంతో కూడుకున్న హారర్ థ్రిల్లర్. మనుషులకు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు సగటు సినిమా ప్రేక్షకుడ్ని వినోదంలో ముంచెత్తుతుంది. ఈ తరహా చిత్రాన్ని నేను తొలిసారి చేస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుందని ఆశిస్తున్నా. హారర్ సినిమాలు చాలానే ఉన్నా ఈ సబ్జెక్ట్ కొత్తగా ఉంటుంది. ఇలాంటి సినిమాను అభిరుచితో తీసిన నిర్మాతలకు ధన్యవాదాలు అని అన్నారు.

సమర్పకుడు శ్రీమిత్రచౌదరి మాట్లాడుతూ, శ్రీకాంత్‌తో దాదాపు పాతికేళ్ల అనుబంధం ఉంది. ఆయన నా సొంత సోదరుడితో సమానం. ఈ కథ విన్న తర్వాత విజయ్ దర్శకత్వం వహించాలని అనుకున్నాం. శ్రీకాంత్ వంటి సీనియర్ హీరో ఈ తరహా సినిమా చేయడం గొప్ప విషయం. సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది అని అన్నారు.

మరో నిర్మాత విజయ్ మాట్లాడుతూ, శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధమే ఈ సినిమా చేయడానికి మమ్మల్ని ముందుకు నడిపించింది. అందరినీ ఆకట్టుకునేలా చిత్రం ఉంటుంది అని అన్నారు.

సంగీత దర్శకుడు షకీల్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ చిత్రానికి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు, హీరోకి ధన్యవాదలను తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సదానంద్, అశోక్, ప్రతాప్, హాస్యనటులు అలీ, రఘుబాబు, ఇంకా ఖయ్యూమ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అలరింపజేసేలా హైదరాబాద్ లవ్‌స్టోరీ

రాహుల్ రవీంద్రన్, రేష్మిమీనన్ నాయకానాయికలుగా రూపొందిన చిత్రం హైదరాబాద్ లవ్‌స్టోరీ. రాజ్‌సత్య దర్శకుడు. ఎం.ఎల్.రాజు, ఆర్.ఎస్.కిషన్, వేణుగోపాల్ కొడుమగుల్ల నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఫ్యామిలీ ప్రేక్షకులతో పాటు యూత్‌ను సైతం ఎంతగానో అలరింపజేసింది. ప్రేక్షకులలో సినిమా పట్ల మంచి అంచనాలనే నెలకొల్పింది. సునీల్ కశ్యప్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది అని చెప్పారు.

దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, విభిన్నమైన, వైవిధ్యభరితమైన ప్రేమకథాచిత్రాలను ఆదరించే ప్రేక్షకులు ఈ చిత్రాన్ని కూడా చాలాబాగా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది అని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జియా, రావు రమేష్, సూర్య, సన తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: బి.వి.అమర్‌నాథ్, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ.


రాహుల్ రవీంద్రన్, రేష్మిమీనన్

పొట్టి సిరీస్‌లోనూ... అదేజోరు..



- తొలి టీ20లో సఫారీలు చిత్తు
- 28 పరుగుల తేడాతో కోహ్లీసేన
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ భువీ
- సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో భారత్

ఫార్మాట్ మారింది.. వేదిక మారింది.. టీమిండియా జోరు మాత్రం తగ్గలేదు... సమరోత్సాహంతో కోహ్లీసేన రెచ్చిపోయింది.. టీ20 సిరీస్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. 23 పరుగుల తేడాతో తొలి మ్యాచ్‌ను గెలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుంది.

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి ట్వంటీ 20 మ్యాచ్‌లో టీమిండియా చెలరేగి ఆడింది. ఆరంభం నుంచి ఎదురుదాడికి దిగిన టీమిండియా సఫారీ బౌలర్లపై విరుచుకుపడింది. శిఖర్ ధావన్ (72- 10 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీకి తోడు రోహిత్ శర్మ(21- 2 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లి (26 -2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసింది. ట్వంటీ 20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్ కిదే అత్యధిక స్కోరు. 204 పరుగుల లక్ష్య ఛేదనతో బ్యాటింగ్ ప్రారంభించిన సఫారీల దూకుడుకు భువనేశ్వర్ కుమార్ కళ్లెం వేశాడు. తొమ్మిది పరుగుల వ్యవధిలో రెండు వికెట్లు తీశాడు. మట్స్, డుమినిలను తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేర్చాడు. కష్టాల్లో పడిన జట్టును హెడ్రిక్స్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అవతలివైపు నుంచి కానీ అతనికి సరైన సహకారం కరువైంది. డుమిని, మిల్లర్, బెహార్డిన్, కాస్లీన్ తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో భువీ ఐదు వికెట్లు పడగొట్టగా, హార్దిక్ పాండ్యా, ఉనద్కట్, చాహల్‌కు ఒక్కో వికెట్ లభించింది.

అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన టీమిండియా ఇన్నింగ్స్‌ను శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు ధాటిగా ఆరంభించారు. తొలి బంతి నుంచే రోహిత్ శర్మ దూకుడు ప్రదర్శించాడు. ప్యాటర్సన్ వేసిన మొదటి ఓవర్‌లో రెండు సిక్సర్లు, ఫోర్ బాదేశాడు. దాంతో తొలి ఓవర్‌లోనే భారత్ 18 పరుగుల్ని రాబట్టింది. అదే ఊపును రెండో ఓవర్‌లో కూడా కొనసాగించే క్రమంలో రోహిత్ అవుటయ్యాడు. డాలా వేసిన రెండో ఓవర్ ఐదో బంతికి కీపర్ క్యాచ్ ఇచ్చి రోహిత్ పెవిలియన్ బాటపట్టాడు. చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన సురేశ్ రైనా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో త్వరగా ఔటయ్యాడు. ఏడు బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 15 పరుగులు చేశాడు. ఏడు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఒకసారి అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. కొద్దిసేపటికే డాలా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి అతడికే రిటన్ క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు.

ధావన్‌కు జత కలిసిన కెప్టెన్ కోహ్లి మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత చేపట్టాడు. ఈజోడీ నిలదొక్కుకుందని అనిపించిన సమయంలో సఫారీలు దెబ్బతీశారు. జోరుమీదున్న కోహ్లీని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నారు. షమ్సి బౌలింగ్‌లో ఎల్బీగా అవుటై, మూడో వికెట్ రూపంలో పెవిలియన్ చేరాడు. అప్పటికి భారత జట్టు స్కోరు 108 పరుగులు. మరోవైపు ధావన్ మాత్రం నిలకడగా ఆడుతూ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 39 బంతుల్లో 72 పరుగులు సాధించిన ధావన్, 15వ ఓవర్లో ఫెహ్లకోహియో బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ ఓవర్ నాల్గో బంతిని వికెట్ల వెనక్కిహిట్ చేయబోయి కీపర్‌కు సునాయస క్యాచ్ ఇచ్చాడు. ఇక ధోని (16) కూడా త్వరగానే ఔటయ్యాడు. చివర్లో మనీష్ పాండే (29 నాటౌట్), హార్దిక్ పాండ్యా (13 నాటౌట్)లు జట్టు స్కోరును రెండొందలు దాటించారు. సఫారీ బౌలర్లలో డాలా రెండు వికెట్లు సాధించగా, మోరిస్, షమ్సీ, ఫెహ్లకోహియోలకు తలో వికెట్ దక్కింది.

రోహిత్ ఔటైన తర్వాత బౌలర్లకు చుక్కలు చూపించే బాధ్యతను మరో ఓపెనర్ శిఖర్ ధావన్ తీసుకున్నాడు. వేగంగా అర్ధసెంచరీ చేసిన ధావన్, 39 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 72పరుగులు చేశాడు. కెప్టెన్ కోహ్లీ, మనీశ్‌పాండే మెరుపులతో టీమిండియా 203 పరుగుల భారీ స్కోరు చేసింది.



బ్యాట్స్‌మన్‌కు ఏమాత్రం తగ్గకుండా బౌలర్లు రెచ్చిపోయారు. ముఖ్యంగా పేస్ దళపతి భువనేశ్వర్ కుమార్ సఫారీలకు చుక్కలు చూపించాడు. ప్రారంభంలోనే టపటపా రెండు వికెట్లు పడేసాడు. ఆ తర్వాత ప్రమాదకారిగా మారిన హెడ్రిక్స్‌ను పెవిలియన్ బాట పట్టించి టీమిండియా విజయానికి బాటలువేశాడు. ద్వితీయార్థంలో ప్రమాదకర క్లాసీన్, మోరిస్‌ల భరతం పట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఐదు వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

స్కోరుబోర్డు

ఇండియా: రోహిత్ శర్మ - (సి) క్లాసీన్ (బి) డాలా 21, శిఖర్‌ధావన్ (సి) క్లాసీన్ (బి)ఫెహ్లకోహియో 72, రైనా (సి) (బి) డాలా 15, కోహ్లి (ఎల్‌బీడబ్ల్యూ) బి- షాంసి 26, మనీష్ పాండే (నాటౌట్) 26, ఎంఎస్ ధోని (బి) మోరిస్ 16, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 13. ఎక్స్‌ట్రాలు 11. మొత్తం 203/5 (20 ఓవర్లు)

ద.ఆఫ్రికా బౌలింగ్: పీటర్సన్ 4-0-48-0, జూనియర్ డాలా 4-0-47-2, క్రిస్ మోరిస్ 4-0-39-1, షాంసి 4-0-37-1, జేటీ మట్స్ 2-0-14-0, ఫెహ్లకోహియో 2-0-16-1

ద.ఆఫ్రికా: జేజే మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 14, హెడ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70, పాల్ డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3, డేవిడ్ మిల్లర్ (సి) ధావన్ (బి), హార్దిక్ పాండ్యా 9, ఫర్హాన్ బెహార్డిన్ (సి) మనీశ్ పాండే (బి) చాహల్ 39, క్లాసీన్ (సి) రైనా, (బి) భువనేశ్వర్ 16, ఆండిల్ ఫెహ్లకోయో (సి) చాహల్ (బి) ఉనద్కత్ 13, క్రిస్ మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0, పాటెర్సన్ (నాటౌట్) 2, షాంసి (నాటౌట్) 0. ఎక్స్‌ట్రాలు 8. స్కోరు 175/8 (20ఓవర్లు).

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4-0-24-5, జయదేవ్ ఉనద్కత్ 4-0-33-1, బుమ్రా 4-0-32-0, హార్దిక్ పాండ్యా 4-0-45-1, యుజ్వేంద్ర చాహల్ 4-0-39-1.

క్రీడాప్రభ

సఫారీ అమ్మాయిలు గెలిచారు



- ఐదు వికెట్ల తేడాతో 3వ టీ20లో విజయం
- సిరీస్ ఆశలు సజీవం - 2-1

జోహాన్స్‌బర్గ్: మూడవ టీ20 మ్యాచ్ నెగ్గి, సిరీస్‌ను దక్కించుకోవాలన్న భారత మహిళల క్రికెట్ జట్టు ఆశలు నెరవేరలేదు. కీలక మ్యాచ్‌లో సఫారీ మహిళలు పోరాటం వారిని విజేతలుగా నిలిపింది. సిరీస్ కోల్పోయే ప్రమాదం నుంచి బయటపడేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ లిజెల్లీ (5) త్వరగా ఔటైనప్పటికీ, డాన్ వాన్ నీకెర్క్ (26), సున్‌లుస్ (41), ట్రయాన్ (34) రాణించడంతో ఆతిథ్య జట్టు విజయం సాధించింది. వాన్‌నీకెర్క్ నిష్క్రమించినా, లూస్- మిగ్నన్ డు ప్రీజ్ జంట విలువైన 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. భారత బౌలర్లలో పేసర్ పూజా వస్త్రాకర్ 21 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించింది. మరోవైపు ఆఫ్‌స్పిన్నర్ అనుజా పాటిల్ ధారాళంగా పరుగులు సమర్పించుకుంది. నాలుగు ఓవర్లలో 44 పరుగులివ్వడం ఓటమికి దారితీసింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ప్రారంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. స్కోరు బోర్డుపై పరుగుల ఖాతా తెరవక ముందే తొలి వికెట్ పడింది. ఓపెనర్ మిథాలీ రాజ్ డకౌట్ అయింది. ఈ దశలో స్మృతి మంధాన (37), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48) బ్యాట్ ఝులిపించడంతో భారత జట్టు గౌరవప్రద స్కోరు చేయగలిగింది.

వీరిద్దరు రెండవ వికెట్‌కు వేగంగా 55 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మిగతా బ్యాట్స్‌మన్ వైఫల్యంతో తక్కువస్కోరుకే పరిమితం అయింది. ద.ఆఫ్రికా బౌలర్ షబ్నిమ్ 30 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టింది. దీంతో పూర్తి ఓవర్లు ఆడకుండానే, 17.5 ఓవర్లలో 133 పరుగులకు ఇండియా చాపచుట్టేసింది. 134 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు గెలుపుకోసం చెమటోడ్చాల్సి వచ్చింది. చివరకు 19 ఓవర్లో లక్ష్యాన్ని చేరుకుంది. ఐదు వికెట్లతో సిరీస్‌లో గెలుపు బోణీ చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా 2-1 ఆధిక్యంతోఉంది. నాలుగవ టీ20 బుధవారం సెంచూరియన్ మైదానంలో జరుగుతుంది.

సింధు, సైనాలే స్ఫూర్తి: ప్రణయ్



ముంబై: తనలో సానుకూల దృక్పథం కలగడానికి సింధు, సైనాలే కారణమని ఇండియన్ స్టార్ షట్లర్ ప్రణయ్ తెలిపాడు. బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొంటున్నప్పుడు వారి ఆలోచనా తీరు భిన్నంగా ఉంటుంది. ఎదుటి వారు ఎంతపెద్ద ఆటగాళ్లని కాకుండా, గెలవడమే లక్ష్యంగా పోరాడతారు. ఈ లక్షణం నాకు స్ఫూర్తినిచ్చింది. గత ఐదారేళ్లుగా వర్ధమాన ఆటగాళ్లలో ఈ ధోరణి బలపడుతూ వస్తోంది. ఇందుకు ఆ ఇద్దరే కారణం. ఇదివరకు పెద్ద ఆటగాళ్ల పేర్లు వినగానే, గెలవడం అసాధ్యమనే భావన ఉండేది. ఇప్పుడు భయం స్థానంలో ఆత్మవిశ్వాసం ఏర్పడింది. ఎలాంటి ప్రత్యర్థులనైనా ఎదుర్కొనగలమన్న నమ్మకం కలిగింది. సింధు, సైనాలు చైనా ఆటగాళ్లను ఓడించడంతో, మిగతా వారికీ ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. బలమైన ప్రత్యర్థులను అలవోకగా ఎదుర్కొన గలుగుతున్నారు. అని హెచ్‌ఎస్ ప్రణయ్ తెలిపాడు. ఆదివారం జీడీ బిర్లా మెరోరియల్ మాస్టర్ ఇంటర్ క్లబ్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, లెజండరీ బ్యాడ్మింటన్ ఆటగాడు నందు నటేకర్‌తో కలిసి ప్రణయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకున్నారు. బ్యాడ్మింటన్ ఆటడం ప్రారంభించినప్పుడు, ఈ స్థాయికి చేరుకుంటానని అనుకోలేదు. ప్రపంచ చాంపియన్, సూపర్ సిరీస్ టోర్నీల్లో పాల్గొంటానని ఊహించలేదని ప్రణయ్ వివరించారు. బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సైతం ఇదేవిధమైన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ తరం ఆటగాళ్లు మానసికంగా ధృడంగా ఉన్నారు. సానుకూల ఆలోచన అనేది కేవలం ఆటగాళ్లలోనే కాకుండా, యువకుల్లోనూ అలవడుతోంది. 2000 సంవత్సరంలో ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ఉండేది. గెలుపు మా ఆలోచనల దరిదాపుల్లోకి వచ్చేది కాదు. కానీ 2008, 2012 ఒలింపిక్స్ నుంచి ఈ ధోరణి మారింది. మెడల్ సాధించాలన్న తపన అథ్లెట్లలో కనిపించింది. మునుపటి తరానికి, ఈ తరానికి మధ్య కనిపించేతేడా ఇదే అని గోపీచంద్ పేర్కొన్నాడు.

బిఎండబ్ల్యూ గోల్ఫ్ టోర్నమెంట్





హైదరాబాద్, ప్రభ న్యూస్ : హైదరాబాద్ నగరంలో బిఎండబ్ల్యూ ఇండియా 4వ ఎడిషన్‌లో భాగంగా గోల్ఫ్ కప్ ఇంటర్నేషనల్-2018 టోర్నమెంట్ జరిగింది. 50 దేశాలలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్ కు హైదరాబాద్ వేదిక అయ్యింది. ఇందులో భాగంగా ఆదివారం నగరంలో జరిగిన గోల్ఫ్ టోర్నమెంట్‌లో ఏ కేటగిరి పురుషుల విభాగంలో జయంత్ ఠాగూర్ విజేతగా నిలువగా, మొదటి రన్నరప్‌గా అనంత శ్రీధర్‌రెడ్డి, రెండవ రన్నరప్‌గా ఓం ప్రకాశ్ మోడి నిలిచారు. బి కేటగిరిలో అభిషేక్ విజేత కాగా, మొదటి రన్నరప్‌గా మనోహర్ రెడ్డి, రెండవ రన్నరప్‌గా సుమన్ రెడ్డిలు నిలిచారు. మహిళా విభాగంలో పద్మశ్రీరెడ్డి విజేతగా నిలిచారు. దేశంలోని గుర్తింపు పొందిన గోల్ఫ్ క్లబ్‌లలో సభ్యత్వం కలిగిన గోల్ఫ్ ఆటగాళ్లకు ఇందులో అవకాశం కల్పిస్తున్నారు. అయితే భారత స్థాయిలో అర్హత సాధించిన జాతీయ విజేతలు ప్రపంచ స్థాయిలో జరిగే ఫైనల్స్‌లో ఆడనున్నారు. వివిధ దేశాలకు చెందిన లక్షమంది ఆటగాళ్లు ఈ టోర్నమెంట్ లో పాల్గొనన్నారు. ఈ సందర్భంగా బిఎండబ్ల్యూ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పావాహ్ మాట్లాడుతూ బిఎండబ్ల్యూ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈ టోర్నమెంట్ ను నిర్వహిస్తుందని అన్నారు. గతంలోనూ హైదరాబాద్ నగరం నుంచి పలువురు విజేతలు జాతీయ స్థాయిలో ఆడారని, మరో సారి మరి కొంత మందికి అవకాశం వచ్చిందని ఆయన తెలిపారు.

షాట్‌గన్‌లో రాథోర్‌కు రజతం



న్యూఢిల్లీ: లుసైల్‌లో జరుగుతున్న ఖతార్ ఓపెన్ షాట్‌గన్ పోటీల్లో ఇండియన్ షూటర్ మానవాదిత్య సింగ్ రాథోర్ రజత పతకం సాధించాడు. పురుషుల జూనియర్ విభాగంలో బరిలోకి దిగిన మానవాదిత్య 118 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. 119 పాయింట్లు సాధించిన ఇటలీ షూటర్ స్కాల్ జోన్ స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. కాగా, 115 పాయింట్లతో నిలిచిన జర్మన్ షూటర్ జెరెమీ స్కల్జ్‌కు కాంస్య పతకం లభించింది. భారత క్రీడాశాఖ మంత్రి, ఏథెన్స్ ఒలింపిక్స్ సిల్వర్ మెడల్ విజేత అయిన రాజ్యవర్ధన్ రాథోర్ కుమారుడే ఈ మానవాదిత్య కావడం విశేషం. 19 ఏళ్ల జూనియర్ రాథోర్ శనివారం తొలి సిరీస్‌లో 23 షాట్స్ పూర్తిచేశాడు. తదుపరి మూడు షాట్స్‌లో 24 షాట్స్ సాధించాడు. చివరిదైన ఐదవ సిరీస్‌లో కేవలం 23 షాట్స్ మాత్రమే చేయగలిగాడు. దీంతో 11 మంది షూటర్లు పాల్గొన్న ఈవెంట్‌లో రెండవ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఆసియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మానవాదిత్య, నాలుగు పర్యాయాలు జూనియర్ ప్రపంచ చాంపియన్ షిప్‌లో పాల్గొన్నాడు.

ఇంగ్లండ్ థ్రిల్లింగ్ విన్.. ఫైనల్‌కు చేరిన కివీస్



హామిల్టన్: ఆస్ట్రేలియా-ఇంగ్లండ్- కివీస్ మధ్య జరుగుతున్న ముక్కోణపు టీ20 క్రికెట్ సిరీస్‌లో కివీస్ ఫైనల్ చేరింది. టైటిల్ పోరులో ఈ జట్టు ఆసీస్‌తో తలపడుతుంది. ఆదివారం ఇంగ్లండ్-కివీస్‌మధ్య జరిగిన రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. కివీస్ బ్యాట్స్‌మన్ మున్రో చెలరేగి ఆడటంతో ఆసీస్ ఫైనల్‌కు అర్హత పొందింది. మున్రో ఏడు సిక్సర్లు, మూడు ఫోర్ల సహాయంతో 18 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. తద్వారా పొట్టి క్రికెట్‌లో వేగవంతమైన హాఫ్‌సెంచరీ చేసిన ఆరో ఆటగాడిగా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఆ జట్టులో కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ 80 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 195 పరుగుల లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన కివీస్ జట్టులో మార్టిన్ గుప్తిల్ 62, మార్క్ చాప్‌మన్ 37 పరుగులతో రాణించడంతో 192 పరుగులు చేసింది. విజయానికి మూడు పరుగుల దూరంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ రన్‌రేట్ పరంగా న్యూజీలాండ్ ఫైనల్ బెర్తు సంపాదించింది. బుధవారం ఆస్ట్రేలియా, కివీస్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

ఐస్ హాకీలో కొరియా ఓటమి



గాంగ్యూంగ్: గోల్‌కీపర్ షిన్ సా -జుంగ్ గోల్‌పోస్టు ముందు బాహుబలిగా నిలిచినప్పటికీ, ఉభయ కొరియా జట్టు విజయం సాధించలేక పోయింది. స్విట్జర్లాండ్ చేతిలో 2-0తో చిత్తయింది. జుంగ్ హీరోచిత పోరాటంతో కొరియా జట్టుకు ఘోరపరాభవం తప్పింది. జుంగ్ రాణించినా, ప్రధాన ఆటగాళ్లు గోల్స్‌చేయడంలో విఫలం కావడంతో ఆదివారం జరిగిన ఐస్ హాకీ మ్యాచ్‌లో కొరియాకు ఓటమి తప్పలేదు. దక్షిణ కొరియా ఆటగాళ్లతోపాటు 12మంది ఉత్తర కొరియా ఆటగాళ్లున్న చారిత్రక జట్టు పైయాంగ్‌చాంగ్ గేమ్స్‌లో పథకం సాధించలేక పోయింది. ఈ ఒలింపిక్స్‌లో పరువు నిలుపుకునేందుకు పోరాటం చేస్తున్నది. 22 గోల్ ప్రయత్నాలు చేసిన ఈ జట్టు కేవలం 1 గోల్ మాత్రమే సాధించగలిగింది. ఒలింపిక్స్‌లో కాలుమోపి 10 రోజులే అయింది. మరిన్ని రోజులు ఇక్కడ గడపాలని ఆశిస్తున్నాం అని మ్యాచ్ అనంతరం జుంగ్ వ్యాఖ్యానించింది. స్విస్ టీంలో సబ్రినా జొల్లింగర్, ఇవెలినా రసెల్లి విజయంలో కీలకపాత్ర పోషించారు. 6000 మంది అభిమానులతో క్రిక్కిరిసిన ఈ మైదానంలో ఈసారి ఉత్తర కొరియాకు చెందిన 200 మంది చీర్‌లీడర్లు పాల్గొనలేదు. అయినప్పటికీ ఆతిథ్య జట్టుకు అభిమానులు అండగా నిలిచారు. మంగళవారం కొరియా చివరి మ్యాచ్‌ను ఆడుతుంది.

యువ స్పిన్నర్లకు అశ్విన్ ఆదర్శం: కీర్మాణి



చెన్నై: ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంకితభావం కలిగిన బౌలర్ అని, అతని సాధించిన రికార్డులు అమోఘమని టీమిండియా మాజీ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణి శ్లాఘించారు. ఈ తరం యువ స్పిన్నర్లకు అతను ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. అశ్విన్‌కు ఐకాన్ ఆఫ్ ద చెన్నై అవార్డును బహుకరించిన సందర్భంగా, ఆయన మాట్లాడుతూ, రవిచంద్రన్ గొప్పతనాన్ని వర్ణించేందుకు మాటలు రావడం లేదు. తమిళనాడుకే గాక యావత్ దేశానికే అతను గర్వకారణం.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.